
గురువారం 26 ఫిబ్రవరి 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





**అసెంబ్లీ వేదికగా వైసీపీ పాపాలు బద్దలు**

కల్తీ నెయ్యిపై చర్చ జరుగుతుంటే సభకు రారేం

- వివరాలు 9 లో..

# సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్





- ఈ ఏడాది జూలై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తి
- పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తా
- ప్రారంభించింది మేమే..పూర్తిచేసేదీ మేమే
- మార్కాపురం జిల్లాతో దశాబ్దాల కల సాకారం
- రూ.50 కోట్లతో కలెక్టరేట్‌నూ నిర్మిస్తాం
- జిల్లాకు తొలిసారి వచ్చా..అపూర్వస్వాగతం పలికారు
- గత పాలకులు పూర్తి కాకుండానే అంకితం చేశారు
- వెలిగొండపై వైసీపీ దొంగ డ్రామాలు మోసం కాదా?
- రూ.500 కోట్లే ఖర్చు చేసి పంగనామాలు పెట్టారు
- మంచి చేసిన వారికి అండగా నిలిస్తే బాగుంటారు
- ప్రజల కోసమే జీవితం..తెలుగుజాతి అభ్యున్నతే ముఖ్యం
- మార్కాపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన

**ప్రారంభించింది మేమే.. పూర్తి చేసేదీ మేమే...**

2

*ఈ ఏడాది జూలై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తి చేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్‌లు చేసి రైతులను మోసగించి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదు.. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నాం.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం..వెలిగొండకు శంకుస్థాపన చేసింది మేమే..దానిని పూర్తి చేసేది మేమేనని ఉద్ఘాటించారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లెలో రూ. 456 కోట్లతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు.*

## క్లస్టర్ ఆధారంగా

# ఉద్యోగాలు

- 22 ప్రాంతాల్లో ఎకోసిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం
- రాష్ట్రంలో యువత నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట
- పరిశ్రమల భాగస్వామ్యంతో కార్యక్రమాలు
- 760 పరిశ్రమల ట్రాకింగ్..
- కోర్సులు, మ్యాన్ పవర్‌పై మ్యాపింగ్
- త్వరలో నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తాం



4

*కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్లస్టర్ బేస్డ్ విధానాన్ని తీసుకుని ముందుకు వెళుతున్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. అసెంబ్లీలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. రాష్ట్రంలో యువత నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం. పరిశ్రమల భాగస్వామ్యం తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పా టు చేయడానికి ఎంవోయూ చేసుకున్న 760 పరిశ్రమలను మంత్రుల బృందం ట్రాక్ చేసిందని తెలిపారు. త్వరలో నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు.*

# ఆ గజదొంగ జగనేనా?

- బొత్స వ్యాఖ్యలకు లోకేష్ కౌంటర్
- హెరిటేజ్, వీఎస్ఆర్‌కు సంబంధం లేదు
- అవి నిరాధార ఆరోపణలేనని వ్యాఖ్య



6

*హెరిటేజ్‌కి.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కి ఎలాంటి సంబంధం లేదని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశా రు. ప్రతి నిరాధార ఆరోపణలకు తానెందుకు సమాధానం చెప్పాలి? అని ప్రశ్నించారు. చిల్లర దొంగలను పట్టుకుని.. గజదొంగ లను వదిలేస్తున్నారని బొత్స చేసిన వ్యాఖ్యలపై స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అంటే జగన్ గజదొంగ..పట్టుకోమని చెబుతున్నారా? అని నిలదీశారు.*

- **విల్లంబుల్ ఎక్కుపెట్టెన్..**



*ఉండవల్లి నివాసంలో లోకేష్ ఇచ్చిన విందుకి నంద్యాల, ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు హాజరై సందడి చేశారు. విల్లంబులు తీసుకొచ్చి లోకేష్‌కు కానుకగా ఇచ్చారు. సరదాగా విల్లు ఎక్కుపెట్టి ఇలా ఫొటోలు దిగారు.*

5

**లోకేష్ అండగా**

# భయం లేదిక.. పునర్విక..

- రూ.6 కోట్ల సమష్టి సాయం ప్రకటన
- యువనేత అభయం.. కుటుంబానికి ధైర్యం
- చికిత్సకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు

6



*ఎస్ఎంఏ టైప్ -1తో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక అనే బాలిక చికిత్సకు సాయం చేసేందుకు మంత్రి నారా లోకేష్ ముందుకొచ్చారు. సాయం చేయాలని బాలిక తల్లిదండ్రులు 'ఎక్స్'లో అభ్యర్థించడంతో మంత్రి స్పందించారు. రూ.6 కోట్లు సాయం అందిస్తామని ప్రకటించారు. చికిత్సకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.*

## ప్రజారోగ్యం ముఖ్యం..

# మళ్లీ రిపీట్ కావొద్దు

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- అతిసార, కల్తీ పాల ఘటనలపై సమీక్ష
- బాధితులకు వైద్యచికిత్సలపై ఆరా



3

# హిందూధర్మ వ్యతిరేకి జగన్..

## పులివెందులలో మరో మహాపచారం

- నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో నాటకం
- తీర్థాన్ని స్వీకరించకుండా కింద పారబోశారు
- అవిస్సుల్ని అగ్నిగుండంలో వేయకుండా వెనక్కు
- ఆలయాల్లో కార్యక్రమాలకు ఆయనను పిలిచి
- హిందూమతాన్ని హేళన చేయవద్దని కోరుతున్నా
- బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్

9



# సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్

- రిటైర్డ్ ఇంజనీర్ల బృందంతో అధ్యయనం చేయిస్తాం
- ఈ ఏడాది జూలై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తి
- పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తా
- శంకుస్థాపన చేసింది మేమే..పూర్తిచేసేదీ మేమే
- మార్కాపురం జిల్లాతో దశాబ్దాల కల సాకారం
- రూ.50 కోట్లతో కలెక్టరేట్‌నూ నిర్మిస్తాం
- జిల్లాకు తొలిసారి వచ్చా.. అపూర్వస్వాగతం పలికారు
- గత పాలకులు పూర్తి కాకుండానే అంకితం చేశారు
- వెలిగొండపై వైసీపీ దొంగ డ్రామాలు మోసం కాదా?
- రూ.500 కోట్లే ఖర్చు చేసి పంగనామాలు పెట్టారు
- మంచి చేసిన వారికి అండగా నిలిస్తే బాగుంటారు
- ప్రజల కోసమే జీవితం.. తెలుగుజాతి అభ్యున్నతే ముఖ్యం
- మార్కాపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన



మార్కాపురం(చైతన్యరథం): ఈఏడాది జూలై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తి చేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్‌లుచేసి దొంగ నాటకాలు ఆడటం తమకుచేతకాదని వ్యాఖ్యా నించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టు కున్నామని ఉద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. దీనికోసం విశ్రాంత ఇంజనీర్లతో ఓ బృందాన్ని వేసి అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు ఇచ్చే అంశంపై బ్లూ ప్రింట్ తయారు చేస్తామని అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లెలో రూ.456 కోట్లతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రైతులతో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం మార్కాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 'గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేటు ఇచ్చారు. అరకు మొదలుకుని ప్రకాశం వరకూ మంచి విజ యం చేకూర్చారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం, మదనపల్లి, పోలవరం ప్రాంతాలను జిల్లాలు చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకున్నాను. ఇక్కడి ప్రజలు 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలుకు వెళ్లాల్సిన పని లేకుండా మార్కాపురాన్ని జిల్లా చేశాను. అన్యాయం జరిగిన మదనపల్లికి న్యాయం చేశా' అని తెలిపారు.

## శంకుస్థాపనతో పాటు ప్రారంభించే అవకాశం వచ్చింది

1996, మార్చి 5న ఈ ప్రాంతంలో నేను పర్యటించినప్పుడు ప్రజల కష్టాలు కళ్లారా చూశాను. శ్రీశైలం నుంచి నీరివ్వమని ఇక్కడి ప్రజలు నన్ను కోరారు. ఆనాడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాం. భగవంతుడు మళ్లీ నాకే అవకాశం ఇచ్చాడు. వెలుగొండను పూర్తి చేసి మీ జీవితాల్లో వెలుగులు తెస్తాను.. రైతులను ఆదుకుంటాం. 2014-2019లో ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించాం. ఈ ప్రాజెక్టు ద్వారా 4.35 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యం. దీనివల్ల గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గా లకే కాకుండా ఉదయగిరి, కడప జిల్లా బద్వేలుకు కూడా నీరు అందుతుంది. 2019లో మనమే అధికారంలోకి వచ్చి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీరిచ్చేవాళ్లం. 2019-2024 మధ్య చీకటిరోజులు వచ్చాయి. గత ముఖ్యమంత్రి వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ దొంగ నాటకాలు ఆడాడు. చీమకుర్తి, మార్కాపురం సభల్లో 2023లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చాడు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కటింగ్ చేశాడు. ఇలా చేయడం మోసం కాదా అని ప్రశ్నించారు.

## మంచి చేసిన వారికి అండగా నిలవాలి

నేను చేయగలిగిందే చెబుతున్నాను. వెలిగొండ ప్రాజెక్టుకు పూర్తికి రూ.9081 కోట్ల నిధులు కావాలి. ఇప్పటివరకూ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు వ్యయం చేశాం. భూసేకరణ కు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేశాం. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశాం. ఇంకా రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపట్టాం. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశాను. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.500 కోట్లు ఖర్చు చేసి పను లు అయిపోయాయని రైతులకు పంగ నామాలు పెట్టారు. మంచి చేసిన వారికి అండగా నిలుస్తేనే ప్రజల జీవితాలు మెరుగవుతా యని వ్యాఖ్యానించారు.

## రూ.1300 కోట్లతో ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు

అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. ఎక్కడ పేదలు ఉంటే అక్కడ నేను ఉంటాను. ఎన్నికల్లో చెప్పినట్టే సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ చేశాం. పింఛన్ల కోసం ప్రతిఏటా రూ.34 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీ శక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు రావాలని డ్వాక్రా సంఘాలు స్థాపించాను. ఈ ఏడాది లక్షమంది ఆడబిడ్డలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీపం పథ కం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్న దాత సుఖీభవ కింద రైతులకు మూడు విడతల్లో రూ.20,000 ఇస్తున్నామని తెలిపారు.

## పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేస్తాం

2027లో పుష్కరాలకు ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. నల్లమల సాగర్‌కు గోదావరి నీళ్లు ఇస్తాం. అది వచ్చేలోగా ఈ ఏడాది జూలై నాటికి నల్లమల సాగర్ పూర్తి చేసి వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టు కోసం ఇంకా రూ.2 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. గతేడాది హంద్రీనీవాపై శ్రద్ధ పెట్టాం. ఈ ఏడాది వెలిగొండపై శ్రద్ధ పెట్టి ప్రజల జీవితాల్లో జలకళ తీసుకొస్తాం. హార్టికల్చర్‌కు ఎక్కువ ప్రాధాన్య ఇస్తున్నాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తున్నాం. సీమతో పాటు మార్కాపురం, ప్రకాశం జిల్లాలను ఉద్యాన పంటలతో అభివృద్ధి చేస్తాం. మార్కాపురాన్ని ఉద్యాన పంటలకు కేంద్రంగా తయారు చేసేందుకు ప్రజలు సహకరిం చాలి. రూ.1300 కోట్లు వ్యయంతో నల్లమల సాగర్ నుంచి ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు.

## మార్కాపురం ప్రజల ఆకాంక్ష నెరవేర్చాం

ప్రజలకు హామీ ఇచ్చినట్టుగానే మార్కాపురాన్ని జిల్లాగా చేసి ఇక్కడి ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చాం. మార్కాపురం జిల్లాలో భూ రికార్డుల సమస్యలున్నాయి. మేము అధికారంలోకి వస్తూనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. గత పాలనలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏలో పెట్టారు. సర్వే రాళ్లపై వారి ఫొటోలు వేసుకున్నారు. మేము రాజముద్రతో పట్టదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తు న్నాం. క్యూఆర్ కోడ్‌తో భూమి రికార్డులు భద్రంగా తయారు చేయిస్తున్నాం. ఎవరైనా తప్పు రికార్డులు చేస్తే తాట తీస్తామని హెచ్చరిస్తున్నాను. మార్కాపురం జిల్లా నూతన కలెక్టరేట్ భవనా నికి రూ. 50 కోట్లు మంజూరు చేస్తున్నాం. 20 నెలల పాలనలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. యువత కు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటాం. అవినీతికి తావు లేకుండా మెగా డీఎస్సీ నిర్వహించాం. కానిస్టేబుళ్ల నియామ కాలు పూర్తి చేశాం. వరదనీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు పెంచుతాం. గోదావరి నుంచి 6000 టీఎంసీలు, కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లింది. వెలిగొండ ప్రాజెక్టుకు కావాల్సింది కేవలం 53 టీఎంసీల నీరే. ఈ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో సురక్షిత నీరు సరఫరా చేస్తాం. పరిశుభ్రమైన రాష్ట్రం కోసం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నాం. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ4 కార్యక్రమం చేపట్టాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని తెలిపారు.

## 2019-24 మధ్య రాష్ట్రానికి చీకటిరోజులు

గత పాలకులు చేయని అపచారం లేదు.కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారు. కెమికల్స్ కలిపిన నెయ్యితో లడ్డూలు చేసి విక్రయించారు. ఆ నెపాన్ని హెరిటేజ్ పై మోపారు. ఆనాడు బాబాయ్‌ని చంపేసి మరుసటి రోజు సాక్షి పత్రికలో నారా సుర రక్త చరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టాడు.నోరు తెరిస్తే బూతులు మాట్లాడతారు. నా తల్లి,సతీమణి, మా పార్టీ నేతలను ఇష్టాను సారంగా దుర్భాషలాడారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రారు కానీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలంటారు. వాళ్లు బెదిరిస్తే ఇవ్వాలా.. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓట్లు వేస్తేనే ఏదైనా సాధ్యం అని కూడా వారికి తెలీదా? గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడ్డారు. గంజాయి, భూ కబ్జాలు,దౌర్జన్యాలతో హడలి పోయారు. నేను ఎవరు తిట్టినా లెక్కపెట్టుకోను. నేను జీవిస్తోంది ప్రజలు, రాష్ట్రం కోసమే. నాకు కుల, మత విభేదాలులేవు.తెలుగు జాతిఅభ్యున్నతి నాకు ముఖ్యం. బడుగు,బలహీనవర్గాలను పైకి తీసుకొచ్చి అవకాశాలు కల్పిస్తాం.నేను ఆనాడు టెక్నాలజీని ప్రమోట్ చేశాను. మన దూరదృష్టి కారణంగా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచివస్తోంది. గుజరాత్ రాష్ట్రంలో 25 ఏళ్లుగా ఒకే పార్టీ అధికారంలో ఉంది. మోదీ 3వ సారి ప్రధాని అయ్యారు. మరో సారి అవుతారు. ప్రజలు ఏది మంచి, ఏది చెడు అనేది ఆలోచన చేసి కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమర్థులను గెలిపించాలని కోరారు.

## స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కాలువ పనులు పరిశీలన

వెలిగొండప్రాజెక్టు ఫీడర్ కాలువ పనుల శంకుస్థాపన అనంతరం రైతులు వెంకటేశ్వరరెడ్డి, సురవరం గండి వీరారెడ్డిలతో సంభాషిస్తూ ఫీడర్ కెనాల్‌పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. వెలిగొండ పూర్తి అయితే ఈప్రాంత భూగర్భజలాలు కూడా పెరుగుతాయని, బోర్లకు, చెరువులకు నీరు వస్తాయని ముఖ్యమంత్రికి రైతులు వివరించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు పనులు, ఫీడర్ కాలువ పనులు వేగంగా చేపడుతున్నందుకు ముఖ్యమంత్రికి స్థానిక రైతులు ధన్యవాదాలు తెలిపారు. అరటి, బొప్పాయి లాంటి పంటల సాగుచేసేందుకు అను కూల ప్రాంతమని, మీరే శంకుస్థాపన చేశారు, మీరే ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేస్తున్నారని సీఎంతో రైతులు ఆనందంతో అన్నారు. ప్రాజెక్టులో రూ.2500కోట్ల విలువైన పనులు మిగిలి ఉన్నా వాటిని పూర్తి చేయకుండా జాతికి అంకింతం చేసినట్టు గతపాలకులు నాటకాలాడారని ఈ సందర్భంగా చంద్రబాబు వారితో వ్యాఖ్యానించారు.



# నిర్దేశిత గడువులోగా వెలిగొండ పనులు

## పురోగతిని ఎప్పటికప్పుడు తెలియజేయాలి - ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం





మార్కాపురం(చైతన్యరథం): వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేసేందుకు మార్కాపురం వచ్చిన సీఎం చంద్రబాబు ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనులు జరుగుతున్న తీరుపై బుధవారం అధికారులతో సమీక్షించారు. 11,580 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా ఫీడర్ కాలువ పనులు చేపట్టామని జల వనరుల శాఖ అధికారులు వివరించారు. నల్లమల సాగర్ ప్రాంతంలో మూడు గ్యాప్స్ ఫిల్ చేసి రిజర్వాయర్ ఏర్ప డిందని, తద్వారా 53.83 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రోజుకు 200 మీటర్ల మేర కాలువ లైనింగ్ పనులు చేస్తున్నామని, 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మేర సైడ్ వాల్ పనులు మే చివరి నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి తెలిపారు. ఫ్లడ్ సీజన్ ప్రారంభం అయ్యే సమయానికి ఫీడర్ కాలువ సిద్ధం అయిపోతుందని వెల్లడించారు. 45 రోజుల్లో 45 టీఎంసీల మేర నీరు డ్రా చేసుకుని నల్లమల సాగర్ నింపేందుకు ప్రణాళిక చేసినట్టు అధికారులు వివరించారు. వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలు, కాలువ పనులు తదితర అంశాలను నమూనా ద్వారా వివరించారు. కంభం చెరువును కూడా నింపేలా కాలువను అనుసంధానించినట్టు తెలిపారు. స్థానికంగా వివిధ చెరువులు, నీటి వనరులను నింపేందుకు అవసరమైన స్ట్రక్చర్లను పూర్తి చేయాలని సీఎం అధికారులకు ఆదేశించారు. రూ.400 కోట్లతో ఈ పనులు చేపట్టేందుకు వీలుగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. వెలిగొండ టన్నెళ్ల పనులు పూర్తి అయ్యాక పోరుమామిళ్ల, రాచర్లకు కూడా నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేయాలని, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి ఎప్పటికప్పుడు తనకు తెలియచేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.



### ప్రజారోగ్యం ముఖ్యం..

# మళ్లీ రిపీట్ కావొద్దు

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- అతిసార, కల్తీ పాల ఘటనలపై సమీక్ష
- బాధితులకు వైద్యచికిత్సలపై ఆరా




అమరావతి(చైతన్యరథం): ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి..ఎక్కడా నిర్లక్ష్యం వహించొద్దని ముఖ్యమంత్రి చంద్రబా బు ఆదేశించారు. శ్రీకాకుళం డయేరియా, రాజమండ్రి పాల ఘటనలపై బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల అధికారులతో సమీక్షించారు. శ్రీకాకుళం, రాజ మండ్రి ఘటనల్లో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో సీరియస్ కండిషన్‌లో ఉండి చికిత్స పొందుతున్న ఇద్దరి బాధి తుల ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. చికిత్సపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఒకరు వెంటిలేటర్ మీద చికిత్స పొందుతున్నారని.. మరొకరికి డయాలసిస్ అందిస్తున్నామని అధికారులు వివరించారు. వారిద్దరి వైద్యచికిత్సపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఇంకా ఏమైనా కేసులు నమోదవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. శ్రీకా కుళం ఘటనలో ప్రస్తుతానికి 76 మంది వివిధ ఆస్పత్రుల్లో చికి త్స పొందుతున్నారని తెలిపిన అధికారులు.. ఇద్దరు మినహా అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. పైపులైన్ ద్వారా నీటి సరఫరాను ఆపేశామని.. ప్రత్యామ్నాయాల ద్వారా సురక్షితమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు. రాజమండ్రి పాల ఘటనలో బాధితులు నిరంతర వైద్యుల పర్యవే క్షణలో ఉన్నారని చెప్పారు. పాల శాంపిళ్లను ఇప్పటికే ల్యాబ్‌కు పంపామని, శాఖపరంగా దీనిపై ప్రత్యేక ఫోకస్ పెట్టామని వెల్లడిం చారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని.. ఎక్కడా నిర్లక్ష్యం వహించొద్దని..ఇలాంటి ఘటనలు రిపీట్ కాకుండా వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### ప్రభుత్వ బడికి

# సరికొత్త రూపం తెచ్చారు..

### సగరపేట మాస్టారుపై మంత్రి లోకేష్ ప్రశంసలు

అమరావతి(చైతన్యరథం): కాకినాడ జిల్లా జగ్గంపేట మండ లం సగరపేటలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఎస్జీటీ పీవీవీ. సత్య నారాయణ మాస్టారు బడిబాగు కోసం చేస్తున్న కృషి అభినం దనీయమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రశంసిం చారు. సొంత నిధులు దాదాపు రూ.10 లక్షలు, దాతల విరాళా లు రూ.1.80 లక్షలతో కార్పొరేట్ స్కూల్‌ను తలదన్నేలా తీర్చి దిద్ది స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. క్లాసు రూమ్‌లో టైల్స్, గ్రౌండ్ ఫ్లోరింగ్, పెయింటింగ్, వాల్ రైటింగ్, కాంపౌండ్ వాల్ రంగులతో కొత్తందాలు సంతరించుకునేలా చేశారని కీర్తించారు. నాలుగు కంప్యూటర్లతో డిజిటల్ క్లాస్ రూం, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయం.

పాఠశాల హెచ్‌ఎం, ఉపా ధ్యాయుల సహకారంతో వచ్చే విద్యా సంవత్సరంలో 64 మంది పిల్లలు కొత్తగా బడిలో చేరుస్తున్న మీ అంకితభావానికి హ్యాట్సాఫ్. ఈ పాఠశాల అభివృద్ధికి అన్నివిధాలా సహాయం అందిస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు అభినందనలు తెలిపారు.



# క్లస్టర్ ఆధారంగా ఉద్యోగాలు

- 22 ప్రాంతాల్లో ఎకోసిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం
- రాష్ట్రంలో యువత నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట
- పరిశ్రమల భాగస్వామ్యంతో కార్యక్రమాలు
- మంత్రులతో ఉపసంఘం ఏర్పాటు చేశాం
- 760 పరిశ్రమల ట్రాకింగ్..
- కోర్సులు, మ్యాన్ పవర్‌పై మ్యాపింగ్
- త్వరలో నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తాం
- సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్‌పై
- న్యూసౌత్ వేల్స్ వర్సిటీతో ఒప్పందం
- న్యాక్ బలోపేతంతో ప్రపంచస్థాయి
- భవన నిర్మాణ కార్మికులను తయారుచేస్తాం
- అభివృద్ధి వికేంద్రీకరణ ప్రజాప్రభుత్వ లక్ష్యం
- శాసనసభలో మంత్రి నారా లోకేష్



అమరావతి(చైతన్యరథం): సూపర్-6లో ఇచ్చిన తొలి హామీ.. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన.. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ప్రజాప్రభుత్వ లక్ష్యం.. అందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్లస్టర్ బేస్డ్ విధానాన్ని తీసుకుని ముందుకు వెళుతున్నాం.. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అసెంబ్లీలో స్కిల్ డెవలప్‌మెంట్ ఫలితాలు,అందుకు సంబంధించిన వివరాలపై ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ,యార్లగడ్డ వెంకట్రావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వెంకటరాజు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. రాయలసీమ, అనం తపురంలలో ఆటోమోటివ్ క్లస్టర్, కర్నూలులో రెన్యూవబుల్ ఎనర్జీ,సిమెంట్ క్లస్టర్, కడప, చిత్తూరులో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్, నెల్లూరులో గ్లాస్, ఏసీ క్లస్టర్ వస్తోంది. ప్రకాశంజిల్లాలో కంప్రెస్డ్ బయో గ్యాస్ క్లస్టర్, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ క్లస్టర్, గోదావరి జిల్లాలో ఆక్వా క్లస్టర్, ఉత్తరాంధ్రలో ఫార్మా,మెడికల్ డివైసెస్ మ్యానుఫ్యాక్చరింగ్, స్టీల్ క్లస్టర్ వస్తున్నాయి. డ్రోన్ సిటీ,స్పేస్ సిటీ కూడా వస్తున్నాయి. ఆయా క్లస్టర్లలో వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్ చాలా అవసరం. కేవలం బేసిక్ మ్యానుఫ్యాక్చరింగ్ మాత్రమే కాకుండా అనుబంధ తయారీ యూనిట్లు కూడా అదే క్లస్టర్‌లోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. యాపిల్ మొబైల్ సంస్థ డిజైనింగ్, మార్కెటింగ్ చేస్తుంది. మ్యానుఫ్యాక్చరింగ్ ఫాక్స్‌కాన్ చేస్తుంది. అయితే అన్ని కాంపొ నెంట్‌లను ఫాక్స్ కాన్ తయారు చేయదు. 2 వేల మంది సప్లయర్స్ దగ్గర నుంచి ఫాక్స్ కాన్ కాంపొనెంట్స్ కొనుగోలు చేస్తుంది. వారందరినీ ఒక ఎకోసిస్టమ్‌లోకి తీసుకురావాలన్నది మా ఆలోచన. మరొకటి గ్లాస్ మ్యానుఫ్యాక్చరింగ్. భారతదేశంలో గ్లాస్ వినియోగం పెరుగుతోంది. ఇందుకు సంబంధించిన పరిశ్రమలను ఒకే క్లస్టర్‌లోకి తీసుకురావాల్సి ఉందని పేర్కొన్నారు.

### ఎకోసిస్టమ్ ఏర్పాటు చేయాల్సి ఉంది

మరొకటి సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్. వేఫర్ మ్యాను ఫ్యాక్చరింగ్‌కు సంబంధించి ఉత్తరాంధ్రకు కొన్ని, రాయలసీమకు కొన్ని పరిశ్రమలు వస్తున్నాయి. ఇందుకు సంబంధించి యూనివ ర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (సిడ్నీ)తో సంప్రదించి ర్యాపిడ్ ప్రొటో టైపింగ్ టెస్టింగ్, డిజైన్ సెంటర్‌ను తిరుపతి ఐఐటీకి తీసుకు రావడానికి కృషిచేస్తున్నామని తెలిపారు. క్లస్టర్ విధానంలో వర్టికల్ అంటే వివిధ రకాల కంపెనీలను తీసుకురావడం. హారిజాంటల్ అంటే ఎడ్యుకేషన్. అందులో స్కిల్ డెవలప్‌మెంట్ కీలకమైన పాత్ర పోషిస్తుంది. కోర్సులను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్‌కు సంబంధించిన బీటెక్, ఎంటెక్, రిసెర్చ్ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెట్టేందుకు తిరుపతి ఐఐటీ డైరెక్టర్‌తో మాట్లాడుతున్నాం. క్లస్టర్‌లో టెస్టింగ్, సర్టిఫికేషన్ సౌకర్యాలను కల్పించాల్సి ఉంటుంది. భారతదేశంలో తయారయ్యే 100 ఏసీలలో 50 ఆంధ్రప్రదేశ్‌లోనే తయారవుతున్నాయి. భారీ పరిశ్రమల మంత్రి టీజీ భరత్ కృషితో డైకిన్, ఎల్ జీ, బ్లూస్టార్ వంటి కంపెనీలు వచ్చాయి. దీనివల్ల రాబోయే రెండేళ్లలో ఏపీలో ఏసీల ఉత్పత్తి 70శాతానికి పెరుగుతుంది. నేను వాళ్లను కలిసినప్పుడు ఐటీఐలను తమ యూనిట్లకు అనుసంధానించాలని కోరారు.కరిక్యులమ్, ఎక్విప్‌మెంట్ తామే ప్రొవైడ్ చేసి గైడ్ చేస్తామని, ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలని చెప్పారు. కీలకమైన హీట్ పంప్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ ఇక్కడే ఏర్పాటు చేయాలని కోరారు. యూరప్ పంపి ఒక్కొక్క హీట్ పంప్ టెస్ట్ చేయడానికి సుమారు 5 లక్షల యూరోలు అవుతుంది. అందుకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను స్థానికంగా ఏర్పాటు చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

### 760 పరిశ్రమల ట్రాకింగ్

రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుచేయడానికి ఎంవోయూ చేసుకున్న 760పరిశ్రమలను మంత్రుల బృందం ట్రాక్ చేసింది. జీవోఎంలో నాతోపాటు పరిశ్రమల మంత్రి భరత్,విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్,టూరిజం మంత్రి కందుల దుర్గేష్ సభ్యులుగా ఉన్నాం. వారందరితో చర్చలు జరిపి వారికి కావాల్సిన కోర్సులు, మ్యాన్ పవర్‌పై మ్యాపింగ్ చేశాం. దీనిపై ఒక్కొక్క సెక్టార్‌కు ఒక్కొక్క ఇండస్ట్రీ లీడర్‌ను గుర్తించి వారికి బాధ్యత అప్పగిస్తున్నాం. సిస్టమాటిక్‌గా 22 క్లస్టర్లలో ఎకోసిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం. సుజలాన్‌తో మాట్లాడి 5 గ్రీన్ ఎనర్జీ ల్యాబ్‌లు ఏర్పాటుచేసి ఏటా 12వేల మంది టెక్నీషియన్లకు విండ్ ఎనర్జీలో శిక్షణ ఇస్తున్నాం. ఏఐ అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కోసం మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్‌తో ఒప్పందం చేసుకున్నాం. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఒక ఐటీఐని ఎడాప్ట్ చేసుకుని వారికి కావాల్సిన సాంకేతికతతో మెకానిక్‌లకు శిక్షణ ఇస్తుందని తెలిపారు.

### సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్.. మ్యాన్ పవర్ పైప్‌లైన్

యువగళం పాదయాత్రలో ఆటో మెకానిక్‌లు, టూవీలర్ మెకా నిక్‌లను కలిశాను. ప్రస్తుతం టెక్నాలజీ అప్‌గ్రేడ్ అయినందున కొత్త సాంకేతికతలపై వారికి కావాల్సిన ట్రైనింగ్ అందించడానికి ఇండస్ట్రీతో టై అప్ కావాల్సి ఉంది. ఈ నెలలోనే సెయింట్ గోబిన్స్ తో ఒక ఒప్పందం కుదుర్చుకుంటున్నాం.న్యాక్‌లో ఫాల్ సీలింగ్ అండ్ డ్రైవ్ ఆన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఆసియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో మరో సీఓఈ,ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయస్థాయి మ్యాన్ పవర్ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నాం. అల్ట్రాటెక్, శ్రీ సిమెంట్స్‌తో మాట్లాడాం. సిమెంట్ ఎకోసిస్టమ్‌లో కూడా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తున్నామని వివరించారు.

### 1587 జాబ్‌మేళాలు..
### 1,08,747 మందికి ఉద్యోగాలు

ప్రతి నియోజకవర్గంలో 3 నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఇప్పటి వరకు 1587జాబ్ ఫెయిర్లు నిర్వహించాం. 11,373 కంపెనీలు పాల్గొని 1,08,747 మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగింది. జాబ్ మేళాల్లో ఎమ్మెల్యేలంతా భాగస్వాములు కావాలి. ప్రస్తుతం లిఫ్ట్ మెకానిక్‌ల షార్టేజీ ఎక్కువగా ఉంది. నెలకు రూ.30వేలు జీతం ఇస్తామన్నా ఆ టెక్నీషియన్లు దొరకడం లేదు. ఎలక్ట్రీషియన్లు, క్వాలిటీ ప్లంబర్లకు కూడా తీవ్రమైన కొరత ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్, న్యాక్ ద్వారా 73వేల మందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. అందులో 40వేల మందికి ఉద్యోగాలు లభించాయి. కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి పీఎం విశ్వకర్మ పథకాన్ని కూడా ప్రవేశపెట్టారు. బీసీ సంక్షేమ మంత్రి, ఎంఎస్‌ఎంఈ మంత్రులతో మాట్లాడి ఇప్పటికే 1.89 లక్షల మందికి అందులో శిక్షణ ఇచ్చాం. క్యాంపస్‌లలో ఏఐ, మిషన్ లెర్నింగ్‌పై యాడ్ ఆన్ కోర్సులు తీసుకు వచ్చి 3.11 లక్షల మందికి శిక్షణ ఇచ్చామని వివరించారు.

### త్వరలో నైపుణ్యం పోర్టల్

ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి,ఉపముఖ్యమంత్రి స్కిల్ సెన్సస్‌పై విస్తృతంగా చర్చించారు. మంగళగిరిలో స్కిల్ సెన్సస్ చేపట్టాలని ప్రయత్నించినపుడు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం.ఆ అనుభవంతో స్కిల్ ఎసెస్‌మెంట్ చేయాలని నిర్ణయించాం. అందులో భాగంగా త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించబోతున్నాం. ఇందులో ఆధార్ బేస్డ్ క్రెడెన్షియల్ వెరిఫికేషన్‌తోపాటు బిల్డ్ యువర్ ఓన్ రెస్యూమ్ కాలమ్ ద్వారా విద్యార్థులు తమ రెస్యూమ్‌ను అప్‌లోడ్‌చేయడంతో అప్‌గ్రేడ్ చేయవచ్చు. ఇందులో ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా ఏఐ బేస్డ్ స్కిల్ కోర్సులను కూడా నేర్చుకోవడానికి అవకాశంకల్పిస్తాం. కాన్వర్సేషన్ ఏఐ టూల్‌ద్వారా సెల్ఫ్ అసెస్‌మెంట్ చేసుకోవడానికి ఇందులోఅవకాశం ఉంటుంది. ఏసీ మెకానిక్ నుంచి ఏఐ ఇంజనీర్ వరకు అసెస్‌మెంట్‌కు అవకాశం కలుగుతుంది. ప్రపంచంలోనే తొలిసారిగా ఇటువంటి పోర్టల్‌ను ప్రవేశపెట్టబోతున్నాం. మార్చి చివరి నాటికి ఇది పూర్తిస్థాయిలో సిద్ధమవు తుంది. ఏఐ బేస్డ్ ఎగ్రిగేషన్ ద్వారా ఉద్యోగ అవకాశాలను కూడా ఇందులో అందుబాటులో ఉంచుతాం. ఏఐ ట్యూటర్ ద్వారా ఇంటర్వ్యూలకు శిక్షణకూడా ఇస్తామని వివరించారు.

### ఓంక్యాప్ ద్వారా లాంగ్వేజ్ ట్రైనింగ్

నర్సింగ్‌పై పారా మెడికల్ కోర్సుల్లో కూడా ట్రైనింగ్ ఇవ్వాలని సభ్యులు కోరారు. యూరప్, జపాన్, జర్మనీలలో ఈ కోర్సులకు చాలా డిమాండ్ ఉంది. ఇందుకోసం ఓంక్యాప్ ద్వారా లాంగ్వేజ్ ట్రైనింగ్ చేస్తున్నాం. ఇప్పటికే 150 మందిని వివిధ దేశాలకు పంపించాం. 5 లక్షల మందిని విదేశాలకు పంపడం మా లక్ష్యం. గతంలో ఎపెక్స్ స్కిల్ యూనివర్సిటీ, పార్లమెంటు, నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ కాలేజి ఏర్పాటుచేస్తామని హామీఇచ్చారు. కానీ ఒక్కటి కూడా అమలు కాలేదు. గతంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ సిబ్బందితో పార్టీ పనిచేయించి ఉంటే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. జాబ్‌మేళాల నిర్వహణలో క్వాలిటీ పెంచుతాం. అందరం కలిసికట్టుగా పనిచేస్తే 175 నియోజకవర్గాల్లో ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించవచ్చు.

### ప్రతి స్కిల్ కేంద్రంలో
### సీసీ టీవీ, ఫేస్ రిక్నగ్నిషన్ సిస్టమ్

ప్రతి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సీసీ టీవీ మానిటరింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నాం. ఫేషియల్ రిక్నగ్నిషన్ సిస్టమ్ కూడా అమలు చేస్తున్నాం. డైట్, బీఎడ్, ఇంజనీరింగ్ కాలేజీలలో కూడా ఎఫ్‌ఆర్‌ఎస్ పెట్టాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. న్యాక్‌ను బలోపేతం చేసి, వరల్డ్ క్లాస్ క్వాలిటీ వర్కర్స్‌ను తయారు చేస్తాం. రాబోయే 90 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన న్యాక్‌ను బలోపేతం చేసే చర్యలు చేపట్టబోతున్నాం. ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌పై యార్లగడ్డ నేతృత్వంలో ఐదుగురితో ఒక కమిటీవేస్తామని పేర్కొన్నారు.

## రాష్ట్ర భవిత మీరే..

**- అమ్మలాంటి తెలుగుభాషను మరవొద్దు**

**- అసెంబ్లీ లాబీలో విద్యార్థులతో లోకేష్ చిట్‌చాట్**





అమరావతి(చైతన్యరథం): పిల్లలే రాష్ట్ర భవిత.. రాబోయేకాలంలో చరిత్ర సృష్టించేది నేటి విద్యార్థులే.. ఇంగ్లీషులో చదువుకుంటున్నా, అమ్మలాంటి తెలుగు భాషను మరువొద్దని విద్యా మంత్రి నారా లోకేష్ సూచించారు. అసెంబ్లీ చూడటానికి బుధవారం సత్తెనపల్లి నియోజకవర్గం సుగాలి జెడ్పీ హైస్కూలు నుంచి వచ్చిన విద్యార్థులతో లోకేష్ ముచ్చటించారు. అసెంబ్లీని ప్రత్యక్షంగా చూడటం ఎలా ఉంది? మీరు చూస్తున్నప్పుడు అసెంబ్లీలో ఏ అంశంపై చర్చ జరిగింది? అని ప్రశ్నించారు. అసెంబ్లీ కార్యకలాపాలు ప్రత్యక్షంగా చూడటం వల్ల చాలా విషయాలు తెలిశాయని వారు లోకేష్‌కు వివరించారు. కెరీర్, ఎడ్యుకేషన్‌కోసం ఇంగ్లీషులో నైపుణ్యం కనబరుస్తూనే.. మాతృ భాష తెలుగును మర్చి పోవద్దని లోకేష హితబోధ చేశారు. విదేశాల్లో ఎక్కువ కాలం చదువుకోవడం వల్ల మొదట్లో తెలుగు రాక తాను ఇబ్బంది పడిన విషయాన్ని వారితో పంచుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న యూనిఫామ్ ఎలా ఉంది? టీచర్లు పాఠాలు ఎలా చెబుతున్నారు? మధ్యాహ్నం భోజనం రుచిగా ఉంటుందా? రాగిజావ అందుతోందా? అని అడిగి తెలుసుకున్నారు.

చైతన్యరథం





# కృష్ణా తీరం.. ఆత్మీయ సంబరం





**- ఏలూరు, నంద్యాల పార్లమెంటు ప్రజాప్రతినిధులకు లోకేష్ విందు**

**- యువనేతకు విల్లంబుల కానుక.. ఎక్కుపెట్టి విజయనినాదం**

అమరావతి(చైతన్యరథం): కృష్ణా తీరం..ఆత్మీయ సంబరానికి వేదికైంది. ఉండవల్లి నివాసంలో బుధవారం కృష్ణానది ఒడ్డున మంత్రి నారా లోకేష్ ఇచ్చిన విందు సమావేశానికి కృష్ణా నదీ జలా ల వినియోగ ప్రాంతాలైన నంద్యాల, ఏలూరు పార్లమెంటు నియో జకవర్గ ప్రజాప్రతినిధులు కుటుంబసభ్యులతో కలిసి హాజరై సంద డి చేశారు. వీరి మధ్య కృష్ణా నీటి గురించి ఆసక్తికర సంభా షణ నడిచింది. అన్న ఎన్టీఆర్ కృష్ణా జిల్లా వాసి అయినా ముఖ్య మంత్రి అయ్యాక రాయలసీమ అవసరాలు గుర్తించి వారికే ముందు నీరివ్వాలని పట్టుబట్టి మరీ ప్రాజెక్టులు పూర్తిచేశారని నాటి సంగతులను సీనియర్ నేతలు గుర్తు చేశారు. అందరినీ ఆత్మీ యంగా పలకరించిన లోకేష్ వారి యోగక్షేమాలు తెలుసుకున్నా రు. నంద్యాల ప్రజాప్రతినిధులు విల్లంబులు తీసుకొచ్చి లోకేష్‌కు కానుకగా ఇచ్చారు. సరదాగా లోకేష్ విల్లు ఎక్కుపెట్టారు. అంద రూ విజయనినాదం చేస్తూ ఫొటోలు దిగారు. పార్లమెంట్ల వారీగా నేతలతో ఫొటోలు దిగారు. కుటుంబాలతో మాట్లాడుతూ వారిచ్చిన కానుకలు స్వీకరించి ప్రతిగా మంగళగిరి పట్టుచీరలు పెట్టారు. నేతలు తనకు ఇచ్చిన గ్రీవెన్స్ స్టేటస్ రిపోర్టు వారికి అందజేశారు. చాలా చక్కని సంప్రదాయం నెలకొల్పిన మంత్రి లోకేష్‌ను కైకలూ రు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆశీర్వదించారు. ఈ ఆత్మీయ సమావేశానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎమ్మెల్యేలు మంత్రి కొలుసు పార్థసారధి (నూజివీడు), చింతమనేని ప్రభాకర్ (దెందులూరు), బడేటి రాధాకృష్ణయ్య (ఏలూరు), సొంగా రోషన్ (చింతలపూడి), కామినేని శ్రీనివాస్ (కైకలూరు), పత్సమట్ల ధర్మరా జు (ఉంగుటూరు), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, నంద్యా ల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ (నంద్యాల), మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి (బనగానపల్లె), భూమా అఖిలప్రియ(ఆళ్లగడ్డ), కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి (డోన్), బుడ్డా రాజ శేఖర్ రెడ్డి (శ్రీశైలం), గిత్తా జయసూర్య (నందికొట్కూరు), గౌరు చరితారెడ్డి (పాణ్యం) కుటుంబసభ్యులతో హాజరయ్యారు.





















# ఆ గజదొంగ జగనేనా?



- బొత్స వ్యాఖ్యలకు లోకేష్ కౌంటర్
- హెరిటేజ్, వీఎస్ఆర్‌కు సంబంధం లేదు
- అవి నిరాధార ఆరోపణలేనని వ్యాఖ్య

అమరావతి(చైతన్యరథం): హెరిటేజ్‌కి.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కి ఎలాంటి సంబంధం లేదని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మాజీ మంత్రి వివేకారెడ్డిని చంపి ఆ కత్తి తమ చేతిలో పెట్టారు..ఇప్పుడు కూడా వీఎస్ఆర్ ఏవియేషన్‌పై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు అలాంటివేనని వ్యాఖ్యానించారు. హెరిటేజ్ ఫిన్ లీస్ 1996లో స్థాపించిన సంస్థ అని చెప్పుకొచ్చారు. 2022 లో వీఎస్ఆర్ ఏవియేషన్ స్థాపించారని ప్రస్తావించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి లోకేష్ చిట్‌చాట్ చేశారు. హెరిటేజ్ ఫిన్‌లీస్ వద్ద ఫైనాన్స్ తీసుకుంది.. అనేక ఇతర సంస్థల మాదిరిగానే వీఎస్ఆర్ కూడా ఫైనాన్స్ తీసుకుందని స్పష్టం చేశారు. ఆ రోజు తాము అధికారంలోకి వస్తామని, తమ ఎంపీ ఏవియేషన్ మంత్రి అవుతారని, మహారాష్ట్ర దివంగత మాజీ డిప్యూటీ సీఎం అజిత్‌పవార్ వీఎస్ఆర్ ఫ్లైట్ ఎక్కుతారని, అది యాక్సిడెంట్‌కు గురవుతుందని తాము కలగన్నామా? తాము జ్యోతిష్యులమా? అని ప్రశ్నించారు. వీఎస్ఆర్ ఏవియేషన్ వ్యవహారంపై పూర్తి వివరాలు మీడియాకు అందిస్తానని చెప్పుకొచ్చారు. జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణలకు తానెందుకు సమాధానం చెప్పాలి? అని ప్రశ్నించారు. క్లారిటీ ఇవ్వాల్సిన అవసరమున్న ప్రతి ప్రశ్నకు ధీటైన సమాధానం తాము చెబుతామని పేర్కొన్నారు.

## బొత్సకు స్ట్రాంగ్ కౌంటర్..

చిల్లర దొంగలను పట్టుకుని..గజదొంగలను వదిలేస్తున్నారని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై మంత్రి లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అంటే జగన్ గజదొంగ అని బొత్సా చెబుతున్నారా? జగన్‌ను పట్టుకోమని ఆయన చెబుతున్నా రా? అని నిలదీశారు. సిట్ అధికారుల విచారణలో తేలిందంతా అదే కదా అని ప్రస్తావించారు. వైసీపీ హయాంలో తమపై ఆరుకు పైగా కేసులు పెట్టారని.. ఫైబర్‌నెట్, స్కిల్, ఇన్నర్ రింగ్ రోడ్డు, లిక్కర్, ఇసుక, అసైన్‌మెంట్ భూములపై కేసులు పెట్టారని తెలిపారు.

## గవర్నర్‌కు ఆధారాలు ఎందుకు చూపలేదు..

చార్జిషీట్ దాఖలు చేసేటప్పుడు కాంపిటెంట్ అథారిటీ నుంచి ఆమోదం పొందాలి. మంత్రులకు అయితే గవర్నర్.. ఎమ్మెల్యేలు అయితే అసెంబ్లీ స్పీకర్ దగ్గర పర్మిషన్ తీసుకోవాలి. గవర్నర్‌కు ఆధారాలు ఎందుకు చూపలేదని, ఒక్క ఆధారమైన చూపారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. జగన్ హయాంలో పెట్టినవన్నీ తప్పుడు కేసులేనన్నారు. ఎమ్మెల్యేలకు రెసిడెన్షియల్ క్లాసులు పెట్టాం. రెండురోజుల పాటు వారంతా పార్టీ కార్యాలయంలోనే ఓరియెంటేషన్ క్లాస్‌లో ఉండాలని సూచించారు. ఈ ఒరియం టేషన్‌కి ప్రిన్సిపాల్ సీఎం చంద్రబాబు..మేమంతా విద్యార్థులమేనని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో జరిగే సమావే శాలు రాజకీయా లకు అతీతం..ఫ్యామిలీ కాన్సెప్ట్‌లోనే ఇది జరుగుతుందని వివరిం చారు. ఈ భేటీలో రాజకీయ ప్రస్తావన లేదని స్పష్టం చేశారు.

## లోకేష్ అండగా

# భయం లేదిక.. పునర్విక..

- రూ.6 కోట్ల సమష్టి సాయం ప్రకటన
- యువనేత అభయం.. కుటుంబానికి ధైర్యం
- చికిత్సకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు

అమరావతి(చైతన్యరథం): ఎవరికి ఏ కష్టమొచ్చినా ముందుగా ఆదుకునేందుకు ముందుండే వారిలో వెంటనే గుర్తొచ్చే పేరు నారా లోకేష్. ఆ పేరు ఒక అభయం..ఒక అండ..ఒక చేయూత.. ఆ అభయం లభిస్తే ఏ భయం ఉండదు. గత కొన్నిరోజులుగా చిన్నారి పునర్విక ఆరోగ్యం కోసం సోషల్ మీడియాలో లక్షలాది మంది ఒక మానవతా సైన్యంగా ఏర్పడి నిధులు సమకూరుస్తున్నారు. పోస్టుల ద్వారా పునర్విక కుటుంబానికి నైతిక మద్దతుగా నిలుస్తున్నారు. ఎస్ఎంఏ టైప్–1 అనే జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక ఎంతో ధైర్యంగా ఈ వ్యాధితో పోరాడుతోంది.

చిన్నారిని రక్షించుకునేందుకు ఉన్న ఏకైక మార్గం రూ.16 కోట్లు ఇంజక్షన్ అవసరం. స్పందించిన ప్రతి హృదయం రూ.10కోట్లు విరాళాలు సేకరించింది. విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేష్ ఇంకా కావాల్సిన రూ.6 కోట్లు సమకూరు స్తామని ప్రకటించారు. పాప ఆరోగ్యం కోసం విరాళాలు ఇచ్చిన, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసిన, ప్రార్థించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. పునర్విక తల్లిదండ్రులకు తనవంతు సహా యం రూ.6 కోట్లు అందజేసి.. చిన్నారి పరిపూర్ణ ఆరోగ్యవంతురాలు అయ్యేందుకు జరిగే చికిత్సకు సహకరించేలా చర్యలు తీసు కోవాలని తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

# మెరుగైన రోడ్లతో పారిశ్రామిక ప్రగతి

- సమగ్రాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణకు అదే కీలకం
- నిర్మాణంలో చంద్రబాబు, టీడీపీ పాత్ర గణనీయమైనది
- గతుకుల రోడ్లతో రాష్ట్రాన్ని దిగజార్చింది వైసీపీ ప్రభుత్వం
- కాంట్రాక్టర్లను బెదిరించి దోపిడీ చేసిన ఘనత ఆ పార్టీదే
- ఎన్‌డీబీ రోడ్లను కమీషన్లు దండుకునే వేటగా మార్చారు
- అనుచరులకు కట్టబెట్టి నిధులను మింగే ప్రయత్నం చేశారు
- ఆగిన ఎన్‌హెచ్ పనులను పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం
- ఆర్అండ్‌బీ బడ్జెట్ చర్చలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అమరావతి(చైతన్యరథం): మెరుగైన రహదారుల నిర్మాణం.. పారిశ్రామిక ప్రగతితోపాటు సమగ్రాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణకు దారితీస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వసిస్తారు.. గత 3దశాబ్దాల్లో దేశంలోనే మెరుగైన రహదారుల నిర్మాణం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందంటే చంద్రబాబు, టీడీపీ పాత్ర గణనీయమైనదని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో ఆర్అండ్‌బీ శాఖ బడ్జెట్‌డిమాండ్ ఆమోదం సంద ర్భంగా ప్రసంగించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ముఖ్య మంత్రికి ఉన్న మక్కువ, చిత్తశుద్ధి ఆయన పాలనలో రోడ్ల అభివృద్ధిలో జరిగిన నిదర్శనం. టీడీపీ పాలనలో మన సరిహద్దు రాష్ట్రాలు సైతం ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి మన రోడ్లను స్టడీ చేసే పరిస్థితి ఉండగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రం లో రోడ్లు అవహేళన చేసేలా రాష్ట్రాన్ని దిగజార్చింది వైసీపీ ప్రభుత్వమని పేర్కొన్నారు. గతంలో జగన్‌రెడ్డి స్నేహితుడు కేటీఆర్ కూడా ఏపీ రహదారులపై అవహేళన చేసిన పరిస్థితిచూశాం. రోడ్ల విషయంలో వైసీపీ పాలనలో చేసిన పాపాలు నేటికీ రాష్ట్రాన్ని వెంటాడుతున్నాయన్నారు. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హాయాంలో రహదారుల అభివృద్ధికి రూ.14,970 కోట్లు కేటాయింపులతో రూ.12,064 కోట్లు (81%) ఖర్చు చేశాం. వైసీపీ ఐదేళ్ల పాలనలో కొత్త రోడ్ల విషయం పక్కన పెడితే.. కనీసం పాత రోడ్లు రెన్యువల్ చేసిన పాపాన పోలేదు. రాష్ట్రంలో మొత్తం 45,378 కి.మీ ఆర్అండ్‌బీ రహదారులుండగా.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి దాదాపుగా 23వేల కి.మీ (50%) రహదారులు మరమ్మతులు చేయాల్సిన దుస్థితిలో ఉన్నాయి. కూటమి వచ్చాక గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రూ.861కోట్లతో 20,060కి.మీ మేర రోడ్ల మరమ్మతులను గుంతల రహితంగా తీర్చిదిద్దామని వివరించారు. కాంట్రాక్టర్లకు మేలు చేసేం దుకు గతంలో 5 ఏళ్ల బ్లాక్ పీరియడ్ కాల పరిమితిని 10 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాం. పనులు వేగవంతం చేసేందుకు రూ.2 కోట్ల వరకు టెండర్లలో సింగిల్ బిడ్‌కు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో రహదా రుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ.. వివిధ పథకాల కింద మొత్తంగా రూ.2,526 కోట్లు నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో తీవ్రంగా దెబ్బ తిన్న 6054కి.మీ రోడ్లను రూ.2500 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం.. ఇవన్నీ మార్చి–జూన్ మధ్య పూర్తికానున్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు పెట్టిన పెండింగ్ బకాయిలను తాము వచ్చాక తిరిగి చెల్లించి సకాలంలో పనులు చేపట్టి పూర్తి చేయగలుగుతున్నామని వివరించారు.

అదే సమయంలో సాధారంగా ఎక్కువగా రహదారులు దెబ్బ తినే ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకు అత్యంత ప్రాధాన్యత కల్పించాం. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అర్థాంతరంగా నిలిపేసిన ఎన్‌డీ బీ పనులు తిరిగి పట్టాలెక్కించాం. డిసెంబర్ 2026నాటికి పూర్తిచేయను



న్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు సూచన మేరకు రాష్ట్రంలో డానిష్ ఫైబర్, స్టీల్ స్లాగ్ వంటి నూతన సాంకేతికతతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన రహదారుల కల్పనకు వైబిలిటీ ఉన్న 709 కి.మీ మేర 12 రోడ్లను పీపీపీ విధానంలో చేపట్టడానికి రూ.5,231కోట్ల వ్యయం కానుంది.. భూసేకరణ, ఇతర వ్యయం కోసం మరో రూ.3083 కోట్లు ఖర్చు కానుందని తెలిపారు.


## జాతీయ రహదారుల్లో గణనీయమైన అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 8,360 కి.మీ జాతీయ రహదారులు ఉండగా.. సాంద్రతలో ప్రతీ లక్ష మందికి 17.64 కి.మీతో దేశంలో తొలి స్థానంలో.. ప్రతీ వెయ్యి చదరపు కి.మీలకు 53.65 కి.మీతో ఏపీ 2వ స్థానంలో ఉందని గర్వంగా చెప్పగలం. 2024--25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 770కిలో మీటర్ల ఎన్‌హెచ్ రహదారులు రూ.11,325 కోట్ల వ్యయంతో నిర్మించబడ్డాయి. ప్రస్తుతం మొత్తంగా ఎన్‌హెచ్ రహదారులు రూ.55,506 కోట్ల వ్యయంతో 2,487 కి.మీ మేర పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.98,635 కోట్లతో 1902కి.మీ మేర పనులు పూర్తిచేసే లక్ష్యంతో సాగుతున్నామని తెలిపారు.

## వైసీపీ పాలనలో ఎన్‌డీబీ రోడ్ల నిర్వీర్యం

వైసీపీ నేతలు తమ ముడుపుల కోసం, అనుయాయులకు ఎన్‌డీబీ (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్) రోడ్ల కాంట్రాక్టులు కట్టబెట్టి 13జిల్లాల్లో ప్రారంభించి పనులు పూర్తి కాకుండా నిర్వీర్యం చేశారు.. నాడు 30 శాతం ముడుపులు చెల్లించి పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్లను బెదిరించిన వైసీపీ నేతలు నేడు సిగ్గూశరం లేకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారు. వైన్, మైన్, శాండ్ వంటి దోపిడీలు సరిపోక, చివరకు రోడ్డు కాంట్రాక్టర్లను దోపిడీ చేశారని మండిపడ్డారు. గతంలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి 70% రుణం, 30% రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద ఫిబ్రవరి 2019లో ఆమోదించాయి. 13 ప్యాకేజీలకు ఫేజ్–1 కింద మార్చి 2023 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా ఇది ప్రారంభించారు.. ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం అధిక ట్రాఫిక్ ఉన్న రహదారులపై జిల్లా ప్రధాన కేంద్రాల నుంచి మండల ప్రధాన కేంద్రాలకు, సమీప మండల ప్రధాన కేంద్రాల మధ్య డబుల్ లేన్ కనెక్టివిటీ కల్పించడం. అయితే ఎన్‌డీబీ రోడ్లను వైసీపీ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా కమీషన్ల దండుకునే వేటగా మార్చిందన్నారు. ప్రతి జిల్లా నుంచి పైరవీలు చేసి తమ అనుచ రులకు కాంట్రాక్టులు కట్టబెట్టి ప్రజల నిధులను దోచుకునే యత్నం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 30%వాటాను చెల్లించకుండా బ్యాంకులు విడుదల చేసిన రుణాన్ని కూడా దారి మళ్లించడం ద్వారా అభివృద్ధిని పూర్తిగా అడ్డుకుంది. 2023 నాటికి పూర్తి కావాల్సిన ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా వెనక్కి లాగి, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా పనులు నిలిపివేసి రహదా రులను శిథిలావస్థకు నెట్టింది. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల అర్థాంతరంగా ఆగిపోయిన ఎన్‌హెచ్ పనులను కాంట్రాక్టర్లతో మాట్లాడి బిల్లులు విడుదల చేసి పనులను ప్రారంభించి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

# మదనపల్లి బాలిక కుటుంబానికి అండగా ప్రభుత్వం




- ఆర్థికసాయం, ఇల్లు మంజూరుకు ఆదేశం
- వివరాలు తెలుసుకున్న చంద్రబాబు
- తనను కలిసిన తల్లిదండ్రులకు ఓదార్పు

అమరావతి(చైతన్యరథం): ఇటీవల మదనపల్లి జిల్లా నీరుగట్టు వారిపల్లిలో రిషిక ప్రియ హత్య అందరికీ తెలిసిన విషయమే. అప్పటి నుంచి ఆ కుటుంబానికి అండగా ఉంటూ వారికి ధైర్యాన్ని కల్పిస్తూ రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు బాధ్యత తీసుకున్నారు. ఆ కుటుంబాన్ని మంగళవారం సెక్రటేరియ ట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చంద్రబాబు బాలిక తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పి స్తూ రూ.15 లక్షల ఆర్థిక సహాయం, తిరుపతిలో వారికి ఒక సొంత నివాస గృహాన్ని మంజూరు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రిషిక ప్రియ తల్లితండ్రులు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాషా, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, సీనియర్ నాయకులు యలగిరి దొర స్వామినాయుడు పాల్గొన్నారు.














# అభిమాన నేతకు అపూర్వస్వాగతం

**ప్రసంగంతో ఉత్సాహం నింపిన చంద్రబాబు - మార్కాపురం జిల్లా పర్యటన విజయవంతం**

నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలిసారి మార్కాపురంలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం లభిం చింది. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజ నేయ స్వామి, నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివా సులురెడ్డి, జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. జిల్లా ఏర్పాటు కలను నిజం చేసినందుకు ముఖ్యమంత్రికి నాయ కులు ధన్యవాదాలు తెలిపారు. మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ జలకళ సభకు హాజరైన ముఖ్యమంత్రికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. వేదిక నుంచి ప్రజల మధ్యకు వేసిన ర్యాం పుపై నడుస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబా బు ప్రసంగించారు. ప్రజలు హర్షాతిరేకాల మధ్య ఆయన ప్రసం గం ఉత్సాహంగా సాగింది. సభకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు, అభిమానులు తరలివచ్చారు.




















# సీఎం చంద్రబాబు వెలిగొండ పర్యటన దృశ్య మాలిక











# అసెంబ్లీ వేదికగా వైసీపీ పాపాలు బద్దలు

- కల్తీ నెయ్యి డైవర్ట్ కోసమే అబద్ధాలు
- మహాపాపం చేశామన్న భయం లేదు
- వారి మాటల్లో నిజం లేదు కాబట్టే
- చర్చ జరుగుతుంటే సభకు రాలేదు
- వైఎస్ జీవో 338 వాస్తవం కాదా?
- గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి



మంగళగిరి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయక త్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే ఆ విషయా న్ని తట్టుకోలేక వైసీపీ నాయకులు పనిగట్టుకుని అబద్ధాలు ప్రచా రం చేస్తున్నారని గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. టీడీపీ కేంద్ర కార్యా లయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోకి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులు నేడు పూర్తికావస్తున్నాయి. రాజధాని లేని రాష్ట్రం అనే నిందను పోగొట్టి, ప్రజలందరూ మెచ్చే రాజధానిని నిర్మిస్తుంటే.. ప్రజల దృష్టిని మరల్చడానికి సాక్షి టీవీ, పేపర్లను వాడుకుని వైసీపీ నాయకులు సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతున్నారు. తిరుమల లడ్డూ తయారీ లో వాడే నెయ్యి కల్తీ జరిగిందనే విషయం చిన్నా పెద్దా అందరికీ తెలిసిపోయింది. పామాయిల్, కెమికల్స్ వాడి నెయ్యిని అపవిత్రం చేసిన విషయం సిట్, సీబీఐ విచారణల్లో తేలింది. ఇంత పాపం చేసినా భయం లేకుండా వైసీపీ నేతలు ఎదురుదాడి చేయడం దారుణం. జగన్ మోహన్ రెడ్డి గారికి, వారి ముఖ్య నాయకులకు హిందూ సంప్రదాయాల మీద గానీ, దేవుడి మీద గానీ కనీస భక్తి లేకపోవడమే దీనికి కారణం. మీ దగ్గర నిజం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి. నిజం లేదు కాబట్టే అసెంబ్లీకి రాకుండా తాడేప ల్లి ప్యాలెస్‌లో కూర్చుని విషప్రచారం చేస్తున్నారు. మీరు రేపు ప్రజల్లోకి వెళ్లి పోటీ చేసే పరిస్థితి కూడా లేదు, కేవలం తాడేపల్లి కుర్చీల కోసమే మీరు కొట్టుకుంటారని మండిపడ్డారు.

**ప్రతి ట్రక్కు నెయ్యిని క్షుణ్ణంగా పరీక్షిస్తున్నాం**

నెయ్యి సేకరణపై కూడా వైసీపీ నేతలు అజ్ఞానంతో మాట్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నందిని డెయిరీకి 40 లక్షల లీటర్ల ఆర్డర్ ఇచ్చాం. మొత్తం నెయ్యి అవస రంలో 62% నందిని, మదర్ డెయిరీల నుంచే సేకరిస్తున్నాం. మిగిలిన టెండర్లు ఇందాపూర్, సంఘం డెయిరీలకు దక్కాయి. ఎన్డీడీబీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ ఉన్న ల్యాబొరేటరీల పరీక్షల తర్వాతే నెయ్యిని అనుమతిస్తున్నాం. పదేళ్ల క్రితం ఉన్న ధరలకే ఇప్పుడు కూడా నెయ్యి రావాలని కోరడం మీ తెలివితక్కువ తనానికి నిదర్శనం. మీ భారతీ సిమెంట్ వంటి ఇతర వస్తువుల ధరలు పెరిగి నట్టే, నెయ్యి ధరలు కూడా పెరుగుతాయని తెలియ దా? కల్తీ నెయ్యి తినడం వల్ల మీకు బుద్ధిమాన్యం వచ్చిందేమో అనిపిస్తోంది. భక్తుల నమ్మకాన్ని కాపాడటం కోసం భవిష్యత్తులో ఎటువంటి కల్తీకి తావులేకుండా టీటీడీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన 'స్టేట్ ఆఫ్ ఆర్ట్' ల్యాబొరేటరీని ఏర్పా టు చేశాం. ఇప్పుడు ప్రతి ట్రక్కు నెయ్యిని క్షుణ్ణంగా పరీక్షించిన తర్వాతే లడ్డూ తయారీకి అనుమతిస్తున్నాం. భక్తుల నమ్మకాన్ని కాపాడటమే మా ప్రభుత్వ లక్ష్యం.

**జీవో 338 వాస్తవం కాదా?**

వైఎస్ ఏడుకొండలను దివ్య క్షేత్రంగా చేశారని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ నేతలు.. అసలు విషయాన్ని దాచేశారు. 2005లో జీవో నెంబర్ 338 ద్వారా తిరుమల పరిధిని కేవలం రెండు కొండలకే పరిమితం చేయాలని చూసింది వాస్తవం కాదా? అప్పట్లో చంద్రబాబు నాయకత్వంలో హిందూ సంఘాలు, తెలుగు దేశం పార్టీ పోరాటం చేయడం వల్లే దిగివచ్చిన నాటి ప్రభుత్వం 2007లో మళ్లీ ఏడుకొండలను కలుపుతూ జీవో ఇచ్చింది. ఈ చరిత్రను ప్రజలు మర్చిపోలేదు. హెరిటేజ్ గురించి మాట్లాడే హక్కు మీకు లేదు. హెరిటేజ్ సంస్థ నాణ్యత విషయంలో ఎంత కఠినంగా ఉంటుందో చెప్పడానికి నా జీవితంలో జరిగిన ఒక సంఘటనే ఉదాహరణ. గతంలో నాకు పాలు ప్యాకింగ్ చేసే ఫ్యాక్టరీ ఉండేది. నా నాణ్యతను చూసి హెరిటేజ్ వారు నాకు ఆర్డర్లు ఇచ్చారు. కానీ ఒకరోజు వారి అధికారి మా ఫ్యాక్టరీకి వచ్చినప్పుడు అక్కడ కొన్ని దోమలు, పురుగులు ఉండటం గమనించి వెంటనే ఆర్డర్లు రద్దు చేశారు. క్వాలిటీ విషయంలో కొంచెం తేడా వచ్చినా వారు రాజీ పడరు. ఇందాపూర్ డెయిరీపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. డిఫెన్స్ ఆయుధాలు తయారు చేసే సంస్థలైనా, ఎయిర్ బస్ అయినా, బీహెచ్ఎల్ అయినా.. అన్నీ తమ సొంత కంపెనీలోనే తయారు చేయవు. వివిధ కంపె నీల నుంచి కాంపోనెంట్స్ తీసుకుని అసెంబుల్ చేస్తాయి. అలాగే హెరిటేజ్ సంస్థ ఇందాపూర్ నుంచి చీజ్ కొంటే తప్పేంటి? ఇందాపూర్ అనేది దేశంలోనే అతిపెద్ద డెయిరీ.. ఇది అమూల్, బ్రిటానియా, మదర్ డెయిరీ వంటి దిగ్గజాలకు ఉత్పత్తులను సరఫ రా చేస్తుంది. అటువంటి సంస్థకు అపవిత్రత ఆపాదిస్తారా? అటువంటి ప్రతిష్టాత్మక సంస్థపై కూడా బురద చల్లడం వైసీపీ నాయకుల కుసంస్కారానికి నిదర్శనం.

భూమన కరుణాకర్‌రెడ్డి ఇప్పుడు పట్టు పంచెలు కట్టి.. నామాలు పెట్టుకుని నాటకాలు ఆడుతున్నారు. చేసిన పాపానికి భగవంతుడి దగ్గర క్షమాపణ కోరాల్సింది పోయి ఎదురుదాడి చేయడం మీ అహంకారానికి నిదర్శనం. ఇప్పటికైనా అబద్ధాలు మానుకొని, హిందూ మనోభావాలను గౌరవించడం నేర్చుకోవాలని హితవుపలికారు

**భక్తుల మనోభావాలతో ఆడుకున్నది మీరు కాదా?**

ఆనాడు పర్చేస్ కమిటీలో ఉన్నప్పుడు మేము చెప్పింది ఒక్కటే.. పోటీని పెంచండి, ఆవు నెయ్యి సరఫరా చేసే వారిని ఎక్కువ మందిని రప్పించండి అని చెప్పాం. అంతే కానీ కల్తీ నెయ్యిని, పామాయిల్ నెయ్యిని కొనమని మేము ఎప్పుడూ చెప్పలేదు. మంచి మాటల్లో నుంచి కూడా చెడును వెతకడం వైసీపీ నేతలకే చెల్లింది. ఆవు నెయ్యి ముసుగులో పామాయిల్, కెమికల్స్ వాడి భక్తుల మనోభావాలతో ఆడుకున్నది మీరు కాదా? జగన్ మోహన్ రెడ్డి గారు వేరే మతాన్ని నమ్మవచ్చు, అది ఆయన ఇష్టం. భారతీయ సంస్కృతి ప్రకారం ప్రతి మతాన్ని మనం గౌరవిస్తాం. కానీ ఇతర మతస్తుల నమ్మకాలను, హిందూ దేవుళ్ల పవిత్రతను అగౌరవపరచడం సరైంది కాదు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని, ప్రజాస్వామ్యంపై నమ్మకంతో ప్రవర్తించాలని కోరుతున్నాను.

# 16,600 హెక్టార్లలో 16 రకాల ఖనిజ నిక్షేపాలను గుర్తించాం: కొల్లు రవీంద్ర



విజయవాడ (చైతన్యరథం): విజయవాడలో ఏపీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బీచ్ శాండ్ మినరల్స్ టు టైటానియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, ఏపీలో వాల్యూ చైన్ నిర్మాణానికి ఉన్న అవకాశాలు, అంచనాల వర్క్ షాప్‌లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలోని బీచ్ సాండ్ ఖనిజాలు కేవలం ఆర్థిక వనరులే కాకుండా, క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వెహికల్స్, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు అత్యంత కీలకమన్నారు. మైనింగ్‌ను కేవలం ఆదాయ వనరుగా చూడకుండా రాష్ట్ర ఆర్థిక వృద్ధిని నడిపించే ఒక ఇంజిన్‌గా ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఖనిజాల తవ్వకం మాత్రమే కాకుండా, వాటిని శుద్ధి చేసి తుది ఉత్పత్తులను తయారు చేసే వ్యవస్థను రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలన్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా అడుగులు వేస్తున్నామని, రాష్ట్రంలో 16,600 హెక్టార్లలో విస్తరించి ఉన్న 16 రకాల ఖనిజ నిక్షేపాలను గుర్తించామని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీని 'రేర్ ఎర్త్ ఎలిమెంట్ కారిడార్'గా గుర్తించడం గర్వంగా ఉందన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి పని చేస్తే రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో మైనింగ్ హబ్‌గా నిలబెట్టొచ్చన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ఇతర దేశాలపై ఆధారపడకుండా మన వనరులను అభివృద్ధి చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యం. ఏపీలో 16 బ్లాకులను గుర్తించగా, సుమారు 16,600 టన్నుల డిపాజిట్లు ఉన్నట్లు అంచనా వేస్తున్నాం. మైనింగ్ అన్వేషణ నుంచి ఇండస్ట్రియల్ ప్రాసెస్ వరకు అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్తులో భారీగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. గత ఐదేళ్లలో మైనింగ్ రంగం అస్తవ్యస్తమైందన్నారు. కూటమి ప్రభుత్వం కొత్త మైనింగ్ పాలసీలను తీసుకొచ్చి వ్యవస్థను గాడిలో పెడుతున్నామని చెప్పారు.

# హిందూధర్మ వ్యతిరేకి జగన్..

- పులివెందులలో మరో మహాపచారం
- నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ పేరుతో నాటకం
- తీర్థాన్ని స్వీకరించకుండా కింద పారబోశారు
- అవిస్సుల్ని అగ్నిగుండంలో వేయకుండా వెనక్కు
- ఆలయాల్లో కార్యక్రమాలకు ఆయనను పిలిచి
- హిందూమతాన్ని హేళన చేయవద్దని కోరుతున్నా
- బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్

మంగళగిరి(చైతన్యరథం): హిందూధర్మ వ్యతిరేకి జగన్ పులివెందులలో మరో మహాపచారానికి ఒడిగట్టారని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ధ్వజమెత్తారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలోని నందిపల్లెలోని నందీశ్వరాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేకంలో జగన్ పాల్గొని పూజారులిచ్చిన తీర్థాన్ని స్వీకరించకుండా కింద పారబోశారు. రెండుసార్లు ఇలా తీర్థాన్ని పారబోసి చేతులు కడుక్కున్నారు. అలాగే అగ్నిగుండంలో వేయడానికి పూజారు లిచ్చిన అవిస్సుల్ని అగ్నిగుండంలో వేయకుండా తిరిగి పూజారికి ఇచ్చివేసి మహాపచారానికి పాల్పడ్డారు. గతంలో జగన్‌రెడ్డి సతీమణి భారతి కూడా ప్రసాదాల్ని స్వీకరించకుండా పేపర్‌లో పెట్టి పక్కన పడేశారు. హిందూ మతంపై గౌరవం లేదు కాబట్టే తిరుమల వెంకటేశ్వరస్వామి ప్రసాదాల కుంభకోణాన్ని, పరకా మణి చోరీదారులను జగన్ సమర్థించారు. జగన్ చేసిన ఈ మహాపాపాలపై హిందూ భక్తుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం జగన్‌రెడ్డి చేసిన మహాపచా రాలను ప్రజలకు తెలియజేసింది. దీన్ని డైవర్ట్ చేసి భక్తులను మోసగించడానికి నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ పేరుతో జగన్నాటక మాడారు. తన రాజకీయ పబ్బం గడుపుకోవడానికి హిందూ ధర్మంతో నాటకాలాడుతూ భక్తకోటిని మోసం చేస్తున్నారు. భక్తులకు జగన్ క్షమాపణ చెప్పి తీరాలి. పాప పరిహారానికి ప్రాయశ్చితం చేసుకోవాలి. ఇవి చేయనట్టయితే భక్తుల ఆగ్రహా నికి గురికాక తప్పదు.. దైవాగ్రహానికి కూడా గురికాక తప్పదని హితవుపలికారు. జగన్‌రెడ్డి పాలనలో 209 ఆలయాలపై దాడుల కారణంగానే 11 సీట్లకు ఆ దైవం పరిమితం చేశారు. హిందూ ధర్మంపై ఆయన చేస్తున్న అపచారాలకు ఈసారి ఆ 11 కూడా రావు. జగన్‌కు హిందూ ధర్మం మీద నమ్మకం లేనప్పుడు హిందూ ఆలయాలకు ఎందుకు వెళతారు? ఎందుకు హిందూ మత ఆచారాలను అవమానిస్తున్నారని ప్రశ్నించారు. హిందువు లు ఆలయాల్లో జరిగే కార్యక్రమాలకు జగన్‌ను పిలవద్దని, పిలిచి హిందూ మతాన్ని హేళన చేయవద్దని విజ్ఞప్తి చేశారు. హిందూ ముసుగు వేసుకున్న జగన్మోహన్‌రెడ్డి తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలవలేదని నిరూపించగలరా? ఎన్‌డీడీబీ రిపోర్టులో 35వ పేజీలో ఇందులో యానిమల్ ఫ్యాట్ ఉందని సిట్ నిర్ధారిం చింది. కల్తీ జరిగినట్లు మేము నిరూపించాం. నెయ్యి కల్తీని ప్రశ్నిస్తే ఎదురుదాడి చేస్తున్నారు. తప్పించుకోవడానికి మరో తప్పు చేస్తున్నారు. శిశుపాలుడి తప్పుల్లా జగన్ తప్పులు కూడా చరమాంకానికి వచ్చింది. దేవుడు వైసీపీకి ఈసారి కేవలం ఒక్క సీటు స్క్రిప్ట్ సిద్ధం చేశాడు. తప్పులు చేయటం అబద్ధాలు చెప్ప టం జగన్మోహన్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. ఇప్పటికైనా జగన్ ప్రాయశ్చితం చేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు.



# వెలిగొండను పూర్తిచేసి సస్యశ్యామలం చేస్తాం

- పూర్తి చేయకుండా జగన్ మోసగించాడు
- మార్కాపురం జిల్లాతో మాట నిలబెట్టుకున్నాం
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

మార్కాపురం(చైతన్యరథం): ఎన్నికల్లో చెప్పిన మాటకు కట్టుబ డి సీఎం చంద్రబాబు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారు.. త్వరలోనే వెలిగొండను పూర్తిచేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్య శ్యామలం చేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. బుధవారం మార్కాపురం జిల్లా వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్‌కి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన కార్యక్రమం అనంతరం మార్కాపురంలో నిర్వహిం చిన బహిరంగ సభలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే ఎన్నికల ముందు జాతికి అంకితం చేసి జగన్ జిల్లా ప్రజలను మోశారు. నాడు వెలిగొండ పూర్తయిందంటూ వైసీపీ నీలి మీడియాలో నానా హంగామా చేశారు..నేడు వైసీపీ నేతలు వెలిగొండకు నిధులు కేటాయించాలని మాట్లాడుతున్నారు. ఇంతకంటే మోసం ఇంకొక టి లేదు, ప్రజలు ఏమనుకుంటారోనన్న కనీస స్పృహ కూడా లేకుండా వైసీపీ నేతలు అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారు. వైసీపీవన్నీ ఫేక్ మాటలు, ఫేక్ రాజకీయాలే. ఎన్నికల్లో చెప్పిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారు. త్వరలోనే వెలి గొండ ప్రాజెక్టు పూర్తిచేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతాం. జగన్ మాదిరి మేం ప్రజలను మోసం చేయం. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్ప టికీ చెప్పిన హామీలన్నీ అమలు చేస్తున్నాం. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన సాగిస్తు న్నారని స్పష్టం చేశారు.





## చేనేతకు 'అసెంబ్లీ' ఆదరణ

- స్టాళ్లతో పుంజుకున్న అమ్మకాలు
- కూటమి ప్రభుత్వ చర్యలు సఫలం

అమరావతి(చైతన్యరథం): చేనేత వస్త్రాల అమ్మకాలను పెంచే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు విజయవంత మవుతున్నాయి. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లకు విశేష స్పందన లభిస్తోం ది. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేనేత వస్త్రాల కొనుగోలుకు ముందుకొస్తున్నారు. రోజూ ఆ స్టాళ్లను సందర్శిస్తూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల 20 తేదీన చేనేత స్టాళ్లను అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకు చెందిన ప్రఖ్యాతగాంచిన చేనేత ఉత్ప త్తులను ఆ స్టాళ్లలో అమ్మకానికి పెట్టారు. మంత్రి ఎస్.సవిత నిత్యం స్టాళ్లను సందర్శిస్తూ తోటి మంత్రులు, ఎమ్మెల్యేలతో చేనేత ఉత్పత్తులు కొనుగోలు చేసేలా కృషి చేస్తున్నారు. బుధవారం కూడా మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, ప్రశాంతిరెడ్డి సహా పలువురు ఎమ్మెల్యేలు చేనేత స్టాళ్లను సందర్శించి వస్త్రాలను కొనుగోలు చేశారు. అసెంబ్లీ విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు సైతం స్టాళ్లలో చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం విశేషం. ఈ స్టాళ్లకు విశేష స్పందన రావడంపై ఆయా జిల్లాల నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబుకు, స్పీకర్ అయ్యన్నపాత్రు డికి, మంత్రి సవితకు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కు, ప్రభుత్వ విప్‌లకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

# రైతులకు జగన్‌రెడ్డి పంగనామాలు

- వెలిగొండ పూర్తికాకుండానే జాతికి అంకితం
- గుండ్లకమ్మ గేట్లు విరగ్గొట్టి ఇసుక దోపిడీ చేశారు
- ఐదేళ్లలో అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించాడు
- తాము ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



మార్కాపురం(చైతన్యరథం): పూర్తికాని వెలిగొండ ప్రాజెక్టు ను జాతికి అంకితం చేశామంటూ జగన్‌రెడ్డి ప్రకాశం జిల్లా ప్రజలను మోసగించారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ధ్వజమెత్తారు. పనులు పూర్తిచేయకుండా కేవలం ప్రచా రానికే పరిమితం అయ్యారని దుయ్యబట్టారు. రైతుల ఆశలను వమ్ము చేస్తూ ప్రాజెక్టును రాజకీయ లాభాల కోసం ఉపయో గించుకున్నారని విమర్శించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు ధ్వంసం చేసి భారీఎత్తున ఇసుక దోపిడీ చేశారని మండిపడ్డారు. ప్రజా సంపదను కాపాడాల్సిన ప్రభుత్వం దానినే దోచుకుం దన్నది దురదృష్టకరమన్నారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్లలో అన్ని వ్యవస్థలను జగన్‌రెడ్డి భ్రష్టు పట్టించారని పేర్కొ న్నారు. మార్కాపురం జిల్లాలో బుధవారం సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. కూటమి ఏర్పడిన వెంటనే గుండ్ల కమ్మకు కొత్త గేట్లను ఏర్పాటు చేయడంతో పాటు మత్స్యకారుల సంక్షేమం కోసం 20 లక్షల చేప పిల్లలను గుండ్లకమ్మలో వదిలి న విషయాన్ని మంత్రి సభా ముఖంగా గుర్తు చేశారు. వెలిగొండ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో నిధు లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే రాజధాని అమరావతి, పోల వరం ప్రాజెక్టుల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేసినట్లు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని వెల్లడించారు.

### విద్యుత్ వ్యవస్థ సర్వనాశనం

2019 వరకు మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదే శ్.. వైసీపీ పాలన ఐదేళ్లలో సర్వ నాశనం అయిందని మండిప డ్డారు. అడ్డగోలు విద్యుత్ కొనుగోళ్లు, అనాలోచిత నిర్ణయాలతో విద్యుత్ వ్యవస్థకు రూ. 1.29 లక్షల కోట్లు నష్టం వాటిల్లిందని వెల్లడించారు. 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై సుమా రు రూ. 30 వేల కోట్లు విద్యుత్ భారాన్ని మోపారని ధ్వజమె త్తారు. కూటమి అధికారం చేపట్టిన 15 నెలల కాలంలోనే 13 పైసలు ట్రూ డౌన్ చేయడమే కాకుండా..గడిచిన 19 నెలల్లో ఒక్క పైసా కూడా విద్యుత్ ఛార్జీ పెంచలేదని స్పష్టం చేశారు. దేశంలోని హిందువులందరూ అతి పవిత్రంగా భావించే తిరుమ ల తిరుపతి దేవస్థానాన్ని కూడా అపవిత్రం చేశారు.. లడ్డూని కూడా కల్తీ చేశారని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అభినందనలు తెలిపారు.

# దక్షిణాసియాలోనే అతిపెద్ద ట్రావెల్ ఎక్స్‌పోలో మెరిసిన ఏపీ పర్యాటక రంగం

- ఢిల్లీ 'యశోభూమి'లో ఏపీ టూరిజం స్టాళ్లకు విశేష స్పందన
- జాతీయ, అంతర్జాతీయ టూర్ ఆపరేటర్లతో ఏపీ ప్రతినిధుల బృందం భేటీ
- రాష్ట్ర పర్యాటక రంగానికి గ్లోబల్ బ్రాండింగ్ కల్పించడమే లక్ష్యం



అమరావతి/న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో న్యూఢిల్లీలోని 'యశోభూమి'లో ఈ నెల 27వ తేదీ వరకు దక్షిణాసియాలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్ (సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్)లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రతినిధుల బృందం చురుగ్గా పాల్గొంది. రాష్ట్ర పర్యాటక శాఖ తరపున డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మారాణి, మార్కెటింగ్ మేనేజర్ రఫీక్ అహ్మద్ తదితర ఉన్నతాధికారులు సదస్సులో పాల్గొని ఏపీ పర్యాటక రంగానికి సంబంధించిన విశేషాలను ప్రపంచ దేశాల ప్రతినిధులకు వివరించారు. ఏపీ పర్యాటక శాఖ స్టాళ్లలో రాష్ట్రంలోని ప్రముఖ ట్రావెల్, హాస్పిటాలిటీ సంస్థలు తమ సేవలను ప్రదర్శించాయి. ఇందులో విశాఖపట్నం నుంచి ప్రవాసిన్, ట్రెక్ సమ్, హాలిడే వరల్డ్, రాడిసన్ బ్లు రిసార్ట్‌లు, తిరుపతి నుంచి బృందావన్ హాలిడేస్, స్టార్ లెట్ సూట్, న్యూఢిల్లీ నుంచి ఈజ్ మై ట్రిప్ తదితర ప్రముఖ సంస్థలు భాగస్వాములయ్యాయి.

ప్రధానంగా రాష్ట్రంలోని టూర్ ఆపరేటర్లను నేషనల్, ఇంటర్నేషనల్ లెవల్ టూర్ ఆపరేటర్లతో అనుసంధానం చేయడం ద్వారా పర్యాటక నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం లక్ష్యంగా ఏపీ బృందం తమదైన ప్రదర్శన చేసింది. ఏపీలోని సుదీర్ఘ తీర ప్రాంతం, అరకు లోయ, గండికోట, ఆధ్యాత్మిక క్షేత్రాలైన తిరుపతి, విజయవాడ, శ్రీశైలం వంటి పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తోంది. వివిధ దేశాల పర్యాటకులను ఆకర్షించేలా తక్కువ ఖర్చుతో కూడిన వినూత్న ప్యాకేజీలను టూర్ ఆపరేటర్ల ద్వారా రూపొందించడం వంటి అంశాలను ఈ బృందం చర్చించింది..

సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించిన నేపథ్యంలో ఈ సదస్సు ఇన్వెస్టర్లను ఆకర్షించడానికి వేదికగా నిలిచింది. పర్యాటక శాఖ రూపొందించిన '2024-29 నూతన పర్యాటక పాలసీ' గురించి ఇక్కడి ప్రతినిధులకు వివరించారు. దీనివల్ల రాబోయే రోజుల్లో ఏపీకి మరిన్ని విదేశీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ బ్రాండ్‌ను అంతర్జాతీయ వేదికపై పెంపొందించడమే తమ లక్ష్యమని, SATTE వంటి వేదికల ద్వారా ఏపీ రాష్ట్ర పర్యాటక సంపదను ప్రపంచానికి చూపిస్తున్నామన్నారు. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు చేదోడుగా నిలుస్తుందని ఏపీ పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు. పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి కాట నేతృత్వంలో రాబోయే రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ పర్యాటక సదస్సుల్లో పాల్గొని ఏపీ టూరిజాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఏపీటీఏ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న టూర్ ఆపరేటర్స్‌కి న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ సదస్సులో ఏపీ పెవీలియన్ తరపున పాల్గొనే అవకాశం లభించడమే గాక జాతీయ, అంతర్జాతీయ ఏజెన్సీస్ ను కలిసే అవకాశం దొరకడం విశేషం.. తద్వారా వారి సేవలు మరింత విస్తరించేందుకు వీలు కలుగుతుంది.. ఈ నేపథ్యంలో ఏపీటీఏ పోర్టల్‌లో టూర్ ఆపరేటర్లు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారికి ఈ అవకాశం కలుగుతుందని అధికారులు వెల్లడించారు.

# రైతు నిల్వ సామర్థ్యాల్లో చారిత్రాత్మక ముందడుగు..

- AIFతో రాష్ట్రంలో 1000కు పైగా ఆధునిక గొడౌన్లు
- రూ.504 కోట్ల భారీ పెట్టుబడి... గ్రామీణ వ్యవసాయ రంగానికి నూతన శకం
- పీఏసీఎస్‌లను ఆధునిక మల్టీపర్పస్ సౌకర్య కేంద్రాలుగా మారుస్తున్న ప్రభుత్వం
- తక్కువ వడ్డీ రుణాలు... పూర్తి ప్రభుత్వ హామీతో రైతు సంఘాలకు భరోసా
- డ్రైయింగ్ యార్డులు, ఆధునిక డ్రయర్లపై ప్రభుత్వ దృష్టి
- అకాల వర్షాలకు అడ్డుకట్ట... రైతు సేవా కేంద్రాల ద్వారా టార్పాలిన్ల పంపిణీ
- ఎలక్ట్రానిక్ డ్రయర్లపై పైలట్ ప్రాజెక్టులు... సాంకేతిక వ్యవసాయానికి శ్రీకారం
- శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి కింద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలును బహుళార్థ సాధక సౌకర్య కేంద్రాలుగా అభివృద్ధి చేసే కార్యక్రమంపై శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కింరాజపు అచ్చెన్నాయుడు సమగ్రంగా సమాధానమిచ్చారు. 2020 జూన్‌లో కేంద్ర ప్రభుత్వ Agriculture Infrastructure Fund (AIF) పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, రైతు భరోసా కేంద్రం స్థాయిలో నిల్వ, ఆరబెట్టే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. విశాఖపట్నం జిల్లా మినహా రాష్ట్రవ్యాప్తంగా గొడౌన్లు, డ్రైయింగ్ యార్డుల నిర్మాణం జరుగుతోందని, మొత్తం రూ.504.42 కోట్ల వ్యయంతో ఈ పథకం అమలవుతోందన్నారు. నాబార్డ్ ద్వారా రీ ఫైనాన్స్ సదుపాయం కల్పిస్తామని, సొసైటీలకు 4% వడ్డీపై 3% వడ్డీ రాయితీ లభిస్తుందని, 90% రుణం, 10% మార్జిన్‌మనీ విధానంలో ప్రాజెక్టులు అమలవుతున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్జిన్‌మనీ కింద రూ.50.4 కోట్లు మంజూరు చేసి అందులో రూ.20 కోట్లు ఇప్పటికే విడుదల చేసిందని, 33 సంవత్సరాల పాటు ఏడాదికి రూ.1 నామమాత్రపు అద్దెకు ప్రభుత్వ భూమి లీజుకు ఇస్తున్నట్లు, రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ మినహాయింపు కల్పించినట్టు చెప్పారు. ఈ పథకం కింద రుణాలకు ప్రభుత్వ హామీ ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 1005 MPFC గొడౌన్ల పనులు ప్రారంభమై, 717 గొడౌన్లు, అనుబంధ డ్రైయింగ్ యార్డులు పూర్తయ్యాయని, 572 పీఏసీఎస్‌ల్లో 1111 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి తేమ మీటర్లు, తూనిక బ్యాలెన్స్‌లు, డెస్క్‌టాప్‌లు సరఫరా చేసినట్లు తెలిపారు. 232 PACS\లోని 462 అసేయింగ్ కేంద్రాలకు అవసరమైన ల్యాబ్ పరికరాలు అందించామని చెప్పారు. మొత్తం రూ.381.72 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, అందులో గొడౌన్ల నిర్మాణానికి రూ.373.97 కోట్లు, పరికరాల సరఫరాకు రూ.7.75 కోట్లు ఖర్చయ్యాయని వెల్లడించారు. ఈ చర్యల ద్వారా రైతులకు శాస్త్రీయ నిల్వ సదుపాయాలు కల్పించి, పంటలకు మెరుగైన ధరలు సాధించే అవకాశాలు పెరుగుతున్నాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ పథకం కీలకంగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు మండలికి తెలియజేశారు.

**రైతు ఆదాయం పెంపే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

అకాల వర్షాల కారణంగా పంట చేతికి వచ్చే సమయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గుర్తించిందని, 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో టార్పాలిన్లు పంపిణీ చేశామని, ఆ తరువాత పంపిణీ నిలిచిపోయిందని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో టార్పాలిన్లు కొనుగోలు చేసి ప్రతి రైతు సేవా కేంద్రంలో బల్క్‌గా నిల్వ ఉంచామని, ఇంతకుముందు వ్యక్తిగతంగా పంపిణీ చేసేవారమని, ఇప్పుడు అవసరమైన రైతులు ఆర్ఎస్‌కేల ద్వారా తీసుకుని అవసరం తీరిన తరువాత తిరిగి ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత విస్తృతంగా అభివృద్ధి చెందిందని, ఆధునిక ఎలక్ట్రానిక్ డ్రయర్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ అవి అధిక వ్యయంతో ఉన్నాయని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో చర్చించి రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో ఒకటి లేదా రెండుచోట్ల నమూనా ప్రాతిపదికన ఎలక్ట్రానిక్ డ్రయర్లు ఏర్పాటుచేసి, ఫలితాలు అనుకూలంగా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా అమలుచేసే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తడి ధాన్యాన్ని శాస్త్రీయంగా ఎండబెట్టి రైతులకు మెరుగైన ధర లభించేలా చేయడం ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక డ్రయింగ్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# మహిళా ప్రయాణికుల సంఖ్య 65%కి పెరిగింది

- 47 కోట్ల ఉచిత ప్రయాణాలు
- రూ.1,660 కోట్ల సబ్సిడీ
- దివ్యాంగులకు ఉచిత ప్రయాణంపై క్యాబినెట్ కీలక నిర్ణయం
- ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్ల ఆర్థిక సహాయం
- రవాణా శాఖలో ఆటోమేషన్
- అసెంబ్లీలో బడ్జెట్ డిమాండ్‌పై చర్చలో మంత్రి మండిపల్లి



అమరావతి (చైతన్యరథం): స్త్రీ సాధికారత లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చొరవతో 2025 ఆగస్టు 15న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

సిటీ, ఆర్డినరీ, సిటీ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు సహా ఐదు రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ రోజు వరకు 47 కోట్ల ప్రయాణాలు జరగగా రూ.1660 కోట్ల సబ్సిడీ ప్రభుత్వం భరించిందన్నారు. ఈ పథకం అమలుతో మహిళా ప్రయాణికుల శాతం 40% నుంచి 65%కు పెరిగిందని, రోజుకు సగటున 25 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని వెల్లడించారు.

దివ్యాంగులకు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి తెలిపారు.

***రవాణా శాఖలో అభివృద్ధి కార్యక్రమాలు***

"ఆటో డ్రైవర్ సేవలో" పథకం ద్వారా 2025-26లో 2,90,669 మంది డ్రైవర్లకు రూ.436 కోట్లు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. డోన్ (కర్నూలు), దర్శి (ప్రకాశం)లలో డ్రైవర్ల శిక్షణ, పరిశోధన సంస్థలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు.

విశాఖపట్నం గంభీరంలో రూ.16.50 కోట్లతో I&C సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

***ఆధునికీకరణ - టెస్టింగ్-భద్రత***

రాష్ట్రంలో 9 ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు పనిచేస్తుండగా, మారుతి CSR సీఎస్ఆర్ కింద మరో 5 ఏర్పాటు కానున్నాయని తెలిపారు. 18 జిల్లాల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు పనిచేస్తుండగా మిగిలిన జిల్లాల్లో కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని చెప్పారు.

***విధాన నిర్ణయాలు***

ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 (2024-29) ప్రకారం రాష్ట్రంలో కొనుగోలు చేసి నమోదు చేసుకున్న ఎలక్ట్రిక్ వాహనాలకు మోటార్ వాహనాల పన్ను మినహాయింపు కల్పించామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు రోడ్డు భద్రతా నిధి ఏర్పాటు చేసి, అమలు ఆదాయాన్ని అందులోకి మళ్లించామని తెలిపారు.

***విద్యార్థులు, మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు***

మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని విమర్శించిన మంత్రి, ప్రస్తుతం 75% ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నామని స్పష్టం చేశారు.

***కొత్త బస్సులు***

పీఎంఈ బస్ సేవ ద్వారా 750 కొత్త బస్సులు రాష్ట్రానికి రానున్నాయని, సీఎన్‌జి, ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రతిపాదనలు పంపామని మంత్రి తెలిపారు.

# శ్రీకాకుళంలో డయేరియా అలజడి

- అధికారులతో మంత్రి నారాయణ అత్యవసర సమీక్ష
- డోర్ టు డోర్ సర్వే .. 102 కేసులు నమోదు

శ్రీకాకుళం (చైతన్యరథం): నగరంలో డయేరియా వ్యాప్తి నేపథ్యంలో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ మంగళవారం శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. వ్యాధి ప్రబలడానికి గల కారణాలు, నియంత్రణ చర్యలు, బాధితులకు అందుతున్న వైద్య సాయంపై విస్తృతంగా చర్చించారు.

నాలుగున్నర సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు మొత్తం 102 కేసులు నమోదైనట్లు మంత్రి తెలిపారు. వీరిలో పలువురు కోలుకుని డిశ్చార్జ్ కాగా ప్రస్తుతం 85 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో 45 మందిని వెంటనే డిశ్చార్జ్ చేయవచ్చని వైద్యులు సూచించినప్పటికీ జాగ్రత్త చర్యగా అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు వెల్లడించారు. ఇద్దరు రోగులు కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు.

డయేరియాతో ఒకరు మృతి చెందినట్లు నిర్ధారణ కాగా మరో వ్యక్తి ఇంట్లో మరణించినట్లు సమాచారం ఉందన్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడవుతాయని స్పష్టం చేశారు.



**డోర్ టు డోర్ సర్వే-50 బృందాల చర్యలు**

వ్యాధి నియంత్రణలో భాగంగా 50 ప్రత్యేక బృందాలతో ఇంటింటా సర్వే చేపట్టినట్లు అధికారులు తెలిపారు. తాగునీటి నమూనాల పరిశీలన, పారిశుధ్య చర్యలు, మందుల పంపిణీని వేగవంతం చేసినట్టు వెల్లడించారు. పరిస్థితి అదుపులోకి వస్తోందని మంత్రి పేర్కొన్నారు.

**ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన**

సమీక్ష అనంతరం మంత్రి పొంగూరు నారాయణ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి డయేరియా బాధితులను పరామర్శించారు.

డయేరియాతో మృతి చెందిన మండల సురేష్ కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన పలువురు బాధితుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

అలాగే రిమ్స్, కిమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులను మంత్రి పరామర్శించి, వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు.

**ప్రజలకు విజ్ఞప్తి**

పరిశుభ్రత పాటించడం, మరిగించిన తాగునీరు వినియోగించడం ద్వారా డయేరియా నివారించవచ్చని మంత్రి సూచించారు. లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# దగా, మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

**మంత్రి నిమ్మల రామానాయుడు**



అమరావతి (చైతన్యరథం): అబద్ధానికి ప్యాంటు, షర్టు వేస్తే అది జగన్... దగా మోసాలకు ఆయన బ్రాండ్ అంబాసిడర్' అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే ప్రారంభించి ప్రజలను జగన్ మోసం చేశాడన్నారు. సొంత తల్లి, చెల్లిని మోసం చేసిన వ్యక్తికి, ప్రజలను మోసం చేయడం లెక్కకాదన్నారు. పనులు పూర్తికాకుండా వెలిగొండ ప్రాజెక్టుని జాతికి అంకితం చేసి జగన్ మోసం చేశాడని ఎద్దేవా చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు

# ఆలయాల్లో అపచారాలు



**- జగన్‌పై మంత్రి ఆనం ఆగ్రహం**

అమరావతి (చైతన్యరథం): వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలపైనే కాదు ఆలయాలపైనా దాడులు జరిగాయి... రామతీర్థం మొదలు దుర్గమ్మ ఆలయం వరకు అన్ని ఆలయాల్లో ఎన్నో అపచారాలు చేశారు... మేం వచ్చాక ఆలయాల్లో రాజకీయ ప్రమేయం తగ్గించాం... ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు చేయిస్తున్నాం' అని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేవదాయ శాఖలో ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల్లో 98 శాతం హామీలను పూర్తి చేశామన్నారు. రూ.750 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఐదువేల ఆలయాల నిర్మాణం చేపట్టామన్నారు. సీజీఎఫ్ నిధుల ద్వారా రాష్ట్రంలో ఆలయాలను పునర్నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5వేల పైచిలుకు ఆలయాలకు ధూప, దీప, నైవేద్యం పథకం అమలు చేస్తున్నామన్నారు. వచ్చే సంవత్సరంలో గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామని వివరించారు. గోదావరి పుష్కరాల నిమిత్తం 12 మంది మంత్రులతో కూడిన ఉప సంఘాన్ని ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న టిడ్కో గృహ సముదాయాల్లో ఆలయాలు నిర్మిస్తున్నామ న్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదువేల భజన మందిరాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి ఆనం వెల్లడించారు.

# మదనపల్లి ఫైల్స్‌కు మించి సర్వేపల్లి ఫైల్స్

**- నేరుగా రెవెన్యూ మంత్రి రంగంలోకి దిగాల్సిందే**

**- అసెంబ్లీలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



అమరావతి (చైతన్యరథం): 'వైసీపీ ఐదేళ్ల పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలో రెవెన్యూ శాఖ పరంగా చాలా నేరాలు, ఘోరాలు జరిగిపోయాయి. మదనపల్లి ఫైల్స్ తరహాలోనే సర్వేపల్లి ఫైల్స్ కూడా చాలా ఉన్నాయని ఇప్పటికే మంత్రి సత్యప్రసాద్‌కు కూడా చెప్పాం. 57 ఎకరాలు రామదాసుకండ్రిగలో, మరో 57 ఎకరాలు మరుపూరులో, 36 ఎకరాలు సూరాయపాళెంలో, 19 ఎకరాలు కొమ్మలపూడిలో... ఇలా చెప్పుకుంటూపోతే వందల కోట్ల విలువైన భూముల విషయంలో అక్రమాలు జరిగాయి' అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ భూములను కాపాడే ప్రయత్నం చేస్తుంటే కోర్టులకు పోయి స్టేలు తెచ్చేస్తున్నారు అన్నారు. ప్రజల ఆస్తులను కాపాడేందుకు రెవెన్యూ అధికారులతో పాటు జీపీలు, ఏజీపీలు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరుతున్నానన్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని సర్వేపల్లి చెప్పారు.

# మాజీ సైనికుడి భూమిని కబ్జా

- **వైసీపీ నేతలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు**
- **రెవెన్యూ అధికారుల అండతో దొంగ పట్టాల పర్వం**
- **వందల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా**
- **వైసీపీ హయాంలో రాజకీయ కారణాలతో మాజీ సైనికుడికి భూమి కేటాయింపు నిలిపివేత.. మూడేళ్లుగా భూమి కోసం నిరీక్షణ**
- **అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు**
- **ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సోమి శెట్టి వెంకటేశ్వర్లు**

అమరావతి (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ గ్రామానికి చెందిన మడక విజయ భాస్కరరావు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బారులో నేతలకు అర్జీ ఇచ్చాడు. తాను జనవరి 2003లో ఇండియన్ నేవీ నుంచి ఉద్యోగ విరమణ చేశానన్నారు. అప్పట్లో సైనిక వెల్ఫేర్ ఆఫీస్ (విజయనగరం) సిఫార్సు మేరకు ప్రభుత్వం తనకు కొమరాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 339/4లో 5.00 ఎకరాల భూమిని "డి-పట్టా" రూపంలో కేటాయించింది. అప్పటి నుండి ఆ భూమి తన స్వాధీనంలోనే ఉంది. వైసీపీ ప్రభుత్వంలో కొమరాడ గ్రామానికి చెందిన వైసీపీ నేతలు మరదాన అప్పుల నాయుడు, పాటూరు రాములు, గొర్లి సాంబమూర్తి, కె.జనార్ధనరావు అనే వ్యక్తులు అప్పటి అధికార పార్టీ అండ చూసుకుని దౌర్జన్యంగా తమ భూమిని ఆక్రమించుకున్నారు. ప్రస్తుతం ఆ భూమిలోకి వెళ్తే ప్రాణాలతో వదలబోమని సదరు వ్యక్తులు తీవ్రంగా బెదిరిస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని నేతలు ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు అర్జీ ఇచ్చి అభ్యర్ధించాడు.

బాపట్లకు చెందిన సాధు నాగేశ్వరరావు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. అడవిపల్లి గ్రామంలోని సుమారు 96 ఎకరాల సీలింగ్ భూమిని కబ్జాదారులు తమ ఆధీనంలోకి తీసుకొని తహశీల్దార్ కార్యాలయ అధికారుల సహకారంతో అర్హత లేని వారికి దొంగ పట్టాలు సృష్టించారు. చీరాల మండలం పిట్టువారిపాలెంలో బుర్లా వెంకటరావు అనే వ్యక్తి సర్వే నెం. 499/2లో తప్పుడు పట్టాతో ప్రభుత్వ కాలువను పూడ్చివేశారు. దానిని తిరిగి ఓపెన్ చేయడానికి ప్రభుత్వం 2 కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది. అడవిపల్లి పాలెంలో జాగర్లమూడి కుప్పుస్వామి పేరుతో ఉన్న వందల ఎకరాల భూమిని దొంగ డాక్యుమెంట్లతో రిసోర్ట్స్, లే-అవుట్లుగా మార్చి అక్రమంగా విక్రయిస్తున్నారు. దీనిపై పలుమార్లు



అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కావున ఉన్నత స్థాయి విచారణ కమిటీని వేసి అక్రమ పట్టాలను రద్దు చేసి కబ్జాకు గురైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరాడు.

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లికి చెందిన నారాయణ స్వామి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. భారత సైనిక దళంలో 17 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలు అందించి పదవీ విరమణ చేశాను. అనకాపల్లి జిల్లా, మాడుగుల మండలం శంకరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 368/5, 368/7, 246/4 లో గల సుమారు 4.80 ఎకరాల ప్రభుత్వ గయాలు భూమి కోసం మార్చి 2022లో దరఖాస్తు చేసుకున్నాను. తమ కుటుంబం టీడీపీ పార్టీకి చెందిన వారమనే నెపంతో, గతంలో కలెక్టర్ కార్యాలయం వద్ద తన భూమి కేటాయింపు ప్రక్రియను నిలిపివేశారు. దేశానికి సేవ చేసిన సైనికుడికి కులమతాలు, రాజకీయాలతో సంబంధం ఉండదని గుర్తించకపోవడం బాధాకరం. పదవీ విరమణ పొంది మూడేళ్లు గడుస్తున్నా నేటికీ భూమి కేటాయింపు జరగలేదు. ప్రస్తుతం తాను తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నప్పటికీ ఒక మాజీ సైనికుడిగా తనకు దక్కాల్సిన హక్కును ప్రభుత్వం వెంటనే కల్పించాలని కోరాడు.

ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం తెల్లబాడు గ్రామానికి చెందిన రాంబాబు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్ నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చి నిబంధనలను తుంగలో తొక్కారు. పెట్రోల్ బంక్ నుండి కేవలం 48 మీటర్ల దూరంలో హైస్కూల్ ఉన్నప్పటికీ, తహశీల్దార్ తన నివేదికలో విద్యాసంస్థలు ఏవీ లేవని పేర్కొన్నారు. పైగా గ్రామంలో లేని డిగ్రీ కాలేజీ 500 మీటర్ల దూరంలో ఉందని అసత్యపు రిపోర్టు ఇచ్చారు. బంక్ తూర్పు కాంపౌండ్ వాల్ నుండి కేవలం 36 మీటర్ల దూరంలో 'టుబాకో క్యూరింగ్ ఫర్నెస్' (పొగాకు బ్యారన్) ఉన్నట్లు పర్సనల్ ఎంక్వయిరీ రిపోర్టులో పొందుపరచలేదు. పొగాకు బోర్డు లైసెన్స్ ఉన్న ఈ ఫర్నెస్ వద్ద అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు సమాచారంతో చీూజఇచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అప్పటి తహశీల్దార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అక్రమంగా నిర్మించిన పెట్రోల్ బంక్ అనుమతులను రద్దు చేయాలని కోరాడు.

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి మండలం తూర్పు గుడ్లదొన గ్రామానికి చెందిన పొండయ్య గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్ 102/1 లోని 3.00 ఎకరాల ప్రభుత్వ భూమిని లీజుకు పొంది గత కొంతకాలంగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ భూమిపై కన్నేసిన కొందరు వ్యక్తులు, భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ సాగుకు ఆటంకం కలిగిస్తున్నారు. ఈ మూడు ఎకరాల భూమిపైనే తమ కుటుంబం ఆధారపడి ఉంది. అధికారుల అనుమతితో సాగు చేసుకుంటున్నాను. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన లక్ష్మీ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తన పెద్దనాన్న గారి ద్వారా రిజిస్టర్డ్ విక్రయ పత్రం ద్వారా సంక్రమించిన ఇంట్లోకి ఎటువంటి యాజమాన్య హక్కులు లేని విజయలక్ష్మి అనే మహిళ దౌర్జన్యంగా ప్రవేశించారు. తన తల్లిని ఆసుపత్రికి తీసుకెళ్లిన సమయంలో, ఇంటి తాళాలు పగులగొట్టి లోపల ఉన్న నగదు, బంగారం, విలువైన పత్రాలను విజయలక్ష్మి దొంగిలించారు. ఈ వివాదంపై తహసీల్దార్ విచారణ జరిపి ఆమెను బయటకు వెళ్లాలని ఆదేశించినా ఆమె నిరాకరించారు. అనంతరం 02.02.2024న జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేయగా వారు కూడా ఇంటిని ఖాళీ చేయించాలని ఆదేశించారు. అయినప్పటికీ నేటికీ ఆ ఆదేశాలు అమలు కాలేదు. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పల్నాడు జిల్లా అమరావతి మండలం వైకుంఠపురం గ్రామానికి చెందిన కళ్ళం సంజీవరెడ్డి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. సర్వే నెం. 176/1సి లో 1.00 ఎకరం, 176/1ఎ లో 0.20 సెంట్లు భూమిలో మొక్కజొన్న, కొబ్బరి సాగు చేస్తున్నాం. సదరు భూమికి సంబంధించిన రికార్డులు తమ వద్ద ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన ఆలోకము సుధాకర బాబు, అతని అనుచరులు ఎటువంటి పత్రాలు లేకుండా కేవలం అరాచకంతో భూమిని కాజేయాలని చూస్తున్నారు. పండిన పంటను కూడా దౌర్జన్యంగా కోసుకుపోతామని బెదిరిస్తున్నారు. సదరు వ్యక్తుల భయంతో మండల అధికారులు కూడా స్పందించడం లేదని, గ్రామంలో లా అండ్ ఆర్డర్ వారి చేతుల్లోకి వెళ్లిపోయింది. కావునా వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.





# డయేరియా అదుపులోనే ఉంది

## శ్రీకాకుళం ఎమ్మెల్యే గోండు శంకర్ వెల్లడి

శ్రీకాకుళం (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లాలో డయేరియా పరిస్థితి ప్రస్తుతం అదుపులో ఉందని స్థానిక ఎమ్మెల్యే గోండు శంకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలుగు దేశం పార్టీ (టీడీపీ) కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వైద్యశాఖ అధికారులు, యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తున్నారని, అవసరమైన వైద్య సిబ్బంది ఔషధాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, స్వచ్ఛత పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు మొదలవలస రమేష్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

## డయేరియా బాధితులకు ఎమ్మెల్యే శంకర్ పరామర్శ

శ్రీకాకుళం (చైతన్యరథం): రాగోలు జేమ్స్ హాస్పిటల్‌లో డయేరియా రోగులను ప్రస్తుత పరిస్థితులను, రోగుల ఆరోగ్య పరిస్థితులను శాసనసభ్యుడు గోండు శంకర్ అడిగి తెలుసుకున్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, బీజేపీ నాయకులు, పోకతోట సింహాచలం, ఆంధ్రప్రదేశ్ టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సవలపురపు వెంకటరమణ మాదిగ ఆయన వెంట ఆసుపత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు. శాసనసభ్యుడు గోండు శంకర్ మీడియాతో మాట్లాడుతూ వారికి అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలపై వివరాలు తెలుసుకుని, కూటమి ప్రభుత్వం తరుపున అవసరమైన అన్ని రకాల వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. రోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలు భయపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే సమీప ఆసుపత్రి వర్గాలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బాల్యవివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత

## విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు మతుకుమిల్లి శ్రీ భరత్




విశాఖపట్టణం (చైతన్యరథం): బాల్యవివాహాలను అరికట్టి భావితరాల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా వుందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ పిలుపునిచ్చారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, అప్ హోల్డ్ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో బాల్యవివాహాల నిషేధ చట్టం పై అవగాహన కోసం ప్రచార రథాన్ని పార్లమెంటు సభ్యులు శ్రీభరత్ తన కార్యాలయం నుంచి ప్రారంభించారు. సంస్థ కోఆర్డినేటర్ డేవిడ్ రాజు, బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నరవ ప్రకాశరావు ఇతర సభ్యులతో కలిసి కరపత్రాలను కూడా ఆవిష్కరించారు..ఈ సందర్భంగా విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ మాట్లాడుతూ అప్ హోల్డ్ స్వచ్ఛంద సంస్థ ఇప్పటివరకూ విశాఖ పరిసరప్రాంతాల్లో 32 బాల్య వివాహాలను అరికట్టగలిగిందని అయితే ప్రజల్లో మరింత అగాహన కోసం ఇటు వంటి ప్రచార రథాలు ఉపకరిస్తాయన్నారు. అట్టడుగుస్థాయిలోని ప్రజలను విద్యావంతుల్ని చేయడం, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచే చర్యలతో ఇటు వంటి సామాజిక రుగ్మతలను అరికట్టవచ్చన్నారు. చట్టం పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించి బాల్య వివాహాల రహిత భారతదేశమే లక్ష్యంగా అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ ప్రచార ర మార్చి 8 మహిళా దినోత్సవం వరకూ ఎంపిక చేసిన హాట్ స్పాట్ లలో ప్రచారం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ప్రభుత్వ పథకాల ఫలితాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



విజయనగరం (చైతన్యరథం): నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే ఆలోచనతో శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో గ్రామాలు, డివిజన్ల వారీగా సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు ఈరోజు 30వ డివిజన్‌లో పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో పార్టీ ని బలోపేతం చేసేదిశగా పార్టీ కమిటీలు, అనుబంధ కమిటీల సభ్యులు క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించడంతో పాటు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉండాలని తెలిపారు.



# తూకివాకం సోలార్ ప్లాంట్‌కు మోక్షం

## టీడీపీ హయాంలో పురుడుపోసుకున్న ప్రాజెక్టు

తిరుపతి (చైతన్యరథం): ఆరేళ్లుగా ఆగిపోయిన తూకివాకం సోలార్ ప్లాంట్‌కు మోక్షం కలగనుంది. వైసీపీ హయాంలో 20 శాతం మిగులు పనులతో ఆగిపోయిన ప్లాంట్ పునరుద్దరణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఎండీ, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య చొరవతో ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. పీపీపీ పద్ధతిలో వైశాక సోలార్ ఎనర్జీ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కేటాయించింది. ఆమేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వానికి ఎలాంటి అదనపు ఆర్థిక భారంలేకుండా ప్రాజెక్టు పునరుద్ధరణ, అభివృద్ధి, ఆపరేషన్, నిర్వహణ బాధ్యతలు 25 ఏళ్లపాటు వైశాక సోలార్‌దే. కార్పొరేషన్‌కు గుడ్‌విల్ కింద ప్రభుత్వం సూచించిన మొత్తాన్ని చెల్లించడంతో పాటు ఉత్తతయ్యే విద్యుత్‌లో 60 శాతం కార్పొరేషన్‌కు 40 శాతం వైశాక సంస్థకు అందేలా ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. గ్రీన్ ఎనర్జీ పద్దతుల్లో కనీసం 10శాతం విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని పౌరసంస్థలకు కేంద్ర ప్రభుత్వం సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దాదాపు రూ20కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో సోలార్ ప్లాంట్లను నెలకొల్పేందుకు రేణిగుంట సమీపంలోని తూకివాకం వద్ద 6 వాట్ల విద్యుత్ ప్లాంట్ పనులు చేపట్టారు. 2021లోనే అందుబాటులోకి రావాల్సిన ప్రాజెక్టు నిధులులేమితో అర్ధాంతరంగా ఆగిపోయింది. ఇప్పటివరకు దాదాపు రూ16కోట్లు వెచ్చించినట్టు సమాచారం. సోలార్ విద్యుత్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు ప్రత్యేకదృష్టి కనబరుస్తుంటారు. ఈక్రమంలో 2019, ఫిబ్రవరి నెలలో తిరుపతి నగర పాలక సంస్థ స్మార్ట్ సిటీ నిధులతో రేణిగుంట మండలం తూకివాకం వద్ద 30 ఎకరాల్లో ఆరు మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ప్లాంట్ పనులు ప్రారంభించారు. హైదాదబాద్‌కు చెందిన నోవస్ గ్రీన్ ఎనర్జీ సేఫ్టీ లిమిటెడ్ సంస్థ 2020 నవంబరు వరకు 80శాతం పనులను పూర్తిచేసి వదిలేసింది. కాంట్రాక్టు సంస్థకు, కార్పొరేషన్‌కు సమన్వయ లోపంతో పాటు బిల్లులు చెల్లింపులో జాప్యం కారణంగానే పనులు నిలిచిపోయాయన్న విమర్శలు వినిపించాయి. మరో 20 శాతం పనులు పూర్తిచేస్తే నెలరోజుల్లోనే ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చేఅవకాశం ఉండేది. తూకివాకం వద్ద మొత్తం 30 ఎకరాలకు గాను 27 ఎకరాల్లో 18,240 సోరాల్ ప్యానల్స్ అమర్చారు. అదే విధంగా విద్యుత్ ఉత్పత్తి కోసం సబ్‌స్టేషన్ కంట్రోల్ రూమ్ పనులు కూడా సగంలో ఆగిపోయాయి. పర్యవేక్షణలేక ప్యానల్స్ దెబ్బతినడంతో పాటు పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తూకివాకం సోలార్ ప్లాంట్‌పై సమీక్షించారు. కమిషనర్ మౌర్య ప్రభుత్వంకి నివేదించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అర్ధాంతరంగా ఆగిపోయిన ప్లాంట్ అందుబాటులోకి రావడంతో పాటు కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరనుంది.



# తారకరామ ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయాలి

మైలవరం, (చైతన్యరథం): మెట్ట ప్రాంతమైన మైలవరం నియోజకవర్గానికి సాగునీటి వరప్రదాయిని తారకరామ ఎత్తిపోతల పథకం నిర్వహణకు తక్షణమే నిధులు విడుదల చేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు బుధవారం మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గ పరిధిలోని జి.కొండూరు, మైలవరం, విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల ఆయకట్టుకు సాగునీటి సౌకర్యం కల్పించాలనే ప్రధాన లక్ష్యంతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు అప్పట్లో స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి పేరుతో తారకరామా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.



### 1988లో 'తారకరామ'కు శ్రీకారం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు మూడవ జోన్ పరిధిలో మైలవరం ప్రాంతం చివరలో ఉన్న కారణంగా ఆయకట్టుకు సకాలంలో సాగునీటి సరఫరా విడుదల కాక అప్పటి జలవనరుల శాఖ మంత్రి కెఈ కృష్ణమూర్తి గారు, జిల్లా మంత్రి వసంత నాగేశ్వరరావు గారి చొరవతో తారకరామ ఎత్తిపోతల పథకానికి 1988లో శ్రీకారం చుట్టారని అన్నారు.

13,800 ఎకరాలకు సాగునీరు.

కృష్ణాజలాలను తారకరామ ఎత్తిపోతల పథకంలోని పంపింగ్ స్కీం మోటర్లతో కుడి, ఎడమ కాలువలకు ఎత్తిపోయడం ద్వారా 56 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో పథకానికి రూపకల్పన చేశారన్నారు. దీన్ని 13,800 ఎకరాలకు పరిమితం చేసి, 6 లిఫ్ట్ ఇరిగేషన్లతో 14 మోటార్లతో ప్రారంభించగా కాలక్రమేణా తాజాగా రైతులకు సాగునీరు అందించలేని దుస్థితికి వచ్చిందన్నారు. మెట్టప్రాంత రైతులందరూ ఈ పథకం పైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారన్నారు.

### రూ.75 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు

2019లో తను శాసనసభ్యునిగా ఉండి రైతుల అవస్థలు చూసి అప్పటికప్పుడు రూ.75లక్షలతో తాత్కాలికంగా మరమ్మతు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. దీనికి సంభందించిన బిల్లులు ఇవ్వాలని కూడా అప్పట్లో జగన్మోహన్ రెడ్డి గారికి విన్నవించినా బిల్లులు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 ఫిబ్రవరిలో బిల్లులు చెల్లించారని అన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు నిరుపయోగంగా మారిన పథకం.

గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా తారకరామా ఎత్తిపోతల పథకం నిర్వహణకు నిధులు విడుదల చేయని కారణంగా క్రమేపి పథకం రైతులకు నిరుపయోగంగా మారిందన్నారు. కేవలం నాలుగైదు మోటార్లు మాత్రమే పాక్షికంగా పనిచేస్తున్నాయన్నారు. దీన్ని పూర్తిగా అభివృద్ధి చేసి తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు రూ.4.05 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారని అన్నారు. దీనికి ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేసి శాశ్వత ప్రాతిపదికన మరమ్మత్తులు చేయాలని కోరారు.

### భూసేకరణ చేసి పథకాన్ని కొనసాగించాలి.

ఇదే పథకం కింద గన్నవరం వరకు సాగునీటిని సరఫరా చేయాలనే ఉద్దేశ్యంతో అప్పటి శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ గారి కాలువగా రైతులు నామకరణం చేసుకుని పిలుచుకునే కాలువ కూడా విజయవాడ రూరల్ మండలం పరిధిలోని కొత్తూరు తాడేపల్లి వరకు ఏర్పాటుచేసి అక్కడ అర్ధంతరంగా నిలిపివేశారన్నారు. భారీగా వర్షాలు పడితే ఈ కాలువ పరిసరాల్లో పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. భూసేకరణ చేసి ఈ కాలువ కూడా చివర వరకు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు కోరారు.

# రాయనపాడు శివమందిరంలో విగ్రహాల ప్రతిష్ట

## ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్, ప్రత్యేక పూజలు

రాయనపాడు(చైతన్యరథం): రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆ భగవంతుడి కరుణ కటాక్షాలు ఎల్లప్పుడూ ప్రసరించాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామంలో చెరువు వద్ద నిర్మించిన శ్రీ సోమేశ్వర స్వామి వారి శివాలయంలో బుధవారం నిర్వహించిన శివలింగం, నందీశ్వరుడు, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు వేదమంత్రాల నడుమ ఆలయ మర్యాదలతో ఎంపీ కేశినేని శివనాథ్‌కు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయన స్వామివారిని దర్శించుకుని రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ప్రార్ధనలు చేశారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన గ్రామ పెద్దలు, దాతలను అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల భావాలను పెంపొందిస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు భక్తి, ఐక్యతకు ప్రతీకలని ఎంపీ పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయనపాడు సర్పంచ్ కాటంనేని పూర్ణ, రాయనపాడు గ్రామ పార్టీ ప్రెసిడెంట్ శీలంనేని సాంబశివరావు ఎన్టీఆర్ జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు గూడపాటి పద్మ శేఖర్,జనసేన మైలవరం ఇన్చార్జ్ అక్కల గాంధీ, గొల్లపూడి గ్రామ టీడీపీ ప్రెసిడెంట్ నూతలపాటి నారద లతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# టీడీపీలోకి తిరువూరు వైసీపీ నేతలు

## పసుపు కండువాలు కప్పి ఆహ్వానించిన ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): తిరువూరు టీడీపీ టౌన్ అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తిరువూరు పట్టణానికి చెందిన వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి రామడుగు రామకోట చారి, గీతం స్కూల్ కరస్పాండెంట్ గీతమ్స్ చారి ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో బుధవారం ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్ వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలో ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు టీడీపీ టౌన్ అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు, బీసీ సెల్ నాయకులు కందిమళ్ల శేషగిరిరావు, టీడీపీ నాయకులు మాదల హరిచరణ్ (కిట్టు), మోదుగ వెంకటేశ్వరరావు, యంద్రాతి కిరణ్, తూళ్లురి అనిల్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, చిన్న జమలయ్య, షేక్ హుస్సెన్, షేక్ ఉమర్, కందిమళ్ల సాయి సునీల్, టీడీఎ పసుపు కండువాలు కప్పి ఆహ్వానించిన ఎంపీ కేశినేని శివనాథ్ మహిళ నాయకులు మాధవిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి వైపు ప్రాజెక్టుల చూపు

నక్కపల్లి (చైతన్యరథం): జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. విశాఖ-చెన్నై కారిడార్‌లోని నక్కపల్లి క్లస్టర్‌లో భారీ, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయిస్తున్న కూటమి ప్రభుత్వం, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లోని ప్రత్యేక ఆర్థిక మండలిలో కొత్త పరిశ్రమలు, కంపెనీలకు భూములు కేటాయిస్తున్నది. అదే విధంగా వివిధ రకాల రాయితీలను ప్రకటించి, ప్రోత్సాహాలను అందిస్తున్నది. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటకు భూ కేటాయింపులు జరిపారు. రాంబిల్లి మండలంలో రూ.8,175 కోట్ల భారీ పెట్టుబడులతో 'మెస్సర్స్ వారే ఎనర్జి స్టోరేజీ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ (డబ్ల్యూఈఎస్ఎస్‌పీఎల్) గ్రీన్‌ఫీల్డ్ లిథియం అయాన్‌సెల్ గిగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకోసం 300 ఎకరాలను కేటాయించింది. సంవత్సరానికి 16 గిగావాట్ పవర్ సామర్థ్యంతో లిథియం అయాన్‌సెల్ గిగాఫ్యాక్టరీతో పాటు బ్యాటరీ ఎనర్జీ సోరేజీ సిస్టమ్ (బీఈఎస్ఎస్) తయారీ యూనిట్‌ను నెలకొల్పనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి రంగాలకు అవసరమైన విద్యుత్ నిల్వ సుదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కంపెనీలో ప్రత్యక్షంగా మూడు వేల మందికి, అనుబంధ రంగాల్లో పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. రాంబిల్లి మండలంలో బాలాజీ యాక్షన్ బిల్డ్‌వేస్ ప్రైవేటు లిమిటెడ్ (యాక్షన్ టెసా) ఏర్పాటు చేయనున్న ఎండీఆర్ బోర్డులు, ఇతర ఇంటరీయర్ సామగ్రి కంపెనీకి సంబంధించి ప్రోత్సాహకాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ సంస్థ పెట్టుబడికి సంబంధించి ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజీని ప్రభుత్వం ఆమోదించింది. మొత్తం అర్హత పొందిన పెట్టుబడులపై రూ.1,233.15 కోట్ల మేర ప్రోత్సాహకాలు, రూ.1,500 కోట్ల వరకు ఉత్పాదక కార్యకలాపాలకు సంబంధించి సబ్సిడీ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.

# జిల్లా అభివృద్ధి, టీడీపీ బలోపేతమే లక్ష్యం

విజయవాడ (చైతన్యరథం): జిల్లా అభివృద్ధి, తెలుగుదేశం పార్టీ బలోపేతమే తమ ప్రధాన లక్ష్యం" అని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. తెలుగుదేశం రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు గొల్లపూడిలో నిర్మాణం చేయనున్న ఎన్టీఆర్ జిల్లా కొత్త టీడీపీ కార్యాలయ నిర్మాణ స్థలాన్ని బుధవారం ఉదయం గద్దె అనురాధ, కేశినేని చిన్నిల సమక్షంలో నాయకులు పరిశీలించారు. త్వరలో శబ ముహూర్తంలో భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. స్థలాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం, భవన రూపకల్పన, విభాగాల వారీ కార్యాలయ గదులు, సమావేశ మందిరం, మీడియా సెంటర్, శిక్షణ హాల్, డిజిటల్ కమ్యూనికేషన్ విభాగం, కార్యకర్తల కోసం ప్రత్యేక సదుపాయాల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆధునిక సాంకేతిక వసతులతో, పారదర్శకతకు ప్రతీకగా నిలిచే విధంగా కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ జిల్లా పార్టీ కార్యాలయం కేవలం భవనం మాత్రమే కాకుండా పార్టీ కార్యకలాపాలకు శక్తివంతమైన కేంద్రంగా, కార్యకర్తలకు మార్గదర్శక వేదికగా, ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయ కేంద్రముగా నిలిచేల నిర్మాణం చేస్తామన్నారు. జిల్లా నడిబొడ్డున కార్యాలయం ఉండటం వల్ల అన్ని నియోజకవర్గాల ప్రజలకు, నాయకులకు సులభంగా చేరుకునే అవకాశముంటుందని తెలిపారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీ క్రియాశీలక పాత్ర పోషిస్తూ, ప్రభుత్వ పథకాల అమలుపై పర్యవేక్షణ, ప్రజల అభిప్రాయాల సేకరణ, సమస్యలపై సమర్ధవంతమైన స్పందనకు ఈ కార్యాలయం కేంద్రబిందువుగా పనిచేస్తుందని తెలిపారు.ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ గద్దె అనురాధ నాయకత్వంలో జిల్లా పార్టీ మరింత ప్రతిష్టను సంపాదిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం, పరిపాలనా దక్షత, ప్రజలతో ఉన్న అనుబంధం ఆమెకు బలమని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమస్యలపై స్పష్టమైన అవగాహనతో, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లే నాయకత్వ లక్షణాలు ఆమెకు ఉన్నాయన్నారు. రాబోయే రోజుల్లో సభ్యత్వ విస్తరణ, యువతకు బాధ్యతల అప్పగింత, మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ బలోపేతం చేయడం, సోషల్ మీడియా మరియు డిజిటల్ వేదికల ద్వారా ప్రజలతో నిరంతర సంబంధాలు పెంపొందించడం వంటి కార్యక్రమాలను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టి బాబు, గొల్లపూడి టీడీపీ ప్రెసిడెంట్ నూతలపాటి నారద, రాష్ట్ర వాణిజ్య ఉపాధ్యక్షుడు గూడపాటి పద్మశేఖర్, విజయవాడ మార్కెట్ చైర్మన్ నర్రా వాసు, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీను నాయక్, టిడిపి నాయకులు బొర్రా తిరుపతిరావు టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్‌లతోపాటు పలువురు జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

**గొల్లపూడిలో పార్టీ కార్యాలయ స్థలం పరిశీలన సందర్భంగా గద్దె అనురాధ, కేశినేని చిన్ని**



## వృద్ధ దంపతులకు అండగా నిలిచిన టీడీపీ



విజయవాడ (చైతన్యరథం): అయ్యప్ప నగర్, గణేష్ రోడ్‌లో టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పర్యటించి, అక్కడ నివసిస్తున్న వృద్ధ దంపతులు మారెడ్డి పిచ్చిరెడ్డి, తులశమ్మల సమస్యలను తెలుసుకున్నారు. పట్టించుకునే వారు లేక నిరాశ, నిస్పృహల మధ్య జీవనం సాగిస్తున్న ఆ దంపతులకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఆదేశాల మేరకు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం ఉచితంగా అందజేసి, ఖర్చుల కోసం రూ.1,000 నగదు సాయం చేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఇటీవల వృద్ధ దంపతులు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కలిసి వారి సమస్యలను ఆయనకు వివరించి ఆదుకోవాలని కోరారని, దానిపై ఎమ్మెల్యే గద్దె రామమోహన్ వారికి సహాయం చేయాలని తనకు సూచించారని ఆ మేరకు డివిజన్ పార్టీ నాయకులతో కలిసి తాను ఈ సాయం అందజేసినట్లు తెలిపారు. తోటివారికి సహాయం చేయడంలో లభించే తృప్తి మరేదానితోనూ సమానం కాదని, సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దాతలు ముందుకు వచ్చి అవసరమైన వారికి చేయూతనివ్వాలి అని పిలుపునిచ్చారు. అనంతరం డివిజన్‌లో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లో సిల్ట్ పూడికతీత పనులను కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబుతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ కరీం, మేదరమెట్ల నారాయణ, సాయన బుజ్జి, మహమ్మద్ ఇబ్రహీం, బొర్రా బాలు, పఠాన్ హయత్ ఖాన్, మోటూరి బుచ్చిబాబు, కోడే సాంబశివరావు, సూర్యనారాయణ, యనమద్ది శ్రీనివాసరావు, మండవ రాంబాబు, బాజీ, ఫజురుల్ రబ్, మస్తాన్ తదితరులు ఉన్నారు.

## ఎంపీ కేశినేనితో కర్నూలు ఎంపీ బస్తిపాటి భేటీ

విజయవాడ (చైతన్యరథం): గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు బుధవారం విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దావెంకన్నతో కలిసి ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ఎంపీ స్వాగతం పలికారు. కాసేపు మార్చిలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలతో పాటు రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడుకున్నారు.



# నేను సైతం డెలివరీ బాయ్‌గా..

**యువత ఆత్మగౌరవంతో బతకాలని అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే బోడె వినూత్న సందేశం**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని నిరుద్యోగ యువత చెడు మార్గాల వైపు దారి తప్పకుండా, ఖాళీగా ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సభ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నానని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. పని చిన్నదా, పెద్దదా అన్న భావనకు అతీతంగా, ఆత్మగౌరవంతో ఏ అవకాశమైనా స్వీకరించి జీవితంలో ముందుకు సాగాలని యువతకు పిలుపునిస్తున్నానని అన్నారు. డెలివరీ బాయ్ కష్టాలు తెలుసుకోవాలని కావాలని తాను కూడా ఒక రోజు పని చేశానన్నారు. ప్రస్తుతంస్విగ్గీ, జమాటో, బ్లింకిట్, ఊబర్ వంటి వేదికల ద్వారా వేలాది మంది యువత ఉపాధి పొందుతున్నారని వివరించారు.



అయితే, ఈ రంగంలో పనిచేస్తున్న డెలివరీ భాగస్వాములు అనేక మౌలిక వసతుల లోపాలను ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అందువల్ల, రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్యలను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని, డెలివరీ ఏజెంట్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ చర్యలు అమలు చేయాలని సంబంధిత మంత్రిని ఈ సభ వేదికగా వినయపూర్వకంగా కోరుతున్నానన్నారు. యువత శక్తిని సక్రమ దిశలో నడిపించడం, వారికి గౌరవప్రదమైన ఉపాధి అవకాశాలు కల్పించడం సదురు మంత్రి తగు ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నానన్నారు.

## అసెంబ్లీ సమావేశాలకు తాడిగడప విద్యార్థులు

**అవగాహన కల్పించిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్**

పెనమలూరు (చైతన్యరథం): పెనమలూరు నియోజకవర్గం, తాడిగడప మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు విద్యార్థి దశనుంచే సమాజం, చట్టాలపై అవగాహన కల్పించాలని ఉద్దేశంతో బుధవారం నిర్వహించే అసెంబ్లీ సమావేశాలను స్థానిక శాసనసభ్యులు బోడే ప్రసాద్ సహకారంతో విద్యార్థులు తిలకించారు, చట్టసభల్లో చట్టాలు రూపొందించడం, అమల పరచడం, సమస్యలపై ఎమ్మెల్యేలు చర్చించే తీరును స్వయంగా చూడడంతో విద్యార్థులు అనుభూతి చెంది సంతోషాన్ని వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలను తిలకించేందుకు అవకాశం కల్పించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనసభ్యులు బోడే ప్రసాద్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు విద్యార్థి దశ నుంచి ప్రజాస్వామ్యం,నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని విద్యార్థులకు స్పీకర్, ఎమ్మెల్యే సూచించారు.



# దోపిడీపై తగని శ్రద్ధ.. రోడ్ల అభివృద్ధిపై తీరని అశ్రద్ధ!

## గత వైసీపీ పాలకులపై అసెంబ్లీలో విరుచుకుపడిన ఎమ్మెల్యే ప్రశా



కోవూరు (చైతన్యరథం): గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అధ్వానంగా మారిన రహదారులు, కల్వర్టులను యుద్ధ ప్రాతిపదికన పునర్ నిర్మించాలన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని కల్వర్టులు మరియు శిధిలావస్థకు చేరిన వంతెనల దుస్థితిపై శాసనసభలో ఆమె మాట్లాడుతూ గత పాలకులు రోడ్ల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణాలపై ఉన్న శ్రద్ధ రోడ్లపై గుంటలు పూడ్చుడంపై చూపలేదన్నారు. గుంతలు పడ్డ రోడ్లప కనీసం ఒక ట్రక్కు మట్టి వేసి పూడ్చిన దాఖలాలు లేవని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ధ్వజమెత్తారు. 2021 వరదల సమయంలో కొట్టుకు పోయిన కలయకాగోలు, పెనుబల్లి కల్వర్టును ఇప్పటికీ నిర్మించక పోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. దశాబ్దాల నాటి అత్యంత పురాతనమైన దామరమడుగు, పాటూరు కల్వర్టు ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో ప్రజలు ప్రయాణిస్తున్నారని తక్షణమే పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుచ్చి నుంచి ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన జొన్నవాడకు వెళ్లే దారిలో రహదారి బాగున్నా మధ్యలో ఉన్న రెండు ఇరుకు కల్వర్టుల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని తక్షణమే విస్తరించాలని కోరారు. కోవూరు స్టౌ బీడీ కాలనీ వద్ద సదరన్ ఛానల్‌పై ఉన్న బ్రిటిష్ కాలం నాటి పాత కల్వర్టును పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా విస్తరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి శాసనసభలో ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా రహదారుల పనులు వేగవంతంగా సాగుతున్నాయని అదే స్ఫూర్తితో కోవూరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఈ కీలక పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# విద్యార్థుల దాహార్తిని తీర్చిన భగీరథుడు

## ఎమ్మెల్యే కాకర్లకు కితాబు

సీతారాంపురం (చైతన్యరథం): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సీతారాంపురం మండలం, గుండుపల్లి పంచాయితీ, ఓ గురువాండ్లపల్లిలో ఉన్న, జిల్లా పరిషత్ హై స్కూల్లో కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు త్రాగడానికి నీరు లేక మధ్యాహ్న భోజన సమయంలో కూడా నానా ఇక్కట్లు పడుతున్న నేపథ్యంలో మండల పార్టీ తెదేపా అధ్యక్షులు సీహెచ్. శ్రీనివాసరావు, ఇతర నాయకుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సత్వరమే స్పందించారు. 200 మంది విద్యార్థులకు వెనువెంటనే తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామపంచాయతీ సిబ్బంది కి ఆదేశాలు జారీ చేశారు. గ్రామ సర్పంచ్, మండల, గ్రామ పార్టీ తెదేపా నాయకులు సైతం దగ్గరుండి తాగునీటి పైపులైన్లను ఏర్పాటు చేయించారు. దీంతో 200 మంది విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కు విద్యార్థులు వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## రంగనాథుని దేవాలయ కమిటీ నియామకం

నెల్లూరు(చైతన్యరథం): నగరంలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం కొత్త కమిటీ ఏర్పాటైంది. మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు ఈ కమిటీని నియమించినట్లు తెలిపారు. నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి కమిటీకి మార్గదర్శకత్వం వహిస్తున్నారు. లంకెల అంకి రెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అద్దంకి చంద్రశేఖర్ బోర్డు సభ్యునిగా నియమితులయ్యారు. ధర్మవరం సుబ్బారావు, నెల్లూరు నగరం 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ బృందం కమిటీ సభ్యులను అభినందించారు.



# వెలుగొండతో మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలం

దర్శి (చైతన్యరథం): మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి సిరులు కురిపించేందుకు వెలుగొండను ప్రాజెక్టును పూర్తి చేసేందుకు విచ్చేసిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు దర్శి ప్రజానీకం తరుపున టీడీపీ ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రూ. 456 కోట్లతో చేపట్టిన వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనుల శంకుస్థాపనకు బుధవారం మార్కాపురం విచ్చేసిన సందర్భంగా వెలుగొండ ప్రాజెక్టు పనులను ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడు గారు పరిశీలించి పనుల పురోగతిని ప్రాజెక్టు ఏ ఏ ప్రాంతాలకు తాగునీటి అందిస్తుందన్న వివరాలను ఇంజనీరింగ్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తో కొద్దిసేపు ముఖ్యమంత్రి చంద్రబాబు వెలుగొండ ప్రాజెక్టుతో దర్శి నియోజకవర్గంలోని దొనకొండ, కురిచేడు ప్రాంతాలలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటాయని ఆయన వివరించారు. ఫీడర్ కెనాల్ పొడిగించడం డాట్ ల్యాండ్‌ను సస్యశ్యామలం చేసే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ ని చేపట్టామని ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ కరువు ప్రాంతమైన దొనకొండ, కురిచేడు ప్రాంతాలలో భూగర్భ జలాలు వెలుగొండ ప్రాజెక్ట్ ద్వారా ఉప్పొంగుతాయని ఫ్లోరిన్ పీడ నుండి విముక్తి జరుగుతుందని కూటమి ప్రభుత్వంలో జల ప్రదాతగా మీరు ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం మా ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుందని ఈ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి గా మీరు చిరస్థాయిగా ఉంటారని మరొకసారి దర్శి ప్రజానీకం తరుపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని గొట్టిపాటి లక్ష్మీ చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



# మంత్రి నారాయణ చొరవతో పారిశుధ్య సమస్య పరిష్కారం

నెల్లూరు (చైతన్యరథం): మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలతో బుధవారం టీడీపీ కార్యకర్తలు పారిశుధ్య పర్యవేక్షణలో పాల్గొన్నారు. 44 డివిజన్ ఆచారి వీధి మసీదుల వద్ద, బారకాస్ సెంటర్ శానిటేషన్ పరిశీలించుకుంటూ ప్రజలతో కలుస్తూ కాలవలలో దోమలు ముందు పిచికారీ చేయడం, హ్యాండ్ ఫాగింగ్ మిషన్ ద్వారా దోమలు ముందు ఫాగింగ్ చేయించారు.

ఈ శీతాకాలంలో దోమల ఉత్పత్తి అరికట్టడానికి ప్రజలకు అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు. ఇంటి పరిసరాలలో నిలువనీరు, చెత్త, పేరుకోకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఖాళీ టైర్లు పనికిరాని వస్తువులను ఎప్పటికప్పుడు క్లీన్ చేసుకోవాలని చెప్పి ప్రజలకు అవగాహన కల్పించారు. 44 డివిజన్ పరిధిలో మ్యాన్ హోల్స్, రోడ్డు కంటే చాలా పల్లంగా ఉండటంవల్ల ప్రమాదాలకు దారితీయడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు చాకలి వీధిలోని మూడు మ్యాన్ హోల్స్ రోడ్డు లెవెల్‌కు సరి చేయడంతో సమస్య సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో44 డివిజన్ యూనిట్ ఇంచార్జ్ వై రమేష్ బాబు, కోఆర్డినేటర్ చరణ్ శానిటేషన్ సిబ్బంది జిలాని మోసెస్, ప్రవల్లిక, మేస్త్రిఅశోక్, రాజేష్ కార్మికులు స్థానికులు పాలొన్నారు.



నిరంతర ఓటర్ల జాబితా నవీకరణ, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ సమావేశం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించిన జిల్లా రెవెన్యూ అధికారి, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఎన్ విజయ్‌కుమార్ నిర్వహించారు.

# రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం

**సింహాద్రిపురంలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం, పాల్గొన్న జడ్పీటీసీ లతారెడ్డి, బీటెక్ రవి తదితరులు**



పులివెందుల, (చైతన్యరథం): అన్నదాతల శ్రేయస్సే లక్ష్యంగా, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలన్న దృఢ సంకల్పంతో సింహాద్రిపురంలో మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి, పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి, వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి రామసురా రెడ్డి, శనగల కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట దళారుల పాలై నష్టపోకూడదన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను ప్రతి ఒక్క రైతూ వినియోగించుకోవాలని కోరారు. గతంలో రైతులు పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. సింహాద్రిపురం మండలంతో పాటు పరిసర గ్రామాల శనగ రైతులందరూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇక్కడే తమ పంటను విక్రయించి లాభపడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, కూటమి నాయకులు పుప్పాల శ్రీధర్ రెడ్డి, సింహాద్రిపురం సింగిల్ విండో అధ్యక్షుడు పీజీ గోపాల్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



# అలసందలతో అమితాదాయం

అనంతపురం (చైతన్యరథం): జిల్లాలోనే ప్రత్యేకించి తనకల్లు మండలంలో ఏడాది పొడవునా వందలాది ఎకరాల్లో టమోటా సాగులో ఉంటుంది. ఇటీవల టమోటా సాగుకు ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పేపర్ (మల్చింగ్‌షీట్), డ్రిప్, కట్టెలు, వైరు, మందులు, ఎరువులు, కూలీలు ఇలా ఎకరాలో పంట సాగు చేయడానికి రూ. 1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు ఖర్చవుతోంది. ఇంత ఖర్చు పెట్టి సాగుచేస్తే.. మార్కెట్‌లో ధరలు ఉంటాయో.. లేదో.. తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ కారణంగా టమోటా సాగుచేసిన రైతులు రూ.లక్షలు నష్టపోవాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కర్ణాటక రాష్ట్రంలోని బాగేపల్లి, చేలూరు, చింతామణి ప్రాంతాలకు చెందిన సీడ్ వ్యాపారులు తమ దృష్టిని తనకల్లు మండలం వైపు మళ్లించారు. దీంతో మండల రైతులు ఏడాది పొడవునా టమోటాలు సాగుచేసి, నష్టాల పాలవుతుండడంతో కొంత విత్తన అలసంద సాగువైపు మొగ్గుచూపారు. టమోటాకు రెండో పంటగా పెట్టే ఈ విత్తన అలసంద సాగు ఆశాజనకంగా ఉండడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ ఏడాది వందలాది ఎకరాల్లో సాగుచేశారు. యర్రబల్లి పరిధిలోనే వందకుపైగా ఎకరాల్లో పంట పెట్టారు. క్వింటాల్ ధర రూ. 18వేలతో రైతులతో ఒప్పందం చేసుకుని, విత్తనాలను వ్యాపారులు ఉచితంగా అందజేశారు. 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరాలో పంట సాగుకు రూ. 5వేలకు మించి పెట్టుబడి అవసరంలేదని వారు అంటున్నారు. నిరకంగా రూ. 60వేల నుంచి రూ. 80 వేల వరకు ఆదాయం వస్తోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా విత్తన అలసంద సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం కోత దశలో ఉంది. కొంతమంది రైతులు పంట నూర్పిడి చేసి విక్రయిస్తున్నారు. లాభసాటిగా ఉండడంతో పలువురు రైతులు ఆవైపు మొగ్గు చూపుతున్నారు. రసాయన మందులు కూడా పెద్దగా అవసరం లేదని రైతులు చెబుతున్నారు. బంక, పేను నివారణకు మాత్రమే రెండు, మూడుమార్లు మందులు పిచికారీ చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు.



# పేదల సొంత ఇంటి కల నెరవేర్చండి


**శాసనసభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



కోవూరు, (చైతన్యరథం): గత ప్రభుత్వ తప్పిదాల వల్ల పేదల సొంత ఇంటి కల కలగానే మిగిలి పోయిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశాలలో పేదల పక్కా ఇళ్ల సమస్యపై ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ అవినీతిపై ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ విషయంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, అవకతవకల వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు గ్రామీణ ప్రాంతాలలోని క్షేత్రస్థాయి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. భూసేకరణ పేరుతో కొంత మొత్తం, ల్యాండ్ డెవలప్‌మెంట్ పేరుతో మరికొంత మొత్తాన్ని గత పాలకులు దారిమళ్లించారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆరోపించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండా కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకున్నారని నియోజకవర్గ పరిధిలో వేలాదిగా పునాది దశలోనే ఆగిపోయిన అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల గురించి ఆమె సభలో ప్రస్తావించారు. నియోజకవర్గ పరిటాల పర్యటనలకు వెళ్ళినప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు తమకు ఇల్లు కావాలని కోరుతున్నారని ఆమె తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు సంతోషంగా ఉన్నప్పటికీ ఈ గృహనిర్మాణ సమస్య మాత్రం వారిని వేధిస్తోందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఎన్నిసార్లు చర్చించుకున్నా పేదల ఇళ్ల సమస్య మాత్రం కొలిక్కి రావడం లేదని విజిలెన్స్ విచారణలతో కాలయాపన చేయకుండా పేదలకు ఇళ్లు దక్కేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోరారు. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల పక్షాన నిలబడి యుద్ధ ప్రాతిపదికన పక్కా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా ఒక స్పష్టమైన పరిష్కారం కనుగొనాలని ఆమె గృహ నిర్మాణ శాఖ మంత్రి కి సూచించారు. బడుగు బలహీన వర్గాల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు.

# శ్రీ స్వామి నారాయణ అంతర్జాతీయ గురుకుల పాఠశాల

ఓర్వకల్లు (చైతన్యరథం): అంతర్జాతీయ గుర్తింపు పొందిన శ్రీ స్వామి నారాయణ గురుకుల అంతర్జాతీయ పాఠశాల(ఎస్‌జీఐఎస్) కర్నూలులో ఏర్పాటు కానుంది. కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామ పరిధిలో పాఠశాల స్థాపనకు పది ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలనే ఆ సంస్థ విన్నపాన్ని ప్రభుత్వం పరిశీలించింది. మార్కెట్ ధర ఎకరం రూ. 71.63 లక్షల ప్రకారం నిర్ణయం జరిగింది. ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ హాజరయ్యారు. జిల్లాలో పలు సంస్థలు ఏర్పాటుకు భూ కేటాయింపులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందించేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అందులో భాగంగానే అంతర్జాతీయ గుర్తింపు పొందిన శ్రీ స్వామి నారాయణ గురుకుల ఇంటర్నేషన్ స్కూల్ స్థాపనకు ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ గుట్టుపాడు క్లస్టర్‌లో సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్, ఏపీఐ ఉత్పుత్తులు చేసేందుకు విరూపాక్ష ఆర్గానిక్స్ లిమిటెడ్ ముందుకు వచ్చింది. ఈ సంస్థకు ఎస్ఐపీబీ సిఫార్సుల మేరకు ప్రోత్సాహకాలు అందించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే.. దేవనకొండ మండలం ముతకూరు తదితర గ్రామాల్లో రెన్యూ ఫొటో వోల్టాయిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేసింది. రైతుల నుంచి ప్రైవేట్ భూములను కొనుగోలు చేసి సోలార్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఆ భూముల మధ్యలో ఖాళీగా ఉన్న రెవిన్యూ, అసైన్డ్ భూములు కేటాయించాలని ఆ సంస్థ విన్నపం మేరకు ఆ భూములను కేటాయిస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 కింద సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం క్యాప్టివ్ జనరేటింగ్ ప్లాంట్లకు వర్తించే ప్రోత్సాహకాలను కొనసాగించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జిల్లాలో ఆలూరు, చిప్పగిరి, హొళగుంద మండలాల్లో 900 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుల కోసం ఎన్‌టీసీసీ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్‌కు అనుమతులు మంజూరు చేసింది.



# పలుకే బంగారం... పదమే సింగారం

## సిలికానాంధ్ర ఆధ్వర్యంలో 'మన బడి-తెలుగు మాట్లాట' పోటీలు విజయవంతం

**అమెరికాలో తెలుగువారి పిల్లల్లో తెలుగు భాష మరింత వాడుకలోకి రావాలన్న ఉద్దేశ్యంతో సిలికానాంధ్ర ఆధ్వర్యంలో 'మన బడి-తెలుగు మాట్లాట' భాషా వికాస పోటీ నిర్వహించారు. 5 నుంచి 9 ఏళ్ల వయసు పిల్లలు (బుడతలు విభాగం), 10 నుంచి 13 ఏళ్ల వయసు పిల్లలు (సిసింద్రీలు విభాగం) పాల్గొన్నారు. పలుకే బంగారం... పదమే సింగారం అంటూ... పిల్లలు తమకు ఇచ్చిన అంశాలపై ఉచ్చారణ, వ్యాకరణ, భాషా దోషాలు లేకుండా వాగ్ధాటిగా మాట్లాడారు. దీంతో తల్లిదండ్రులు, పోటీలు చూసేందుకు వచ్చిన వారు ఆనందించారు.**

టంపా, ఫ్లోరిడా: సిలికాన్ ఆంధ్రా మన బడి-ల్యాండ్ ఓ'లేక్స్/లట్జ్ బ్రాంచి ఫిబ్రవరి 21న లట్జ్‌లోని క్రైస్ట్ కంబర్‌ల్యాండ్ ప్రెస్బిటేరియన్ చర్చిలో 'తెలుగు మాట్లాట' ప్రాంతీయ ప్రిలిమ్స్ పోటీలను విజయవంతంగా నిర్వహించింది.

8వ కన్వెన్షన్ కన్వీనర్ నార్త్ అమెరికా తెలుగు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ల్యాండ్ ఓ'లేక్స్/లట్జ్ సెంటర్ కో-ఆర్డినేటర్ కరుణ మన్నెమెల నాయకత్వం వహించారు. బ్రాంచి ఉపాధ్యాయులు, అంకితభావంతో పనిచేసే స్వచ్ఛంద సేవకులు, ఉత్సాహభరితమైన తల్లిదండ్రుల నుంచి అద్భుతమైన మద్దతు లభించింది. ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవకులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీలు సజావుగా, ప్రోత్సాహకరంగా, చక్కగా నిర్వహించారని నిర్ధారించారు. గత సంవత్సరం టంపా బే ప్రాంతంలో తెలుగు మాట్లాట పోటీలను ప్రవేశపెట్టిన మొదటి కేంద్రం ఇదేనని మనబడి, ల్యాండ్ ఓ'లేక్స్/లట్జ్ బ్రాంచి గర్వంగా ప్రకటించుకుంది. ఈ సంవత్సరం విద్యార్థుల భాగస్వామ్యంలో మూడు రెట్లు పెరుగుదల కనిపించింది. ఇది యువ అభ్యాసకుల్లో తెలుగు భాషా అభ్యాసం పట్ల పెరుగుతున్న



ఉత్సాహాన్ని ప్రతిబింబించింది.

పోటీలను మూడు రకాలుగా నిర్వహించారు.

పదరంగం

తిరకాటం

ఒనిమా

అన్ని కేటగిరీల్లో విజేతలు ఆగస్టు 15, 16 తేదీల్లో నార్త్ కరోలినాలో జరిగే అంతర్జాతీయ తెలుగు మాట్లాట పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. సిలికాన్ ఆంధ్ర క్రైస్ట్ కంబర్లాండ్‌కు చెందిన లారా రీడ్‌కు నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మాట్లాట పోటీలకు ప్రాంగణం ఇచ్చిన ప్రెస్బిటేరియన్ చర్చి విద్యా సంస్థకు, మద్దతు, పునాది మార్గదర్శకత్వం ఇచ్చిన ప్రత్యూష తాళ్లూరి, కిరణ్ పరపూడిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రాంతీయ పోటీలు - టంపా, ఫ్లోరిడా

స్థానం: ల్యాండ్ ఓ'లేక్స్/లూట్జ్ బ్రాంచ్

విజేతల వివరాలు

బుడతలు (5-9 సంవత్సరాలు)

ఒనిమా

1. వైష్ణవి వంగలపూడి - విజేత
2. వశిష్ట ఆచంట - రన్నరప్

తిరకాటం

1. మాన్వి పెనుగొండ - విజేత
2. కృతి తుమాటి - రన్నరప్

సిసింద్రీలు (10-14 సంవత్సరాలు)

ఒనిమా

1. శాన్వి పెనుగొండ - విజేత
2. షాన్వి పోకల - రన్నరప్

తిరకాటం

1. శాన్వి పెనుగొండ - విజేత
2. ధన్యత నెల్లూరు - రన్నరప్

పదరంగం

1. ఈషాన్వి పోరెడ్డి - విజేత
2. అగస్త్య యర్రంశెట్టి - రన్నరప్



చిరుతలు (12-16 సంవత్సరాలు)

ఒనిమా

1. లక్ష్మి మన్నెమెల - విజేత
2. నిహారిక నరహరి - రన్నరప్

తిరకాటం

1. లక్ష్మి మన్నెమెల - విజేత
2. ఆది గూడూరు - రన్నరప్

పదరంగం

1. లక్ష్మి మన్నెమెల - విజేత
2. మానస్ మన్నెపల్లి - ఈవెంట్‌కు మద్దతుగా నిలిచిన రన్నరప్

వాలంటీర్లు: గిరి మన్నెపల్లి, కావ్య ఇందుకూరు, కాంతి స్వరూప్ అన్న, కార్తీక్ సకినాల, నర్మద పెనుగొండ, ప్రవీణ్ గజ్జల, ప్రదీప్తి చిల్లరిగే, స్పందన నాగిరెడ్డి, సతీష్ మన్నెం, స్దందపుడి శ్రీనివాసులు, సుధాంగనాయుడు, శివరంజని సుధాంగనాయుడు.

ఈ కార్యక్రమం భాష, సంస్కృతి, సమాజ స్ఫూర్తిని చాటింది. పెరుగుతున్న భాగస్వామ్యం, ఉత్సాహభరితమైన ప్రమేయంతో టంపా బే ప్రాంతంలోని యువ తరంలో తెలుగు భాష, వారసత్వాన్ని ప్రోత్సహించడంలో ల్యాండ్ ఓ'లేక్స్/లట్జ్ శాఖ కీలక పాత్ర పోషించింది.









# స్వర్ణోత్సవ సంబరాలకు నాంది

## 2026-27 సంవత్సరానికి కార్యవర్గాన్ని ప్రకటించిన తెలుగు సాంస్కృతిక సమితి

హ్యూస్టన్ (టెక్సాస్): హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి (టీసీఏ) స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకోబోతున్న వేళ 2026 సంవత్సరానికి నూతన కార్యవర్గం, ట్రస్టీల పరిచయం. హ్యూస్టన్‌లో తెలుగు భాష, సాంస్కృతిక పరిరక్షణకు (టీసీఏ) ఐదు దశాబ్దాలుగా (1976-2026) అంకితభావంతో పని చేస్తోంది. ఈ మహత్తర సందర్భంలో 2026 సంవత్సరానికి ఎన్నికైన నూతన ఎగ్జిక్యూటివ్ బోర్డు, ట్రస్టీలను సమితి అధికారికంగా సభ్యులను ప్రజలకు పరిచయం చేస్తోంది. "దేశ భాషలందు తెలుగు లెస్స" అని మహాకవి శ్రీకృష్ణదేవరాయలు పలికిన మహోన్నత వాక్యం ప్రతి తెలుగు మనసులో వెలుగునింపినట్లే, ఈ సమితి ఐదు దశాబ్దాలుగా ఆ వెలుగును విదేశీ నేలపై నిలబెట్టింది.

"ఒక్క చేతితో చప్పుళ్లు రావు" అనే సామెతను సాక్షాత్కారం చేస్తూ... స్థాపకులు, గత కార్యవర్గాలు, ట్రస్టీలు, వాలంటీర్లు, సభ్యుల సమిష్టి కృషి వల్లే ఈ సంస్థ నేడు సమాజంలో గౌరవనీయ స్థానాన్ని సంపాదించింది. 1976లో చిన్న విత్తనంలా నాటిన ఈ సమితి నేడు విస్తారమైన వృక్షమై వేలాది కుటుంబాలకు నీడనిచ్చే స్థాయికి చేరుకుంది.

"ధర్మో రక్షతి రక్షితః" అనే సూక్తి మార్గదర్శకంగా విలువలు, నియమనిష్ఠలు, పారదర్శకతను కాపాడుతూ సమాజ సేవలో అంకితభావంతో పని చేస్తామని సమితి




సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. "మన సంస్కృతి మన ఆత్మ... మన భాష మన గౌరవం" అని పేర్కొంటూ, ప్రతి సభ్యుడు ఈ ప్రయాణంలో భాగస్వామి కావాలని సమితి అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు తమ సందేశంలో పిలుపునిచ్చారు.

సంఘ స్థిరత్వం, ఆర్థిక పారదర్శకత, దీర్ఘకాల దృక్పథానికి కట్టుబడి ఉంటామని ట్రస్టీలు తెలిపారు. "కలిసివస్తే కలదు సుఖం" అనే తెలుగు మాట స్ఫూర్తిగా, ఈ నూతన నాయకత్వ బృందం సభ్యుల ఆశీర్వాదం, పెద్దల మార్గదర్శనం, యువత ఉత్సాహంతో కలిసి సమాజానికి మరింత సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది.

హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి స్వర్ణోత్సవ సంవత్సరం ఒక మైలురాయి మాత్రమే కాదు అది ఐదు దశాబ్దాల త్యాగం, సేవ, ప్రేమ, ఐక్యతలకు ప్రతీక. ఈ గర్వకారణ సందర్భంలో నూతన ఎగ్జిక్యూటివ్ బోర్డు, ట్రస్టీలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. సమాజం తరపున శుభాకాంక్షలు చెప్పారు.

## వాసవి సేవా సంఘం ఆధ్వర్యంలో...

# పన్నులపై అవగాహన

కమ్మింగ్, అట్లాంటా: వాసవి సేవా సంఘం ఆధ్వర్యంలో పన్నులపై నిర్వహించిన అవగాహన సదస్సు అద్భుతమైన జ్ఞాన-ఆధారిత పరస్పర చర్య, నిజ-సమయ ఆచరణాత్మక చర్చలతో విజయవంతమైంది. పన్ను సంబంధిత ప్రశ్నలకు సీపీఏ హరిప్రసాద్ సాలియన్ (రియల్‌టాక్స్ అల్లీ) అద్భుతమైన, స్పష్టమైన, ఆచరణాత్మక సమాధానాలు ఇచ్చారు. హాజరైన వారందరికీ చాలా సమాచారం ప్రయోజనకరంగా ఉంది.

వివిధ సమూహాలు, సంఘాలకు చెందిన సభ్యులు ఉత్సాహభరితమైన భాగస్వామ్యం అందించారు. చురుకైన ప్రమేయం, ప్రోత్సాహం అర్థవంతమైన, ప్రభావవంతమైన కార్యక్రమాల నిర్వహణకు స్ఫూర్తినిచ్చింది. దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక, భద్రత కోసం అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించే వీలునామాలు, ట్రస్టులు, టెర్మ్ ఇన్సూరెన్స్‌పై రామకృష్ణ గోంట్ల ( తన విలువైన సూచనలు అందించారు.


సంక్షేమం, అవగాహన, శ్రేయస్సు కార్యక్రమాల ద్వారా సమాజానికి సేవ చేయడానికి కట్టుబడి ఉన్నామని వాసవి సేవా సంఘం ప్రకటించింది. మార్చి 8న మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని వెల్లడించింది.





# 'సుప్రీం' సీరియస్






- **8వ తరగతి పాఠ్యాంశంగా 'న్యాయ వ్యవస్థలో అవినీతి'..**
- **ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌పై తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి**
- **ఈ అంశాన్ని తొలగించాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం**

ఎనిమిదో తరగతి సిలబస్‌లో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' ఓ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. జాతీయ విద్య పరిశోధన శిక్షణ సంస్థ తీరుపై సుప్రీంకోర్టు మండిపడింది. ఇది అందర్నీ కలవరానికి గురిచేసిందని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సహించబోమని తేల్చిచెప్పింది. న్యాయస్థానం ఏ సంస్థనూ, ఏ వ్యక్తినీ కించపరచడానికి అనుమతించదని, ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. కొన్ని రోజులు ఆగితే దీనిపై సుమోటోగా విచారణ చేపడతామని పేర్కొన్నారు. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు దృష్టికి సీనియర్ న్యాయవాది, ఎంపీ కపిల్‌సిబల్ తీసుకొచ్చారు. ఎన్సీఆర్టీ 8వ తరగతిలో న్యాయవ్యవస్థలో అవినీతి గురించి బోధిస్తోందని వివరించారు. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం నుంచి స్పందన వచ్చింది.

సుప్రీంకోర్టు స్పందన నేపథ్యంలో పాఠ్య పుస్తకం నుంచి ఈ అంశాన్ని ఎన్సీఈఆర్టీ తొలగించనున్నట్టు ఉన్నత స్థాయి ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. "దీనిని చేర్చి ఉండకూడదు.. అటువంటి అంశాలను హైలైట్ చేయడం సముచితం కాదు.. బదులుగా స్ఫూర్తిదాయకమైన విషయాలు పొందుపరిచి ఉండాల్సింది" కేంద్ర ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి.

న్యాయ వ్యవస్థలో అవినీతి, దుష్ప్రవర్తన ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తాయని, ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ జులై 2025లో చేసిన వ్యాఖ్యలను పాఠ్యాంశంలో ప్రస్తావించారు. "ప్రజలకు విశ్వాసం కల్పించడానికి పారదర్శకత, జవాబుదారీతనం ప్రజాస్వామ్య ధర్మాలు" అని ఆయన అన్న వ్యాఖ్యలను పుస్తకంలో ఉటంకించారు. సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసిన కొద్దిసేపటికే ప్రభుత్వ వర్గాలు ఈ అంశంపై స్పందించాయి.

'ఎన్సీఈఆర్టీ 8వ తరగతి పాఠ్య పుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతి అనే అంశాన్ని పాఠంగా జోడించింది. మరి మంత్రులు, ప్రజా సేవకులు, దర్యాప్తు సంస్థలు సహా రాజకీయ నాయకులు భారీ అవినీతి సంగతి ఏంటి? వాటిని ఎందుకు పక్కనబెట్టాలి' అని కపిల్ సిబల్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. కాగా కొద్ది రోజుల కిందట 2016 నుంచి 2025 మధ్య సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులపై సుప్రీంకోర్టుకు 7,520 ఫిర్యాదులు అందినట్టు న్యాయ శాఖ నివేదిక విడుదల చేయడం గమనార్హం. దీనిపై సీనియర్ అభిషేక్ మను సింఘ్వీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇతర రంగాల్లో అవినీతిని పక్కనబెట్టి కేవలం న్యాయవ్యవస్థనే వేలెత్తి చూపుతున్నారని మండిపడ్డారు.

పాఠశాల స్థాయిలో విద్యలో పిల్లలకు విద్యావంతులను చేయాల్సింది పోయి ఇలాంటి సంక్లిష్టమై అంశాలను చేర్చడం ఏంటి? అని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా ప్రశ్నించారు.

# అన్నాడీఎంకేతో సీట్ల పంపకాలపై చర్చలు

### 50 సీట్లు ఆశిస్తున్న బీజేపీ



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండడంతో అన్నాడీఎంకేతో సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చలకు బీజేపీ సమాయత్తమవుతోంది. ఇరు పార్టీల మధ్య గురువారం చర్చలు జరగనున్నాయి. బీజేపీ నుంచి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సారథ్యం వహించనుండగా, అన్నాడీఎంకే నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి, సీనియర్ నేతలు పాల్గొననున్నారు.

కాగా 2024 ఎన్నికల్లో తమ పార్టీ సాధించిన 11 శాతం ఓట్ షేర్ ఆధారంగా బీజేపీ బేరసారాలు జరుపనున్నట్టు తెలుస్తోంది. 50 సీట్లను బీజేపీ ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్డీయే కూటమిలో బీజేపీతో పాటు టీటీవీ దినకరన్ 'అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం' (ఏఎంఎంకే), మరో రెండు పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన దినకరన్ 2018లో ఏఎంఎంకే పార్టీని స్థాపించారు. ఎన్డీయేలోకి తిరిగి రావడానికి బీజేపీనే కారణమని, ఆ పార్టీతోటే తాను సీట్ల సంప్రందింపులు సాగిస్తానని దినకరన్ స్పష్టం చేశారు.

అలాగైతేనే...

సీట్ల పంపకాలపై బీజేపీ సీనియర్ నేత ఒకరు మాట్లాడుతూ... బీజేపీకి 35 సీట్లు, ఏఎంఎంకే వంటి ఇతరులకు 15 సీట్లను పార్టీ కేంద్ర నాయకత్వం కోరనుందని చెప్పారు. 2024లో పార్టీ పనితీరు ఆధారంగానే 2026 ఎన్నికల్లో సీట్ల పంపకాలు ఉండాలంటూ అన్నాడీఎంకే నాయకత్వానికి తెలియజేశామని, 2021లో ఇచ్చినట్టుగా 20 సీట్లు ఇస్తామంటే తాము అంగీకరించేది లేదని చెప్పారు. ఏఎంఎంకే 8 నుంచి 10 సీట్లలో పోటీ చేయాలనుకుంటోందని, ఏసీ షణ్ముగం 'న్యూ జస్టిస్ పార్టీ', జాన్ పాండియన్ 'తమిళగ మక్కల్ మున్నేట్ర గళం' చెరో రెండు సీట్లు ఆశిస్తున్నాయని, తక్కిన సీట్లు ఇతర పార్టీలకు బీజేపీ కేటాయిస్తుందని చెప్పారు. కాగా 30 సీట్లకు తాము తగ్గేది లేదని, ఏఎంఎంకే 8 సీట్లయినా కావాలని గట్టిగా చెప్తోందని, దీంతో ఎన్డీయే బ్లాక్‌కు 40-50 సీట్లు కోరనున్నామని బీజేపీకి చెందిన మరో నేత తెలిపారు.

### 170 సీట్లలో అన్నాడీఎంకే పోటీ

కాగా అన్నాడీఎంకే సొంతంగా 170 సీట్లలో పోటీ చేసేందుకు పట్టుదలగా ఉంది. బీజేపీకి 25, ఎన్డీయే బ్లాక్‌కు మరో 10 సీట్లు కేటాయించగలమని చెబుతోంది. పీఎంకేకు 17 నుంచి సీట్లు, ఒక రాజ్యసభ సీటు ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. బీజేపీకి 50 సీట్లు ఇవ్వడం చాలా కష్టమని, అయితే సంప్రదింపుల్లో ఆమోదయోగ్యమైన పరిష్కారం కుదురుతుందని ఆశిస్తున్నామని అన్నాడీఎంకే సీనియర్ నేత ఒకరు చెప్పారు.

# అనిల్ అంబానీకి ఈడీ షాక్




### రూ.3,717 కోట్ల విలువైన ముంబై నివాసం జప్తు

ముంబై: రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ముంబైలోని ఆయన విలాసవంతమైన నివాసం 'అబోడ్'ను తాత్కాలికంగా జప్తు చేసింది. ఈ ఆస్తి విలువ రూ.3,716.83 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

పాలిహిల్ ప్రాంతంలో 66 మీటర్ల ఎత్తు, 17 అంతస్తులతో ఉన్న ఈ భవనానికి లగ్జరీ టవర్‌గా పేరుంది. అంబానీ గ్రూప్ సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ కోట్లాది రూపాయల మేర బ్యాంకు రుణాల మోసానికి పాల్పడిన కేసులో ఈ జప్తు జరిగింది. దీంతో ఈ కేసులో ఇప్పటిదాకా జప్తు చేసిన అనిల్ అంబానీ ఆస్తుల విలువ రూ.15,700 కోట్లకు చేరింది.

ఆర్‌సీవోఎం మోసపూరిత బ్యాంకింగ్ డీలింగ్స్‌తో ఈ తాజా ప్రాపర్టీకి సంబంధం ఉందని ఏజెన్సీ వర్గాలు తెలిపాయి. పీఎంఎల్‌ఏ కింద 2025 ఆగస్టులో అంబానీ స్టేట్‌మెంట్‌ను ఈడీ రికార్డు చేసింది. త్వరలోనే మరోసారి ఆయన్ను ఈడీ ప్రశ్నించనుంది. అనిల్ అంబానీ ఆర్‌సీవోఎంపై తొలుత సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంతో దీనిపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. గత జూలైలో 35కు పైగా ప్రదేశాల్లో సోదాలు నిర్వహించింది. గ్రూప్‌లోని 50 కంపెనీలకు చెందిన 25 మందికి పైగా వ్యక్తులను ప్రశ్నించింది.



# ప్రధాని మోదీకి అరుదైన గౌరవం

### - ఇజ్రాయెల్ పార్లమెంటు భవనం త్రివర్ణమయం!

న్యూఢిల్లీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఉదయం ఇజ్రాయెల్‌కు బయల్దేరి వెళ్లారు. ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన సతీమణి సారా స్వాగతం పలికారు. కాగా నెతన్యాహు.. మోదీని తన స్నేహితుడిగా అభివర్ణించారు.

ఈ రెండు రోజుల్లో ప్రధాని మోదీ అనేక ముఖ్యమైన రక్షణ, వ్యూహాత్మక అంశాలపై చర్చిస్తారు. తన పర్యటనలో మొదటి రోజు మోదీ.. నెతన్యాహుతో ప్రైవేట్ విందులో పాల్గొన్నారు. అనంతరం ఇజ్రాయెల్ పార్లమెంట్‌నుద్దేశించి ప్రసంగించారు. ఇరుదేశాల స్పెషల్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌నకు మోదీ పర్యటన ముందడుగుగా నిలుస్తుందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

# స్పెల్లింగ్ మిస్టేక్

### ఆ కుటుంబానికి 45 ఏళ్లుగా నో పెన్షన్



తండ్రి పేరులోని చిన్న స్పెల్లింగ్ లోపం కారణంగా ఒక మహిళ 45 సంవత్సరాలుగా ఒక పదవి నుంచి మరొక పదవికి పోటీ చేయవలసి వచ్చిందని, దాని ఫలితంగా ఆమె కుటుంబ పెన్షన్ నిలిచిపోయిందని దాఖలైన కేసును అలహాబాద్ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. కాన్పూర్ మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) అధికారులను కోర్టు మందలించి... వారంలోపు ఈ విషయాన్ని పరిష్కరించాలని ఆదేశించింది.

ఈ పిటిషన్‌ను మంజురాయ్ దాఖలు చేయగా... జస్టిస్ విక్రమ్ డి చౌహాన్ సింగిల్ బెంచ్ విచారించింది.

**కేసు నేపథ్యం**

పిటిషనర్ తండ్రి కాన్పూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగి. 1975లో ఉద్యోగ విరమణ చేసి ఆయన 1980లో మరణించారు. సర్వీసులో ఉన్నప్పుడు, ఉద్యోగ విరమణ తర్వాత ఆయన క్రమం తప్పకుండా పెన్షన్ పొందారు.

అయితే ఆయన మరణం తర్వాత... కుటుంబం కుటుంబ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు అతని పేరులోని స్పెల్లింగ్ వ్యత్యాసంపై శాఖ అభ్యంతరాలు లేవనెత్తింది.

**ఒక అక్షరం తేడా, సంవత్సరాల ఆలస్యం**

సర్వీస్ రికార్డులలో, అతని పేరు శిఖర్ నాథ్ శుక్లాగా నమోదైంది. దరఖాస్తు, కొన్ని ఇతర పత్రాల్లో అది శేఖర్ నాథ్ శుక్లాగా కనిపించింది. వైవిధ్యం కేవలం ఒక అక్షరం తేడా; ఇంగ్లీష్ స్పెల్లింగ్‌లో Eకి బదులుగా I. ఈ వ్యత్యాసాన్ని చూపుతూ... ఆ శాఖ కుటుంబ పెన్షన్ మంజూరు చేయడానికి నిరాకరించింది. 45 సంవత్సరాలుగా ఈ సమస్యను పరిష్కరించలేదు.

**కోర్టు పరిశీలనలు, సమర్పించబడిన పత్రాలు**

ఈ తేడా ఒకే అక్షరానికి పరిమితం అని, ఆ తప్పును స్పష్టం చేయడానికి అఫిడవిట్ సమర్పించామని పిటిషన్‌లో పేర్కొన్నారు. రెండు స్పెల్లింగ్‌లు ఒకే వ్యక్తిని సూచిస్తున్నాయని నిర్ధారించడానికి పిటిషనర్ వారసత్వ ధ్రువీకరణ పత్రం, ఇతర సహాయక పత్రాలను కూడా అందించారని కోర్టు గమనించింది.

**ఒక వారం గడువు, కమిషనర్‌కు హెచ్చరిక**

దీనిపై తీవ్రంగా స్పందించిన కోర్టు... వారం రోజుల్లోగా ఈ విషయాన్ని పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. ఈ ఆదేశాలను పాటించకపోతే ఫిబ్రవరి 26న జరిగే తదుపరి విచారణకు మున్సిపల్ కమిషనర్ స్వయంగా హాజరై ఆలస్యానికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందని కూడా హెచ్చరించింది.

# ఫౌండేషన్ సిబ్బందికి బిల్ గేట్స్ క్షమాపణలు

- ఎప్‌స్టీన్‌తో పరిచయమే అతిపెద్ద తప్పు
- అతని క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ తెలియదు
- అతను ఒక పెద్ద లైంగిక నేరగాడు
- తాను చట్టవిరుద్ధ పనులు చేయలేదని వ్యాఖ్య
- తన పొరపాటుతోనే వివాదమని భావోద్వేగం



ప్రపంచ టెక్ దిగ్గజం బిల్ గేట్స్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఎప్‌స్టీన్‌తో తనకున్న సంబంధాలపై మరోసారి స్పష్టతనిచ్చారా యన. ఈ సందర్భంగా ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పా రు. అలాగే రష్యన్ అమ్మాయిలతో తనకు సంబంధాలున్నట్టు వస్తోన్న ఆరోపణలపై కూడా క్లారిటీ ఇచ్చారు. అమెరికా కోర్టు ఇటీవల విడుదల చేసిన జెఫ్రీ ఎప్‌స్టీన్ పత్రాల్లో బిల్ గేట్స్ పేరు ఉండటం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ విషయ మై ప్రపంచ టెక్ దిగ్గజం గేట్స్ మరోసారి క్లారిటీ ఇస్తూ తాజాగా ఆ రహస్య ఫైళ్ల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు. కానీ తాను ఏనాడూ చట్టవిరుద్ధ పనులు చేయలేదని పేర్కొన్నారు. లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌తో గతంలో తనకున్న సంబంధాలపై స్పందిస్తూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన దాతృత్వ సంస్థ 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్' ఉద్యోగులతో నిర్వహించిన ఒక ప్రత్యేక భేటీ సందర్భంగా.. ఈ అంశంపై బహిరంగంగా క్షమాప ణలు చెప్పా రు. ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం తన జీవితంలో చేసిన అతి పెద్ద తప్పు అని ఆయన అంగీకరించారు. అలాగే రష్యన్ అమ్మా యిలతో సంబంధాలున్నాయంటూ తనపై వస్తోన్న ఆరోపణల పైనా గేట్స్ స్పష్టతనిచ్చారు. ఈ సమావేశంలో గేట్స్ తన తప్పును ఒప్పుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారని వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో రాసుకొచ్చింది. 'ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం నాడు నేను చేసిన అతిపెద్ద తప్పు. గేట్స్ ఫౌండేషన్ కార్యనిర్వాహకులను అతడి సమావేశాలకు తీసుకురావడమూ తప్పే. నా పొరపాటు వల్ల ఈ వివాదంలో ఇరుక్కున్న ప్రతిఒక్కరికీ నేను క్షమాపణలు చెబుతున్నాను. మా ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు ఇది పూర్తి గా విరుద్ధం' అని గేట్స్ చెప్పినట్టు తెలిపింది. ఫౌండేషన్ ప్రతిష్ఠ చాలా సున్నితమైనదని.. ఇలాంటి సంఘటనలు తమతో కలిసి పనిచేసే ప్రజల నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని టెక్ దిగ్గజం ఆందోళన వ్యక్తం చేశారని అందులో పేర్కొంది. అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన పత్రాల్లో.. ఎప్‌స్టీన్ రాసిన కొన్ని ఇ-మెయిల్ డ్రాఫ్టులు వెలుగులోకి వచ్చాయి. అందులో బిల్ గేట్స్‌కు డ్రగ్స్ సరఫరా చేయడం సహా రష్యన్ అమ్మాయిలతో సంబంధాలు ఏర్పాటు చేసేందుకు తాను సహకరించానని ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. ఈ ఆరోపణలను నాటి నుంచీ గేట్స్ ఖండిస్తూనే ఉన్నారు. తాను ఎలాంటి చట్టవిరుద్ధమైన పనులు చేయలేదని స్పష్టం చేశారు. ఆ ఫొటోల్లో తన పక్కన ఉన్న మహిళలు ఎప్‌స్టీన్ సహాయకులు మాత్రమేనని.. కావాలనే వారి ముఖాలకు మాస్క్ వేశారన్నారు. అలాగే ఎప్‌స్టీన్ వేధింపులకు గురైన బాధితులతో తాను ఏనాడూ సమయం కేటాయించలేదని గేట్స్ చెప్పుకొచ్చారు. ఇక.. ఎప్‌స్టీన్‌తో తన సంబంధాలపై గేట్స్ ప్రస్తావిస్తూ.. 2011-14 మధ్య కాలంలో ఎప్‌స్టీన్‌ను పలుమార్లు కలిసినట్టు అంగీక రించారు. అయితే.. ఆ సమయంలో అతడికున్న క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ గురించి అంత లోతుగా తనకు తెలియదన్నారు. తన మాజీ భార్య మెలిండా గేట్స్ మొదటి నుంచీ ఎప్‌స్టీన్ విషయంలో తనను హెచ్చరించిందని.. ఆ విషయంలో మెలిండాకు క్రెడిట్ ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న చర్చలను బట్టి చూస్తే.. నాడు తాను చేసిన పొరపాటు నేడు వందల రెట్లు పెద్దదిగా కనిపిస్తోందని ఆవేదన చెందారు.



# ఇది అమెరికాకు స్వర్ణయుగం: ట్రంప్

వాషింగ్టన్: వాషింగ్టన్: అమెరికా గతంలో కన్నా దృఢంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇది అమెరికాకు స్వర్ణయుగం అని ఆయన వెల్లడించారు. మంగళవా రం స్టేట్ ఆఫ్ ది యూనియన్ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక కాలంగా అభివర్ణించారు. తన పరిపాలన ప్రయాణం.. యుగాలకు మలుపుగా ఉంటుందని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. భవిష్యత్తులో దేశాన్ని మరింత మెరుగు పరుస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే జాతీయ పునరుజ్జీవం, ఆర్థిక వృద్ధితోపాటు ప్రపంచ ప్రభావంపై దృష్టి సారించినట్లు డొనాల్డ్ ట్రంప్ వివరించారు. ప్రపంచ స్థాయిలో అమెరికా మెరుగు పడిందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల వరకు అమెరికా సాదా సీదాగా ఉండేదని.. కానీ ప్రస్తుతం ప్రపంచంలోనే అగ్ర భాగాన నిలిచిందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ దేశ అత్యు న్నత పౌర పురస్కారం.. ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్‌ను పురుషుల హాకీ ఒలింపిక్స్ విజేత కానర్ హెల్లెబ్యూక్‌కు ప్రదానం చేయనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత తొమ్మిది మాసాల్లో అమెరికాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులు శాతం సున్నాకు చేరిందని పేర్కొన్నారు. 2028లో ఒలింపిక్స్‌కు అమెరికా వేదిక కానుందని ప్రకటించారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నిర్మిస్తున్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు. పౌరుల సంక్షేమానికే తమ తొలి ప్రాధాన్యమన్నారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనం కలిగిందన్నారు. అలాగే సరిహద్దు భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పూర్తిగా నిరోధించామని ట్రంప్ చెప్పారు. దేశంలోని ఆర్థిక అంశాలను సైతం ఈ సందర్భంగా ట్రంప్ ప్రస్తావించారు. గ్యాస్ ధరలు తగ్గించామని.. ఆ తర్వాత అంటే.. మూడు నెలల్లో యూఎస్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుందన్నారు. తమ కొత్త స్నేహితుడు, భాగస్వామి అయిన వెనిజులా నుంచి 80 మిలియన్ బ్యారెళ్ల చమురును తీసుకున్నామని ఆయన వివరించారు. ఇదంతా ఆ దేశ నాయకుడు నికోలస్ మదురోను పదవీచ్యుతుడిని చేసిన నాటి నుంచి నేటి వరకు ఇది చోటు చేసుకుందన్నారు. దాంతో ఆమెరికా చమురు ఉత్పత్తి రోజుకు 60 వేల బ్యారెళ్ల మేర పెరిగిందని సోదాహరణగా విపులీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో చేసిన ప్రతిజ్ఞ.. డ్రిల్, బేబీ, డ్రిల్‌ను ట్రంప్ ఉటంకించారు.

# భారత్-పాక్ యుద్ధాన్ని ఆపకపోయి ఉంటే..

గతేడాది భారత్-పాక్ దేశాల మధ్య తలెత్తిన ఉద్రిక్తతల గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మాట్లాడారు. ఈ రెండు దేశాల మధ్య జరగాల్సిన అణు యుద్ధాన్ని తానే ఆపానని మరోసారి చెప్పుకున్నారు. అయితే ఆ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు కాస్త గందరగోళానికి తెరతీశాయి. తాను జోక్యం చేసుకోకపోయి ఉంటే పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రాణాలు కోల్పోయి ఉండేవారిని అర్థం వచ్చేలా మాట్లాడారు. అయితే ట్రంప్ చెప్పాలనుకున్నది అది కాదు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లో తాను ఎనిమిది యుద్ధాలను ఆపానని అమెరికా కాంగ్రెస్ 'స్టేట్ ఆఫ్ యూని యన్' ప్రసంగంలో ట్రంప్ చెప్పారు. ఆ సందర్భంగా భారత్-పాక్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల గురించి మాట్లాడారు. 'పాకిస్థాన్ ప్రధాని చెప్పారు.. నేను లేకపోతే 35 మిలియన్ల మంది ప్రాణా లు కోల్పోయేవారని' అని చెప్పాలనుకున్నారు. అయితే ఆయన మాటల మధ్య విరామం లేకపోవడంతో 'నేను లేకపోతే పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పోయేవారని 35 మిలియన్ల మంది చెప్పారు' అనే అర్థం ధ్వనించింది. ట్రంప్ మాటల నేపథ్యంలో చాలా గందరగోళం నెలకొంది. కాగా, ట్రంప్ వ్యాఖ్యలపై పాకి స్థాన్‌లో కూడా ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. యుద్ధాన్ని ఆపాలని ప్రధాని షరీఫ్ వేడుకోవడంపై సోషల్ మీడియా వేదికగా ట్రోలింగ్ జరుగుతోంది. పాక్ పరువు తీసేలా ట్రంప్ మాట్లాడుతున్నా ఒక్కసారి కూడా ప్రధాని ఎందుకు స్పందించ డం లేదని చాలా మంది అడుగుతున్నారు.





# ఇజ్రాయెల్‌లో మోదీకి ఘనస్వాగతం

రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌కు చేరుకున్నారు. బెన్-గురియన్ విమానాశ్రయంలో మోదీకి ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వాగతం పలికారు. అనంతరం ఇరు నేతలు గౌరవ వందనం స్వీకరించారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్లో పర్యటిస్తుండటం ఇది. రెండోసారి. గతంలో 2017లో ఓసారి సందర్శించారు. ప్రస్తుత పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఇప్పటివరకు ఏ భారత ప్రధాని అక్కడి పార్లమెంట్ వేదికగా మాట్లాడలేదు. ఇరువురు ప్రధానులూ గాజా పరిస్థితితో పాటు పశ్చిమాసియాకు సంబందించిన పలు అంశాలపైనా చర్చించ నున్నారు. ప్రవాస భారతీయులతో మోదీ సంభాషించే అవకాశం ఉంది.. "మోదీ, నెతన్యాహుల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వారి దీర్ఘకాల స్నేహం.. ఇరుదేశాల మధ్య సంబంధా లను ప్రతిబింబిస్తోంది" అని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఎక్స్ పోస్ట్ చేసింది. పార్లమెంటులో ప్రసంగం అనంతరం మోదీకి నెతన్యాహు విందు ఇవ్వనున్నారు. గురువారం ఇరునేతలు సమా వేశమై.. ఆర్థిక, భద్రత, దౌత్య తదితర రంగాల్లో ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు.

మరొకరిని కిడ్నాప్ చేయబోయి..

## భారత సంతతి వ్యక్తి కిడ్నాప్ ఆపై హత్య

**కాలిఫోర్నియాలో దారుణం**



అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో దారుణం చోటు చేసుకుంది. భారత సంతతికి చెందిన అవతార్ సింగ్(57) కిడ్నాప్ ఉదంతం విషాదాంతమైంది. పట్టపగలు అందరూ చూస్తుండగానే అవతార్ సింగ్‌ని దుండగులు కిడ్నాప్ చేయడమే కాదు.. దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన స్థానిక సిక్కు కమ్యూనిటీని, ప్రవాస భారతీయులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మంగళవారం మధ్యాహ్నం కాలిఫోర్నియాలోని ట్రేసీ సిటీలో ఉన్న స్థానిక గురుద్వారా వెలుపల ఈ ఘటన జరిగింది. ప్రత్యక్ష సాక్షుల తెలిపిన వివరాల ప్రకారం.. ఒక తెల్లటి ఎస్‌యూవీలో వచ్చిన ముగ్గురు దుండగులు.. అవతార్ సింగ్‌ను కిడ్నాప్ చేశారు. వాస్తవానికి కిడ్నాపర్లు మరో వ్యక్తిని కిడ్నాప్ చేయాల్సింది పోయి.. తప్పుగా అవతార్ సింగ్‌ని కిడ్నాప్ చేశారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కిడ్నాపర్లు తమ గుట్టు బయటపడుతుందని భయంతో అవతార్ సింగ్‌ని హత్య చేసి 'లేక్ బెరీస్సా' సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో మృతదేహాన్ని వదిలేసినట్లు పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అవతార్ సింగ్ గత 20 ఏళ్లుగా ట్రేసీలోని గురు ద్వారాలో వాలంటీర్‌గా (వంట మనిషిగా) పనిచేస్తూ అందరితో మంచి సంబంధాలు కలిగి ఉండేవారు. ఆయనకు భార్య ఆరు నెలల వయసున్న ముగ్గురు కవల పిల్లలు ఉన్నారు. అవతార్ సింగ్ మరణం అతని కుటుంబాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

# శ్రీలంక అవుట్..కివీస్ ఘన విజయం



టీ20 ప్రపంచ కప్‌లో సెమీస్ అవకాశాలను న్యూజిలాండ్ మెరుగుపర్చుకుంది. కొలంబో వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో కివీస్ 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో శ్రీలంక 107/8 స్కోరుకే పరిమితమైంది. కమిందు మెండిస్ (31), దునిత్ వెల్లలాగే (20) మాత్రమే రాణించారు. వారితో పాటు కుశాల్ మెండిస్ (11), పవన్ రత్నాయకె (10) మినహా.. మరెవరూ రెండంకెల స్కోరు చేయలేదు. రచిన్ రవీంద్ర (4/27) దెబ్బకు శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్ కుదేలైంది. టీ20 ప్రపంచ కప్ సెంచరీ హీరో నిశాంక (0) డకౌట్గా పెవిలియన్కు చేరాడు. చరిత్ ఆసలంక (5), దాసున్ శనక (3), దుషాన్. హేమంత (3) విఫలమయ్యారు. రచిన్ తోపాటు మ్యాట్ హెన్రీ 2. సాంట్నర్, ఫిలిప్స్ చెరో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా రచిన్ రవీంద్ర నిలిచాడు.

**సాంట్నర్-కోల్ కీలక భాగస్వామ్యం**

తొలి 12 ఓవర్ల ఆట చూశాక.. న్యూజిలాండ్ స్కోరు 100ం వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఎందుకంటే 84 పరుగులకే ఆరు వికెట్లను కోల్పోయిన ఆ జట్టును కెప్టెన్ సాంట్నర్ (47), కోలె మెక్కాంచి (31) ఆదుకొన్నారు. వీరిద్దరూ ఏడో వికెట్ కు 84 పరుగులు జోడించారు. రచిన్ రవీంద్ర (32), ఫిన్ అలెన్ (23), గ్లెన్ ఫిలిప్స్ (18) ఫర్వాలేదనిపించారు. టిమ్ సీఫెర్డ్ (8), డారిల్ మిచెల్ (3), మార్క్ చాప్మన్ (0) నిరాశపరిచారు. శ్రీలంక బౌలర్లలో చమీర 3, తీక్షణ 3, వెల్లలాగె ఒక వికెట్ తీశారు..

**శ్రీలంక నిష్క్రమణ**

వరుసగా రెండు మ్యాచుల్లోనూ ఓటమితో శ్రీలంక టీ20 ప్రపంచ కప్ సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. న్యూజిలాండ్ (3 పాయింట్లు), పాకిస్థాన్ (1 పాయింట్) మధ్యే గ్రూప్–2 నుంచి రెండో సెమీస్ బెర్తు కోసం పోటీ ఉంది. పాకిస్థాన్ తన చివరి మ్యాచ్ను శ్రీలంకతో ఫిబ్రవరి 26న, ఇంగ్లాండ్‌తో న్యూజిలాండ్ ఫిబ్రవరి 27న తలపడనున్నాయి. ఒకవేళ ఇంగ్లాండ్పై కివీస్ గెలిస్తే.. పాక్ ఇంటిముఖం పట్టినట్లే. అలా కాకుండా కివీస్ ఓడితే మాత్రం పాక్‌కు కొద్దిగా అవకాశాలు ఉంటాయని భావించవచ్చు. అప్పుడు శ్రీలంకపై మెరుగైన నెట్‌రన్ రేట్‌తో గెలవాల్సి ఉంటుంది.

# భారత్-జింబాబ్వే మ్యాచ్.. అందుబాటులోకి రింకు సింగ్



టీమిండియా స్టార్ బ్యాటర్, ఫినిషర్ రింకు సింగ్ మంగళ వారం ఉన్నట్టుండి జట్టుని వీడిన సంగతి తెలిసిందే. కుటుంబ అత్యవసర కారణాల వల్ల రింకు స్వగ్రామానికి వెళ్లినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అతడి తండ్రి కచన్‌చంద్ సింగ్ క్యాన్సర్‌తో పోరాడుతూ వెంటిలెటర్‌పై చికిత్స తీసుకుంటున్నట్లు సమాచారం. గురువారం చెన్నైలోని చిదంబరం వేదికగా భారత్.. జింబాబ్వేతో కీలక పోరులో తలపడనుంది. రింకు ఉన్నట్టుండి జట్టును వీడటం తో అభిమానుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలోనే రింకు సింగ్‌పై టీమిండియా ఓ కీలక అప్‌డేట్ ఇచ్చింది. సూపర్ 8లో జింబాబ్వేతో గురువారం జరిగే మ్యాచ్‌లో రింకు సింగ్ అందుబా టులో ఉంటాడని టీమిండియా బ్యాటింగ్ కోచ్ శితాంశు కోటక్ స్పష్టం చేశారు. 'రింకు తండ్రి అనారోగ్యంతో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబంతో ఉండటానికి రింకు జట్టు వీడాడు. కానీ జింబాబ్వేతో మ్యాచ్‌కు అతడు అందు బాటులో ఉంటాడు. బుధవా రం సాయంత్రానికి రింకు భారత జట్టుతో చేరుతాడు' అని కోటక్ స్పష్టం చేశాడు.

**భారత్‌కు కీలక మ్యాచ్**

డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌కు జింబాబ్వేతో మ్యాచ్ అత్యం త కీలకం. సూపర్ 8లో దక్షిణాఫ్రికాపై 76 పరుగుల తేడాతో భారత్ ఓటమిపాలైంది. దీనివల్ల నెట్ రన్‌రేట్ -3.800కు పడిపో యింది. కాబట్టి ఈ మ్యాచ్‌లో భారీ తేడాతో గెలిస్తేనే సెమీస్ ఆశ లు సజీవంగా ఉంటాయి. మరోవైపు టాప్ ఆర్డర్ బ్యాటింగ్ వైఫ ల్యం జట్టును కలవరపెడుతోంది. అభిషేక్ శర్మ ఫామ్ జట్టుకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇటు ఫినిషర్‌గా రింకు సింగ్ కూడా మంచి ప్రదర్శనలు చేయలేదు. జింబాబ్వేతో మ్యాచ్‌లో కట్టుదిట్ట మైన ప్రణాళికతో బరిలోకి దిగి విజయం సాధించాలని భారత్ అభిమానులు కోరుకుంటున్నారు.

## బట్లర్.. పవర్‌హౌస్ ఆఫ్ వరల్డ్ క్రికెట్ అండగా హ్యారీ బ్రూక్




టీ20 ప్రపంచకప్ 2026లో సెమీస్‌కు అర్హత సాధించిన తొలి జట్టుగా ఇంగ్లండ్ నిలిచిన సంగతి తెలిసిందే. మంగళవా రం పాకిస్థాన్‌పై 2 రెండు వికెట్ల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్ లో ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ సెంచరీతో చెలరేగి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే జట్టులో సీనియ ర్ ప్లేయర్, వికెట్ కీపర్ జోస్ బట్లర్ ఫామ్‌పై చర్చలు మొదల య్యాయి. ఈ టోర్నీలో ఇప్పటివరకు కేవలం 62 పరుగులే చేసి న బట్లర్‌పై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ నేపథ్యంలో కెప్టెన్ హ్యారీ బ్రూక్.. బట్లర్‌కు అండగా నిలిచాడు. "బట్లర్ గురించి నేను చాలా సార్లు చెప్పాను. అతడు పవర్ హౌస్ ఆఫ్ వరల్డ్ క్రికెట్. జట్టుకు అవసరం అయినప్పుడల్లా ఆదుకున్నాడు. ప్రతి ఫార్మాట్‌లో రాణించాడు. వన్డే, టీ20 ప్రపంచ కప్‌లు గెలిచాడు. ప్రస్తుతం ఫామ్‌లో లేడు అంతే. ప్రతి ప్లేయర్‌కు ఇలాంటి దశ ఒకటుంటుంది. బట్లర్ 500కి పైగా టీ20లు ఆడాడు. ఇంగ్లండ్ తరఫున 150కి పైగా మ్యాచ్‌లు ఆడాడు. ప్రస్తుతం బంతి అతడి బ్యాట్‌కు మిడిల్ అవ్వకపోవచ్చు. కానీ అతడే మా బెస్ట్ ప్లేయర్' అని హ్యారీ బ్రూక్ చెప్పుకొచ్చాడు. 35 ఏళ్ల బట్లర్ ఇంగ్లండ్ తరఫున 153 టి20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 4012 పరుగులు సాధించాడు. తాజాగా ఇంగ్లండ్ తరఫున అత్యధిక మ్యాచ్‌లు ఆడిన క్రికెటర్‌గా నిలిచాడు. ఇదిలా ఉండగా.. సూపర్ 8 గ్రూప్ 2లో ఇప్పటికే ఇంగ్లండ్ సెమీస్‌కు దూసుకెళ్లింది. రెండో స్థానం కోసం శ్రీలంక, న్యూజిలాండ్, పాకిస్థాన్ పోటీ పడుతున్నాయి. తన చివరి సూపర్ 8 మ్యాచ్‌ను ఇంగ్లండ్.. న్యూజిలాండ్‌తో ఆడ నుంది. మరోవైపు గ్రూప్ 1లో ఇంకా ఏ జట్టు సెమీస్‌కి వెళ్లలే దు. భారత్, సౌతాఫ్రికా, జింబాబ్వే, వెస్టిండీస్ జట్ల మధ్య పోరు రసవత్తరంగా సాగనుంది.

## మ్యాచ్ మధ్యలో గాయపడిన పక్షికి సీపీఆర్

**- ఫుట్‌బాల్ ప్లేయర్‌పై ప్రశంసలు**



టర్కీలో ఓ అరుదైన సంఘటన చోటు చేసుకుంది. ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతుండగా బంతి తగిలి గాయపడిన సీగల్ పక్షికి ఆటగాడు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇస్తాంబుల్ ఫస్ట్ అమెచ్యూర్ లీగ్‌లో భాగంగా ఇస్తాంబుల్ యుర్డమ్ స్పోర్–మెవ్లానాకపి గుజెల్‌హిసార్ జట్లు ప్లే ఆఫ్ ఫైనల్‌లో తలపడుతున్నాయి. ఈ మ్యాచ్ జరుగుతుండగా గోల్ కీపర్ ముహమ్మెత్ కొట్టిన బంతి అక్కడే ఎగురుతున్న సీగల్ పక్షికి బలంగా తగిలింది. వెంటనే అది మైదానంలోనే కుప్పకూలింది. ఇస్తాంబుల్ కెప్టెన్ కాటన్ హుటాహుటిన పక్షి దగ్గరికి చూశాడు. శ్వాస తీసుకోవడం లేదని గమనించి వెంటనే సీపీఆర్ చేసి కాపాడాడు. అక్కడే వైద్య బృందానికి సీగల్‌ను అప్పగించాడు. ఈ విషయంపై కాటన్ స్పందించాడు. 'మైదానంలో ఏదో పడుతున్న ట్లు అనిపించింది. వెంటనే దగ్గరికి వెళ్లి చూసేసరికి అది సీగల్ పక్షి. బంతి బలంగా తాకడం వల్ల ఊపిరి తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతుంది. దీంతో సీపీఆర్ చేయాలని అనుకున్నా. అదృష్టం కొద్ది పక్షిలో కదలిక కనిపించింది. ఈ మ్యాచ్‌లో మేము ఓడిపోయినా.. ఛాంపియన్స్‌గా నిలివకపోయినా ఓ ప్రాణాన్ని కాపాడటమే ముఖ్యమని భావించాను' అని కాటన్ వెల్లడించా డు. మ్యాచ్ కామెంటేటర్ స్పందిస్తూ 'ఇది ఫుట్‌బాల్ చరిత్రలోనే అరుదైన క్షణం' అంటూ వ్యాఖ్యానించాడు. సీగల్ పక్షిని పరీ క్షించిన వైద్య బృందం.. దాని రెక్కలకు గాయమైందని ఎలాంటి ప్రాణాపాయం లేదని వెల్లడించారు. కాగా కాటన్ చేసిన పనికి నెట్టింట ప్రశంసల జల్లు కురుస్తోంది.

## జింబాబ్వేతో మ్యాచ్.. బ్యాటింగ్ పిచ్ సిద్ధం



టీ20 ప్రపంచ కప్ 2026 సూపర్–8 ఆసక్తికరంగా సాగుతోం ది. గ్రూప్–2 నుంచి ఇప్పటికే ఇంగ్లండ్ జట్టు సెమీఫైనల్స్ చేరిం ది. మరో స్థానం కోసం శ్రీలంక, న్యూజిలాండ్, పాకిస్థాన్ పోటీ పడుతున్నాయి. మరోవైపు గ్రూప్–1లో ఇప్పటి వరకు ఏ జట్టు సెమీస్ బెర్తును కన్ఫర్మ్ చేసుకోలేదు. ఈ రేసులో భారత్, సౌతాఫ్రి కా, వెస్టిండీస్, జింబాబ్వే ఉన్నాయి. దక్షిణాఫ్రికా చేతిలో టీమిండి యా 76 పరుగుల తేడాతో ఓటమి పాలు కావడంతో నెట్ రన్ రేట్ దారుణంగా పడిపోయింది. దీంతో భారత్ సెమీస్ అవకాశా లు సంక్లిష్టమయ్యాయి. ఈ నేపథ్యంలో జింబాబ్వే, వెస్టిండీస్ జట్ల తో జరగబోయే మ్యాచుల్లో భారత్ తప్పనిసరిగా భారీ తేడాతో గెల వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో అభిమానులకు ఆనందా న్ని కలిగించే వార్త ఒకటి బయటకు వచ్చింది. ఫిబ్రవరి 26న భారత్, జింబాబ్వే తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదిక కానుంది. ఈ మ్యాచ్ కోసం కొత్త పిచ్‌ను వినియోగించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ పిచ్‌ను దేశవాళీ మ్యాచ్‌ల కోసం వినియోగించలేదని సమా చారం. గురువారం జరిగే మ్యాచ్‌కు ఉపయోగించే పిచ్ బ్యాటింగ్ కు అనుకూలంగా ఉందని తెలుస్తోంది. బ్యాట్ మీదకు బంతి చక్కగా వస్తుందని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో మ్యాచ్‌లో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది. భారత్ తొలుత బ్యాటింగ్ చేస్తే.. భారీ స్కోర్ చేయాలని అభిమా నులు ఆశిస్తున్నారు. భారత్ సెమీస్‌కు చేరాలంటే.. ఈ మ్యాచ్ కీలకంగా మారింది. జింబాబ్వేపై భారీ తేడాతో గెలిస్తేనే సెమీస్ ఆశలు సజీవంగా ఉంటాయి. ఈ క్రమంలోనే పిచ్ రిపోర్ట్ భారత్ కు శుభవార్తేనని క్రీడా నిపుణులు అంటున్నారు.

చైతన్య రథం
సినిమా
గురువారం 26 ఫిబ్రవరి 2026 X

# ఈ సినిమాపై రూ.4,000కోట్లు పెట్టా

## స్టార్ ప్రొడ్యూసర్ నమిత్ మల్హోత్రా

## మచ్ అవైటెడ్ పాన్ వరల్డ్ మూవీ..



రామాయణ: పార్ట్-1. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చిత్రీకరణ జరుపుకుంటున్న సినిమాల్లో ఇదీ ఒకటి. బడ్జెట్, నిర్మాణ వ్యయం హాలీవుడ్ రేంజ్‌ను మించిపోయిందంటే ఆశ్చర్యం కలగకమానదు. శ్రీరాముడిగా రణబీర్‌కపూర్, సీతమ్మగా సాయిపల్లవి నటిస్తున్నారు. లంకాధిపతి రావణా సురుడిగా రాకింగ్ స్టార్ యష్ మెరు పులు మెరిపించనున్నాడు. హనుమం తుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. స్టార్ ప్రొడ్యూ స్ నమిత్ మల్హోత్రా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అమెరికా లాస్ ఏంజి లిస్‌లోని సినిమార్క్ ప్లయా విస్టాలో ఈ సినిమా రఫ్ కట్‌ను ప్రదర్శించారు. 18-60 ఏళ్ల మధ్య వయసు ప్రేక్షకులు హాజరై సినిమాపై ప్రశంసలు కురిపించారు.

ఈ ప్రాజెక్ట్ కోసం దాదాపు 4,000 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు నమిత్ మల్హోత్రా తెలిపారు. గేమ్ ఛేంజర్స్ అనే పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడారు. పార్ట్-1 షూటింగ్ దాదాపు పూర్తయిం దని, సినిమా ప్లాన్ చేసినప్పుడు భారీ విజన్ ఉందని, అందుకే ఖర్చుకు వెను కాడలేదని తెలిపారు. ఒక్క రూపాయి కూడా ఎక్కడా అప్పు తీసుకోలేదని, డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో తనకు తెలియదని వ్యాఖ్యానించారు. ఈ సినిమాను ఓ ప్రాజెక్ట్ లేదా వ్యాపారంగా చూడట్లేదని తెలిపారు.

# లేలేత మెరుపులు

## ఫ్యాన్స్‌ని మంత్రముగ్ధుల్ని చేస్తున్న రుక్మిణి



కొత్త నీరు వస్తే పాత నీరు పోతుంది అనేది ఎంత వాస్తవ మో.. కొత్త హీరోయిన్లు వచ్చే సరికి పాత వాళ్ల క్రేజ్ తగ్గు తుందనే కామెంట్లు కూడా అంతే వాస్తవం. అయితే కొత్త హీరోయిన్లు తమ లేలేత మెరు పులతో అభిమానులను ఆకట్టు కునే ప్రయత్నం చేస్తున్నారు. సినీ రంగంలో అడుగుపెట్టి తమ అం దంతో ప్రేక్షకుల్లో ఉనికి సంపాదించు కుంటూనే.. ఇంకొక వైపు నటనతో విశ్వరూపం చూపించే ప్రయత్నం చేస్తున్నా రు. సోషల్ మీడియా లో కూడా యాక్టివ్ గా ఉంటూ.. ఫాలోవర్స్‌ను పెంచుకుంటూ బ్రాండ్ ప్రమోటర్స్‌గా కూడా మారుతున్నారు.

2024లో నిఖిల్ సిద్ధార్థ హీరోగా నటించిన'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది రుక్మిణి వసంత్. అంతకు ముందు కన్నడ లో నటించిన ఈమెకు మంచి గుర్తింపు లభించింది కానీ ఈ తొలి తెలుగు చిత్రం తో పెద్దగా గుర్తింపు సంపాదించుకోలేక పోయింది. ఆ తర్వాత ఏఆర్ మురగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్ హీరోగా మదరాసి సినిమాతో తమిళ్ ఎంట్రీ ఇచ్చిం ది. అది కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ ఎప్పుడైతే రిషబ్ శెట్టి తన కాంతార చాప్టర్-2 సినిమాలో అవకాశం కల్పిం చారో అప్పట్నుంచీ ఈమె వార్తల్లో నిలు స్తూ వచ్చింది. ఈ ఒక్క సినిమాతో ఏకం గా పాన్ ఇండియా స్థాయి గుర్తింపు సొం తం చేసుకుందని చెప్పవచ్చు. ఇకపోతే ఈ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడానికంటే ముందే ఈమె ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్‌కాంబినేషన్లో వస్తున్న డ్రాగన్ సినిమాకి కూడా సైన్ చేసింది. ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా విక్రమ్ కొడుకు ధృవ్ విక్రమ్ హీరోగా వస్తున్న సినిమాకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ఈమె.. మరొకవైపు నాగచైతన్య కొత్త సినిమాలో కూడా అవకాశం దక్కించు కున్నట్టు తెలుస్తోంది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో హీరో యష్ నటిస్తున్న టాక్సిక్ సినిమాలో కూడా రుక్మిణి వసంత్ కీలకపాత్ర పోషిస్తోంది. తాజాగా సింపుల్ లుక్‌లో లేత అందాలను చూపిస్తూ అభిమానులను మెస్మరైజ్ చేసింది. అమ్మడి అందానికి ఫ్యాన్స్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

# భోగి మాస్ లుక్‌లో శర్వానంద్

ఈ సంక్రాంతికి ఎలాంటి భారీ ప్రచారం లేకుండానే విడుదలైన నారీ నారీ నడుమ మురారి సినిమాతో ఘన విజయం అందుకున్న శర్వానంద్ ఇప్పుడు ఫుల్ కాన్ఫిడెన్స్‌లో ఉన్నాడు. ఆ సినిమా తో బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిన ఆయన తన తదుపరి ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకులను




అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే 'బైకర్' పేరుతో రూపొందుతున్న చిత్ర టీజర్ మంచి ఆసక్తి రేకెత్తించగా తాజాగా మరో సినిమా నుంచి కీలక సమాచారం బయటకు వచ్చింది. శర్వా ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న భోగి సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదలైంది. రిలీజ్ డేట్‌ను కూడా అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 28న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.

తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శర్వానంద్ పూర్తిగా మాస్, రగ్గడ్ అవతారంలో కనిపించి అభిమానులను ఆశ్చర్యానికి గురిచేశాడు. సాధారణంగా లవర్ బాయ్ ఇమేజ్‌తో కనిపించే శర్వా, ఈసారి రఫ్ లుక్‌లో దర్శనమివ్వడంతో సోషల్ మీడియాలో విభిన్న కామెంట్లు వస్తున్నాయి. "ఇంత షాకింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎలా సాధ్యమైంది?" అంటూ అభిమానులు చర్చించుకుంటున్నారు.

# అతడు సెకండ్ రిలీజ్-గ్రాండ్ బుకింగ్స్



టాలీవుడ్ హిస్టరీలో మహేష్‌బాబు హీరోగా వచ్చిన అతడు సినిమా రేంజే వేరు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇది. యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఈ సినిమా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. రీ-రిలీజ్ ట్రెండ్ నడుస్తున్న నేపథ్యంలో ఇప్పటికే ఒకసారి థియేటర్లకు వచ్చి మంచి వసూళ్లు రాబట్టిన అతడు సినిమా.. ఇప్పుడు రెండోసారి గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఫిబ్రవరి 28న ఈ సినిమా ను రీ- రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యం లో బుకింగ్స్ ఓపెన్ కాగా భారీ డిమాండ్ కనిపిస్తోంది.

తాజాగా విడుదలైన డేటా ప్రకారం ఈ చిత్రానికి ప్రేక్షకులు 10/9.8 రేటింగ్ ఇచ్చారు. 13.9 వేలకు పైగా ఓట్లు నమో దవడం ఈ మూవీకి ఉన్న ప్రజాదరణను స్పష్టంగా చూపిస్తోంది. సుమారు 2 గంటల 52 నిమిషాల నిడివి ఉన్న ఈ చిత్రం యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. యూ సర్టిఫికెట్‌తో 2005 ఆగస్టు 10న విడుదలైన ఈ సినిమా అప్పట్లోనే కాక ఇప్పటికీ అదే ఉత్సాహంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా కథలోని సస్పెన్స్, యాక్షన్ సన్నివేశాలు సినిమాను క్లాసిక్‌గా నిలబెట్టాయి.

ప్రస్తుతం ట్రెండింగ్‌లో కొనసాగుతున్న ఈ చిత్రానికి గత 24 గంటల్లోనే వేల టికెట్లు బుక్ కావడం విశేషం. పాత సినిమా అయినప్పటికీ ప్రేక్షకులు ఇంకా ఆసక్తిగా చూస్తుండటం దీని క్రేజ్ తగ్గలేదని చెప్పడానికి నిదర్శనం. మొత్తంగా చూస్తే, మంచి కథ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన పొందుతోందని మరోసారి అర్థమవుతోంది.

# ఒకే రోజు రెండుసార్లు పెళ్లి!

టాలీవుడ్ మోస్ట్ లవబుల్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరికొద్ది గంటల్లో వివాహ బంధంతో ఒకటి కాబోతున్నారు. వీరి పెళ్లి రెండు భిన్న సంప్రదాయాల కలయికగా నిలవనుంది. విజయ్ తెలుగు కుటుంబానికి చెందిన వాడు కావడం, రష్మిక కర్ణాటకలోని కొడవ కమ్యూనిటీకి చెందిన అమ్మాయి కావడంతో.. ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం ఉదయం తెలుగు పద్ధతిలోను, సాయంత్రం కొడవ ఆచారాల (మంగళ) ప్రకారం వీరి వివాహ వేడుకలు జరగనున్నాయి. కర్ణాటకలోని కొడగు జిల్లాకు చెందిన కొడవ సమాజానికి ఉన్న ప్రత్యేక సంస్కృతిని గౌరవిస్తూ... ఈ జంట రెండు రాష్ట్రాల సంప్రదాయాలను మేళవించి కొత్త జీవితాన్ని ప్రారంభించబోతుండటం విశేషం.

గత ఎనిమిదేళ్లుగా ప్రేమలో ఉన్న విజయ్-రష్మిక తమ బంధాన్ని పెళ్లి పీటల వరకు తీసుకెళ్లారు. ఉదయ్‌పూర్‌లోని ఆరావళి కొండల మధ్య ఉన్న ఐటీసీ మెమెంటోస్ హోటల్‌లో ఈ వేడుకలు జరుగుతున్నా యి. మంగళవారం జరిగిన సంగీత్, మెహందీ వేడుకల్లో వీరిద్దరి ప్రేమకథను ప్రతిబింబించేలా గత ఎనిమిదేళ్ల ఫొటోలతో అలంకరించిన డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ వివాహాన్ని పూర్తిగా ప్రైవేట్ ఈవెంట్‌గా నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫోటోలు, వీడియోలు బయటకు రాకుండా కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. అతిథుల జాబితాను కూడా పరిమితంగానే ఉంచారని అంటు న్నారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహిత మిత్రులు మాత్రమే ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం.





మార్చి 3న హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్ తాజ్ కృష్ణలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ రిసెప్షన్ వేడుకకు టాలీవుడ్‌కు చెందిన ప్రముఖులు, ఇతర భాషల సినీ తారలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు హాజరవుతారని ప్రచారం జరుగుతోంది.